

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914


విజయవాడ సంపుటి : 60 సంచిక : 334 • పేజీలు : 12 • సోమవారం 26 ఆగస్టు 2024 • వెల : రూ. 5.00 Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati


- తెలంగాణలో అన్ని టీడీపీ కమిటీలు రద్దు..
- తనకు రెండు రాష్ట్రాలు రెండు కళ్లలాంటివి
- హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం
- కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు వెల్లడి
- పార్టీలో ఎవరైతే ఎక్కువ సభ్యత్వాలు చేస్తారో వారికే పార్టీలో ప్రాధాన్యత
- రెండు ప్రాంతాలను సమాన అభివృద్ధి చేయాలనేదే తన అభిమతం
- ఇక నుంచి ప్రతి నెలా రెండు రోజులు రాష్ట్రానికి వస్తా..
- తెలంగాణ రాష్ట్రంలో కూడా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



# పార్టీని బలోపేతం చేయాలి

## టిటిడిపి బలోపేతానికి ఏపీ సీఎం చంద్రబాబ కీలక నిర్ణయాలు

**హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** తెలంగాణలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు కసరత్తులు మొదలుపెట్టారు. ఈరోజు హైదరాబాద్ లోని ఎన్టీఆర్ భవన్ లో పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని నిర్ణయించుకున్న ఆయన మిగతా 7లో

# కఠినమైన శిక్షలు పడాలి..

- కఠినమైన శిక్షలు పడేలా చట్టాలు పటిష్టం చేస్తాం..
- దోషులు ఎవరైనా సరే, వారిని విడిచిపెట్టకూడదు
- రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళల భద్రత చాలా ముఖ్యం
- రూ.25,000 కోట్ల కంటే తక్కువ రుణాలు ఇచ్చాం
- భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ?
- లఖ్‌పతి దీదీ పథకం మహిళలకు ఆదాయాన్ని పెంచుతుంది
- లఖ్‌పతి దీదీ ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ

**ముంబయి,ఆగస్టు 25 :** మహిళలపై నేరాలకు కఠినమైన శిక్షలు విధించేలా చట్టాలను మరింత పటిష్టపరుస్తామని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఆదివారం ఉత్తర మహారాష్ట్రలోని జల్గావ్‌లో నిర్వహించిన లఖ్‌పతి దీదీ ర్యాలీలో ప్రధాని మాట్లాడారు. మహిళల కోసం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి గత ప్రభుత్వాలు చేసిన దానికంటే గత పదేళ్లలో తమ ప్రభుత్వం ఎక్కువ చేసిందని ప్రధాని మోడీ అన్నారు. 2014 వరకు, మహిళా స్వయం సహాయక మిగతా 7లో



# బిహార్ అసెంబ్లీ ఎన్నికలు..

## - ప్రశాంత్ కిశోర్ కీలక ప్రకటన



**పట్నా,ఆగస్టు 25 :** ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం తాను చేపడుతున్న 'జన్ సురాజ్' యాత్రను రాజకీయ పార్టీగా మలచనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన ఆయన..వచ్చే ఏడాది జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 243 స్థానాల్లోనూ పార్టీ అభ్యర్థులను బరిలోకి దించుతానని తాజాగా మిగతా 7లో

# రాం విలాస్ చీఫ్‌గా చిరాగ్ ఎన్నిక

**రాంచీ,ఆగస్టు 25 :** కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ మరోసారి లోక్‌జనశక్తి పార్టీ (రాం విలాస్) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం రాంచీలో జరిగిన ఆ పార్టీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐదేళ్ల పాటు చిరాగ్ ఎల్జేపీ (రాం విలాస్) అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో భాజపాతో కలిసి పోటీచేసిన చిరాగ్ పాసవాన్.. ప్రస్తుతం ఎన్డీయే మిగతా 7లో



# మోదీకి పాకిస్తాన్ ఆహ్వానం..

**న్యూఢిల్లీ,ఆగస్టు 25 :** భారత ప్రధాని నరేంద్ర మోడీని పాకిస్థాన్ ప్రభుత్వం తమ దేశానికి ఆహ్వానించింది. వచ్చే అక్టోబర్ లో నిర్వహించబోయే కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ (సీహెచ్ జీ) సమావేశంలో పాల్గొనేందుకు రావాలని కోరింది. మోడీతో సహా షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో)కు చెందిన ఇతర నేతలనూ పిలిచింది. ఈ సదస్సును ఇస్లామాబాద్ లో నిర్వహించేందుకు పాక్ మిగతా 7లో



- తిరుమలలో ప్రత్యేకంగా 8 ప్రథమ చికిత్స కేంద్రాలు
- అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి
- ఆరు ప్రథమ చికిత్స కేంద్రాల్లో ఉద్యోగులు, స్థానికులకు తితిదే వైద్య సేవలు

**తిరుమల,ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తితిదే వైద్య విభాగం చర్యలు చేపడుతోంది. నూతనంగా 8 ప్రథమ చికిత్స కేంద్రాలను మిగతా 7లో



# తితిదే కీలక నిర్ణయం

# టెలిగ్రామ్ సీఈవో అరెస్ట్..



- పావెల్ దురోవ్‌ను పారిస్‌లో పోలీసులు అరెస్టు
- మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలు వంటి ఆరోపణలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 25 :** టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈఓ పావెల్ దురోవ్‌ను పారిస్‌లో పోలీసులు అరెస్టు చేశారు. అజర్‌బైజాన్ మిగతా 7లో

# వైద్యురాలి హత్యాచార ఘటన...

## నిందితుల పాలిగ్రాఫ్ రిపోర్టు గోప్యం..నిందితులు ఏం చెప్పారు..




**న్యూఢిల్లీ,ఆగస్టు 25 :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కి పాలీగ్రాఫ్ పరీక్షలు ముగిశాయి. ఈ మేరకు ఆదివారం అధికారులు వెల్లడించారు. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా ప్రస్తుతం మిగతా 7లో

# నిండుకుండలా నాగార్జున సాగర్ జలాశయం

- 2 గేట్లు ఎత్తి..16,200 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల
- నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు
- ప్రస్తుత నిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలుగా నమోదు
- నాగార్జున సాగర్‌కు ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం



**అమరావతి,ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో నాగార్జున సాగర్ జలాశయం నిండు కుండను తలపిస్తోంది. దీంతో 2 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని 16,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ ప్రస్తుత, మిగతా 7లో

# విద్యార్థులకు శుభవార్త



- నేడు తెలుగు రాష్ట్రాల్లో సెలవు..
- విద్యా సంస్థలు,ప్రభుత్వ కార్యాలయాలు మూసివేత
- ఎపిలో నేడు పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం సైతం రద్దు..

**అమరావతి,ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** ఆగస్టు 26న శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో సెలవు ఉండనుంది. సోమవారం నాడు పబ్లిక్ మిగతా 7లో

# కులగణకు బిఎస్‌పి ఎప్పుడూ అనుకూలమే





- మీ హయాంలో కులగణన ఎందుకు చేపట్టలేదు?
- కులగణనపై మాయావతి కాంగ్రెస్‌కు క్లాస్..
- కాంగ్రెస్ పార్టీది రిజర్వేషన్ వ్యతిరేక ఆలోచన..
- సుప్రీం ఇచ్చిన తీర్పుపై మాత్రం నోరు మెదపడటం లేదు
- సుప్రీంకోర్టు నిర్ణయానికి వారు వ్యతిరేకమా,అనుకూలమా..

**న్యూఢిల్లీ,ఆగస్టు 25 :** జాతీయ కులగణన జరపాలంటూ కాంగ్రెస్ పదేపదే చేస్తున్న డిమాండ్‌పై బహుజన్ సమాజ్ పార్టీ చీఫ్ మాయావతి ఆదివారం నాడు క్లాస్ తీసుకున్నారు. మీ ప్రభుత్వ హయాంలో కులగణన ఎందుకు చేపట్టలేక పోయారని సూటిగా మిగతా 7లో

# కూల్చివేతలు జరగాలి

- కూల్చివేతలు ఇలాగే కొనసాగాలి
- ఎక్కడ కబ్జా జరిగినా ఖాళీ చేయించాలి
- రాజకీయ కక్ష సాధింపు అవసరం లేదు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



**హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మిగతా 7లో

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు

# సౌరయానం

దేశంలోనే తొలిసారిగా సంపూర్ణమైన సోలార్ గ్రామంగా గుజరాత్‌లోని మొడేరా గ్రామాన్ని తీర్చిదిద్దడానికి పోయిన ఏడాది కార్యాచరణ మొదలైంది. అభివృద్ధి,పరిణామాలపై ఇంకా సమీక్షలు జరగాల్సివుంది. గత అసెంబ్లీ ఎన్నికల వేళ, సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ బృహత్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. 24ఐ7 అన్నట్లుగా అన్నివేళలా అంతటా సౌరశక్తి వెలుగాలన్నది లక్ష్యం. ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న కాలుష్యం,భయానకంగా మారుతున్న పర్యావరణం, ప్రబలుతున్న వింత వింత వ్యాధులు, అంతకంతకు పెరుగుతున్న విద్యుత్ ధరలు, తరిగిపోతున్న సహజవనరుల నడుమ సౌరశక్తిని సద్వినియోగం చేసుకొనే దిశగా వేసే ప్రతి అడుగూ ప్రశంసాపాత్రమే. దేశంలో సూర్యదేవాలయాలున్న అతి కొద్ది గ్రామాల్లో మొడేరా ఒకటి. సౌర్య దీప్తులు దేశంలోని ప్రతి గ్రామంలో విరగబూసినప్పుడే జాతి జ్యోతి మరింతగా వెలుగుతుంది. గుజరాత్ అభివృద్ధి నమూనాను అన్ని రాష్ట్రాలలో ప్రతిస్పందించేలా కేంద్రం కార్యాచరణ చేపట్టాలి. ప్రధాని సొంత రాష్ట్రంలోనే కాదు, అన్ని రాష్ట్రాలలోనూ సౌర గ్రామాల సంఖ్య పెరగాలి. 2014 లో మోదీని దేశ ప్రజలు ప్రధానమంత్రిగా ఎన్నుకున్న కారణాలలో గుజరాత్ అభివృద్ధి కూడా ఒక ముఖ్యమైన అంశం. 2014,2019లో వరుసగా రెండు సార్లు ప్రధానిగా ఆయనకు ప్రజలు పట్టం కట్టారంటే ఆయనపై పెట్టుకున్న విశ్వాసం మరో ముఖ్య కారణం. దానిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఆయనపై నేడు మరింతగా వుంది. ప్రజల్లో మరింత భరోసా నింపడం కీలకం.ఈ పదేళ్లలో దేశంలోని అనేక రాష్ట్రాలు కూడా బిజెపి వశమయ్యాయి. దానికి కారణాలు అనేకం ఉండవచ్చు,తమకు గెలుపునిచ్చిన ప్రజలు కూడా జీవితంలో గెలిచేట్లు, జీవనాలు వెలిగేట్లు చూడడం ఏలికల ముఖ్య బాధ్యత. చాలా వరకూ సహజవనరులను మనిషి తన ఆర్థిక స్వార్థంతో మట్టుపెట్టాడు. అయినా ఇంకా ఎంతో అమూల్యమైన సహజ సంపద మన చుట్టూ వుంది. ప్రణాళికా బద్ధంగా దానిని సద్వినియోగం చేస్తే జాతి ప్రగతి వేగం ఎన్నోరెట్లు ఊపందుకుంటుంది. సహజ వనరులను సద్వినియోగం చేసుకొని పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడం అత్యంత ముఖ్యం. ఇప్పటికీ విద్యుత్ సమస్యలు తీరడం లేదు. ముఖ్యంగా ఎండాకాలం వచ్చినా, వర్షాలు పెరిగినా పల్లెలు చీకట్లోనే మగ్గుతున్నాయి. విద్యుత్ సంస్కరణలు జరగాలని నిపుణులు మొరపెట్టుకుంటున్నా అది అరణ్యరోదనగానే మిగులుతోంది. ఈ క్రమంలో సౌరశక్తిని సద్వినియోగం చేసుకుంటూ సౌరవిద్యుత్ వాడకం పెరిగితే ఖర్చులు కూడా అదుపులోకి వస్తాయి.వృధా డబ్బు ఆదా అవుతుంది.సౌర శక్తి వాడకంపై ఇంకా చాలినంత అవగాహన ప్రజల్లో రాలేదు. సూర్యరశ్మి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్ ను సౌరవిద్యుత్ అంటారు. 1980దశకం నుంచే సౌర విద్యుత్ వినియోగంపై అడుగులు పడడం మొదలయ్యాయి.ఉత్పత్తి చేసే ప్లాంట్ల నిర్మాణాలు కూడా ప్రారంభమయ్యాయి. ఇందులో కర్ణాటకలోని పావగడ ప్రాంతం తలమానికంగా నిలుస్తోంది. మనిషి మొదలు అనేక జీవరాసులకు అందే శక్తిలో ఎక్కువ భాగం సూర్యుడిదే. ఈ శక్తి అపారమైంది. దీనిని ఇంకా ఎన్నో రెట్లు వాడుకోవాల్సివుంది. సౌరశక్తిని సద్వినియోగం చేసుకోవడం వల్ల ఎన్నో దీర్ఘకాలిక ప్రయోజనాలు దక్కుతాయి. కాలుష్యం తగ్గిపోతుంది. పర్యావరణం పచ్చగా ఉంటుంది. ఈ ప్రపంచంలో మనం ఒక సంవత్సరం పాటు ఉపయోగించే శక్తి కంటే ఒక గంటలో వెలువడే సౌరశక్తి ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటుంది. సోలార్ వస్తువుల ధరలు ఎక్కువగా ఉండడం వల్ల ఈ ఉత్పత్తుల వినియోగం పట్ల ఎక్కువమంది శ్రద్ధ చూపించడం లేదని పరిశీలకులు అంటున్నారు.దీనిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. సోలార్ కార్లు, బైక్‌లు పెరగాలని నిపుణులు సూచిస్తున్నారు.సౌరశక్తిని నిల్వవుంచే వ్యవస్థలు పెరగాలి. పారిశ్రామికవేత్తలను,శాస్త్రవేత్తలను, రాష్ట్ర ప్రభుత్వాలను,ప్రజలను సౌరశక్తి వినియోగం దిశగా అనుసంధానం చేయడంలో కేంద్రం మరింతగా కదలాలి. ఉత్పాదకతకు ప్రోత్సాహకాలను పెంచాలి. గుజరాత్‌లోని మొడేరా తరహా గ్రామాలను దేశంలో పెద్ద స్థాయిలో తయారు చెయ్యాలి.ముఖ్యంగా కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు మరింత ఆరోగ్యకరంగా సాగాలి. ప్రత్యక్ష నారాయణుడి ప్రభ దేశంలో ప్రకాశమాన మయ్యేలా గట్టి అడుగులు పడాలి

# ఇవ్వడం నేర్చుకో...



ప్రతి మనిషి సమాజానికి ఇవ్వడం నేర్చుకోవాలి. ప్రకృతిని స్ఫూర్తిగతీసుకో సమాజోన్నతికి పాటుపడు తీసుకోవడం కాదు. త్యాగాలు సేవా భావం మనిషి జీవనశైలి కావాలి. ఇతరులను శాసించడం కాదు సంతోషంగాఉంచడం నేర్చుకో ఆశించడం కాదు. ఆనందంగా ఉంచడం నేర్చుకో చేసిన మేలు మరవడంకాదు కృతజ్ఞతగా ఉండడం నేర్చుకో ఆజ్ఞాపించడం కాదు అవగాహన పెంచుకో పెత్తనం కాదు ప్రేమ ఆప్యాయత పంచుకోమంచిని చెప్పడం కాదు ఆచరించు ఆదర్శంగా నిలువు మనసులో ప్రేమ ఉంటే ఎంత పెద్ద తప్పులైనా పొరపాట్లయినా చిన్నవిగా కనిపిస్తాయి బలహీనమైన బంధాలు బలోపేతం అవుతాయి. ఆప్యాయత అనురాగాలు సుస్థిరమవుతాయి. మనం చేసిన సేవ చరిత్రలో శాశ్వతమై చిరస్మరణీయమై స్ఫూర్తి శిఖరం కావాలి. మనసంతా ద్వేషం వుంటే చిన్న తప్పే పెద్దగా కనిపిస్తుంది. బలమైన బంధాలు దూరమవుతాయి. ఆనందం తృప్తి ఉంటే సౌభాగ్యం సంపదలు సమకూరుతాయి బలహీనమైన మొక్క బండరాయిని సైతం చీల్చి పెద్ద వృక్షంగా మారుతుంది. అలాగే వ్యక్తి ఎదగాలి గెలవాలి అనే లక్ష్యం ఎంతటి కష్టాన్నైనా సునాయసంగా విజయాన్ని చేకూరుస్తుంది. ధైర్యం ఉంటే దరిద్రంలో కూడా విరాజిల్లవచ్చు సచ్చీలం ఉంటే రూపం బాగలేకున్న శోభించవచ్చు. విజ్ఞాన వికాసంతో గుర్తింపు పొందవచ్చు. రుచి లేని భోజనం వేడిగా ఉండడంతో రాణిస్తుంది.చినిగిన బట్ట పరిశుభ్రంగా వుంటే రాణిస్తుంది. మొక్కుబడితో చేసే పనులు ప్రయోజనం ఇవ్వవు. మనసుపెట్టి చేసే పనులు ఫలితం తప్పుక ఇస్తాయి. పనియే దైవం ప్రగతియే లక్ష్యం నిన్ను నీవు నమ్ముకో నీ నమ్మకమే నీ జయం ఆకలితో ఉన్న కడుపు ఖాళీగా ఉన్న జేబు ముక్కలైన మనసు మనకు జీవితంలో ఎన్నో పాఠాలు గుణ పాఠాలు నేర్పుతాయి. పనియే దైవం నమ్మకమే విజయానికి పరమపద సోపానం ఆత్మవిశ్వాసమే అభివృద్ధికి బాట పట్టుదలే పెట్టుబడిగా ప్రగతి పథంలో ముందుకు వెళ్దాం, దేశ పురోగతికి పాటుపడుదాం.

# కీర్తిచక్ర' పొందిన మొదటి సైనికేతరుడు వాడపల్లి



భారత దేశంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా బహూకరించే అత్యున్నత పురస్కారాలలో 'కీర్తిచక్ర' రెండవది. అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికాధికారులకు మాత్రమే ఇచ్చే ప్రతిష్టాత్మక పురస్కారం అది. అయితే... ఓ సైనికేతర పౌరుడైన వాడిపల్లి వెంకటేశ్వరరావు మొట్ట మొదటి సారిగా ఆ పురస్కారాన్ని పొందడం వెనుక...ఆయన చేపట్టిన పదవీ బాధ్యతలు, అందించిన సేవలు, అన్నింటినీ మించి త్యాగనిరతి కారణాలు. భారతదేశంలో కీర్తిచక్ర పొందిన మొట్టమొదటి సైనికేతర పౌరుడైన వి.వి. రావు గా వాసికెక్కిన వాడపల్లి వెంకటేశ్వరరావు (ఆగష్టు 26, 1963–జూలై 7, 2008) 1963 ఆగష్టు 26వ తేదీన తూర్పు గోదావరి జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామంలో వాడపల్లి అప్పలాచార్యులు, సుభద్ర దంపతులకు జన్మించారు. పుట్టిన చోటే ఎస్.ఎస్.సి.వరకు చదివిన ఆయన.. ఎ.పి.ఆర్.జె.సి.నాగార్జున సాగర్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. సివిల్ సర్వీసెస్‌లో టాపర్‌గా నిలవడమే తన ధ్యేయమని తన సిల్వర్ జూబ్లీ కళాశాల మిత్రులతో వి.వి.రావు చెప్పడం వల్ల అందరూ వి.వి.రావును పేరుతో కాకుండా "టాపర్" అని పిలిచేవారు. వాగ్దేవు చినవీరభద్రుడు కూడా ఆయన సహాధ్యాయి. చిన్నప్పటి నుంచే చదువులో చురుకుగా ఉండే ఆయన.. ప్రవేశ పరీక్ష రాసి, తద్వారా కర్నూలులో వుండే సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఎ.గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1983 నుండి 1985 సం.లో హైదరాబాదులోని కేంద్రీయ విశ్వ విద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. ఆ తర్వాత ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం నుండి ఎం.ఫిల్ పూర్తి చేశారు. తర్వాత అదే విశ్వ విద్యాలయం నుండి ఆసియా దేశాలతో భారతీయ సంబంధాలు అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సంపాదించారు. వెంటనే 1990 సంవత్సరంలో సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరై ఆప్షంస్‌లో ఐ.పి.ఎస్./ఐ.ఎఫ్.ఎస్. లకు అవకాశం వుండగా ప్రపంచ దేశాలతో భారత సంబంధాలపై పరిశోధన ద్వారా మంచి పట్టు వుండడంతో, రిటైర్డ్ హెల్త్ ఎక్స్ టెన్షన్ అధికారి అయిన తండ్రి వాడపల్లి అప్పలాచార్యులు సూచన ద్వారా ఇండియన్ ఫారిన్ సర్వీస్ ను ఎంపిక చేసుకున్నారు. తొలుత ఆయన జర్మనీలోని భారత రాయభార కార్యాలయంలో ఉద్యోగంలో చేరారు. ఆ తర్వాత శ్రీలంక, నేపాల్, భూటాన్, ఇండియా, అమెరికా వంటి దేశాలలో 1990 నుండి 2005 వరకు పనిచేశారు. ఆఫ్ఘనిస్తాన్ లోని రాయబార కార్యాలయంలో పని చేయడానికి చాలా మంది అయిష్టత వ్యక్తం చేయడంతో... ఆ స్థితిలో భారత ప్రభుత్వం ఆ పదవికి వి.వి.రావును నిర్ణయించింది. విధి నిర్వహణలో మంచి పట్టుదల, సమర్థత కలిగిన అధికారిగా గుర్తింపు పొందిన ఆయన.. ప్రభుత్వం తనకు నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను ప్రతిష్టాత్మకంగా, ప్రత్యేకించి సవాలుగా తీసుకొని అక్కడ విధులలో చేరారు. అక్కడి కాబూల్‌లోని భారత రాయబార కార్యాలయంలో కన్సులేట్‌గా 3 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆఫ్ఘనిస్తాన్ లోని ముఖ్యమైన భాషల లో ఒకటైన "దారి" భాషలో చక్కటి పట్టువున్న వి.వి.రావు భారత్, ఆఫ్ఘన్ ఇరుదేశాల సంబంధాలను, మైత్రీ బంధాన్ని ఇనుమడింప జేశారు. 2008 జూలై 7వ తేదీన కాబూల్ లోని భారత రాయబార కార్యాలయం ముందు జరిగిన తీవ్రవాదుల ఆత్మాహుతి దాడిలో మొత్తం 41 మంది మృతి చెందగా... ఆ దూరదృష్ట అవాంఛిత దుర్ఘటనలో భారత రక్షణ విభాగానికి చెందిన బ్రిగేడియర్ మెహతాతో పాటు మరో ముగ్గురు కార్యాలయ సిబ్బంది మరణించారు. అలా మరణించిన వారితో పాటుగా, భారతీయ దౌత్యవేత్త అయిన 44 యేళ్ళ వాడపల్లి వెంకటేశ్వరరావు కూడా వున్నారు. ఆ విధంగా విధి నిర్వహణలో అసువులు బాసి, అమరులైన ఆయనకు అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన సైనికాధికారులకు ఇచ్చే కీర్తిచక్ర పురస్కారాన్ని భారత ప్రభుత్వం ప్రకటించింది. ఆ విధంగా కీర్తిచక్రతో గౌరవించబడిన మొట్టమొదటి సైనికేతర భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు. వి.వి.రావు పదవికి సమానమైన హోదా కలిగిన భారతీయ సాంస్కృతిక సంస్థ, బ్యాంకాక్‌కు డైరెక్టర్ గా పదవీ బాధ్యతలను ఆయన ధర్మపత్ని వాడపల్లి మాలతీరావుకు భారత ప్రభుత్వం అప్పగించి గౌరవించింది.

- రామ కిష్టయ్య సంగన భట్ల

# పోలియో టీకా ఆవిష్కర్త సాబిన్

**ఆగస్టు 26 ఆల్బర్ట్ బ్రూస్ సాబిన్ జయంతి**



పోలియో అని సాధారణంగా పిలవబడే 'పోలియోమైలైటిస్' అనే వ్యాధి వైరస్ ద్వారా కలిగి, నాడీ మండలాన్ని దెబ్బ తీసే ఒక వ్యాధి. పోలియో పేరు అందరికీ సుపరిచితమైందే. మనం ఇది మెదడు లోతుల లోనూ, వెన్నుపాము లోనూ ఉండే నాడీకణాలకు వచ్చే వ్యాధి. ఈ వ్యాధిని కలిగించేది "పోలియో మైలేలిటీస్" వైరస్. ఇవి చాలా సూక్ష్మ మైన వైరస్లు. ఈ వైరస్లు నోటిద్వారా శరీరంలోకి చేరతాయి. నాడీ కణా లలో స్థావరం ఏర్పరచుకుంటాయి. మెదడులో, వెన్నుపాములో ఉండి శరీరానికి ఆదేశాలు పంపే చాలా కణాలను నాశనం చేయటానికి ప్రయత్ని స్తాయి. వైరస్ల వల్ల కొద్దిగా జ్వరం, గొంతునొప్పి, తలనొప్పి, వికారం, వాంతులు, బేదులు మొదలైన లక్షణాలు ముందుగా కనిపిస్తాయి. దీనిని "పసిపిల్లల పక్షవాతం" అని కూడా అంటారు. దీనిని రాకుండా నిరోధించవచ్చు. అందుకే చిన్న పిల్లలకు టీకాలు వేస్తారు. అంగవైకల్యం కలిగించే ఈ వ్యాధి రాకుండా ఉండటానికి టీకామందు కనిపెట్టిన వైద్యశాస్త్రవేత్త ఆల్బర్ట్ బ్రూస్ సాబిన్. ఆల్బర్ట్ బ్రూస్ సాబిన్ (జననం అబ్రామ్ శాపర్‌స్టీన్ బీ 1906 ఆగస్టు 26 - 1993 మార్చి 3) ఒక పోలిష్ అమెరికన్, వైద్య పరిశోధకుడు, నోటి పోలియో వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసి ప్రసిద్ధి చెందిన వ్యక్తి. ఇది పోలియో వ్యాధిని నిర్మూలించడంలో కీలక పాత్ర పోషించింది. 1969–72లో, అతను ఇజ్రాయెల్‌లోని వైజ్మాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అధ్యక్షుడిగా పనిచేశాడు. 1930 లో, అతను యునైటెడ్ స్టేట్స్ పౌరుడు అయ్యాడు. 'సాబిన్ న్యూయార్క్ యూనివర్సిటీలో చదివి 1931లో మెడికల్ డిగ్రీ తీసుకున్నాడు. 1931–1933 వరకు న్యూయార్క్ నగరంలోని బెల్లేవ్ హాస్పిటల్‌లో అంతర్గత మెడిసిన్, పాథాలజీ, శస్త్రచికిత్సలో శిక్షణ పొందాడు. 1934 లో ఇంగ్లాండ్‌లోని ది లిస్టర్ ఇన్స్టిట్యూట్ ఫర్ ప్రివెంటివ్ మెడిసిన్‌లో పరిశోధనలు జరిపాడు. తరువాత రాక్‌ఫెల్లర్ ఇన్స్టిట్యూట్ ఫర్ మెడికల్ రీసెర్చ్‌లో చేరాడు. ఆ సమయంలో, అతను ముఖ్యంగా అంటు వ్యాధుల పరిశోధనపై, తీవ్రమైన ఆసక్తిని పెంచుకున్నా డు. 1971లో సిన్సినాటి యూనివర్సిటీలో ఎమెరైటిస్ ప్రొఫెసర్ అయ్యాడు. 1974 నుండి 1982 వరకు సౌత్ కరొలినాలో ఉన్న చార్లెస్టన్ యూనివర్సిటీలో పరిశోధక ప్రొఫెసర్‌గా పని చేశాడు. ఆకాలంలో పోలియో ఎంతో మందిని వికలాంగులను చేయడం చూసి, ఆ వ్యాధి కలిగించే వైరస్ల మీద పోరాడాలని నిశ్చయించు కున్నాడు. పోలియో వ్యాధిని కలిగించే వైరస్ మూడు రకాలుగా ఉంటుంది. సాబిన్ మిలియన్ల కొద్దీ పోలియో వైరస్ లను పెంచి, మొదట దానిని కోతుల మెదళ్లలో ఎక్కించి పరిశీలించాడు. చంపిన వైరసన్ ను ఇంజెక్షన్ ద్వారా ఎక్కించటం కంటే సజీవమైన, బలహీన పరచ బడిన వైరసన్ను నోటి ద్వారా ఇచ్చేందుకు వీలుగా పరిశోధనలు చేశాడు. పోలియో వైరస్ యొక్క ఉత్పరివర్తన జాతుల ఆధారంగా సాబిన్ నోటి ద్వారా వేసే టీకాను అభివృద్ధి చేశాడు. ఇది యాంటీబాడీ ఉత్పత్తిని ప్రేరేపించింది, కాని పక్షవాతం కలిగించలేదు. అతని నోటి టీకా తీఉకున్న వాళ్లలో స్వయంగా తాను, తన కుటుంబం, అతడి సహచరులూ ఉన్నారు. సాబిన్ యొక్క మొట్టమొదటి క్లినికల్ ట్రయల్స్ 1954 చివరలో చిల్లికోథే ఓహియో రిఫార్మేటరీలో జరిగాయి. 1956 నుండి, అతను రష్యన్ సహచరులతో కలిసి నోటి టీకాను పరిపూర్ణం చేయడానికీ, దాని అసాధారణ ప్రభావాన్ని, భద్రతనూ నిరూపించడానికీ పని చేశాడు. ఈ టీకా పేగులలో పనిచేసి, పోలియో వైరస్ రక్తప్రవాహంలోకి రాకుండా నిరోధించింది. 1957 నాటికి మూడు దురకాల పోలియో వైరస్ను వేరుచేయ గలిగాడు. దానితో పోలియో మందును తయారు చేశాడు. దానిని స్వచ్ఛంద సేవకులపైన, అలాగే తనపైన ప్రయోగించి చూశాడు. ఆ పరీక్షలు విజయవంత మైనాయి. సాబిన్ తయారుచేసిన టీకా మందును 1960లో అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వం ఆమోదించింది. సాబిన్ టీకాలో సజీవమైన వైరస్లుంటాయి. దీనిని చుక్కల మందుగా నోటిద్వారా ఇస్తారు. సంవత్సరంలోపు చిన్న పిల్లలకు ఆరు వారాలకొకసారి మూడుసార్లు టీకాలను ఇస్తారు. 1 1/2 నుండి 2 సంవ త్సరాల లోపువారికి రెండవసారి ఇస్తారు. ఈ టీకాలు వేయటానికి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తారు. టీక ధర ఎక్కువ అవుతుందని సాబిన్ తన టీకాకు పేటెంట్ తీసుకోడానికి నిరాకరించాడు. మానవాళికి మహోపకారం చేశాడు. సాబిన్ మెదడు వాపు, డెంగ్యూతో సహా ఇతర వైరల్ వ్యాధులకు కూడా టీకాలను అభివృద్ధి చేశాడు. వైరస్లు, కొన్ని రకాల క్యాన్సర్ల మధ్య సంబంధాలను కూడా పరిశోధించాడు. బలహీన పడిన లేదా మృత వ్యాధికారక బ్యాక్టీరియాను వ్యక్తి శరీరంలోకి ప్రవేశ పెడితే, శరీరంలోని తెల్లరక్తకణాలు ప్రేరేపితమై, వ్యాధిపై పోరాడేందుకు యాంటీబాడీలను ఉత్పత్తి చేస్తాయి. 1957లో ప్రారంభం కాగా, 1962లో దీనికి లైసెన్స్ దొరికింది. పోలియో వ్యాధికి పూర్తిగా టీకాలు వేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసింది. యునైటెడ్ స్టేట్స్ లో చిట్టచివరి పారలైటిక్ పోలియోమైఎలిటిస్ కేసు 1979లో నమోదైంది. 1994 నాటికి ఈ వ్యాధి అమెరికా ఖండంలో పూర్తిగా నిర్మూలించబడింది. 2000 నాటికి చైనా, ఆస్ట్రేలియా తోపాటుగా 36 పాశ్చాత్య పసిఫిక్ దేశాలలో పోలియో నిర్మూ లించబడినట్లు అధికారికంగా ప్రకటించబడింది. భారతదేశంలో పోలియోను నిర్మూలించే లక్ష్యంతో భారత ప్రభుత్వం 1995లో దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించింది. 1.5 లక్షల మంది సూపర్ వైజర్ల ఆధ్వర్యంలో 24 లక్షల మంది వైద్య వాలంటీర్లు పాల్గొని మొదటిసారిగా ఓరల్ పోలియో వ్యాక్సిన్ అందించారు. 2011 నుంచి 2014 వరకు దేశంలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాకపోవడంతో 2014, మార్చిలో ప్రపంచ ఆరోగ్య సంస్థ పోలియో రహిత దేశంగా ప్రకటించింది.

# ఈసారి అవార్డ్ గ్యారంటీ



వాళ్ళు- పేదవాళ్ళు, కూటికి గతి లేని వాళ్ళు, మూల వాసులు,దళితులు,ఎండుగడ్డి పోచలు, మొలకు గోచీల వాళ్ళు... భార్యల్తో బిడ్డల్తో అరణ్యాల్లో నడుస్తూ... బంగారం అనే అంతుచిక్కని ఐశ్వర్యం వేటకు బయల్దేరుతారు. అటు ఒక పసిడి భూతం ఈ దరిద్రులను వెన్నాడుతూ వుంటుంది. ఇది ఒక పురాతన జానపద గాథ. నెత్తురూ కన్నీళ్ళూ కలిసి ప్రవహించిన కథ. ఆధునిక కేమెరాలతో, అరుదైన సాంకేతిక పరిజ్ఞానంతో వందల ఏళ్ళ క్రితం జరిగిన ఒక ఘాతుకాన్ని అంతే క్రూరంగా చూపించిన సాహసం పేరు- తంగలాన్! కొన్ని నిజజీవిత సంఘటనలు, కొంత కల్పన, పేదల వేదన కలిసిన తిరుగుబాటు సిద్ధాంతం- తంగలాన్. పార్వెట్ట చూశారా? కాలా చూసే వుంటారు. ఇప్పుడు తంగలాన్! వీటిని తీసిన పారంజిత్ అనేవాడు మామూలు మనిషి కాదు. మహాదర్శకుడు. కన్నీటి కావ్యామృత రసావిష్కరణ తెలిసిన మాంత్రికుడు. మన కాలం వీరుడు. 'నేను అంబేద్కరిస్ట్ ని'అని ప్రకటించుకున్న రంజిత్, రొటీన్ రొడ్డకొట్టుడు చిల్లర ప్రచార సినిమాలు తీయడు. అతని ఆవేశానికో అర్థం వుంది. అతని ఆగ్రహానికో పద్ధతి వుంది. అతని తిరుగుబాటుకో లక్ష్యముంది. తంగలాన్ తీయడం వెనుక వున్నది పరిశోధన, కమర్షియల్ ప్లాన్ మాత్రమే కాదు. అదొక తపస్సు. చెక్కుచెదరని నిబద్ధత. ఒక సూపర్ హీరోకి గోచీ పెట్టి దుర్గమారణ్యాల్లో నడిపించిన దుస్సాహసం! కోలార్ బంగారు గనుల్ని మొట్టమొదట కనిపెట్టడానికి జరిగిన సాహస యాత్రలో చరిత్ర చూసిన కన్నీళ్ళనీ, రక్తపుటేర్లనీ, వీరుల చావునీ, ఆడవాళ్ళ నిస్సహాయతనీ వొళ్ళు జలదరించేలా రికార్డు చేయడంలోని నిజాయితీ మనల్ని షాక్ చేస్తుంది. 'చియాన్'విక్రమ్ ఒక మార్మిక శక్తిగా మారి ముందుండి ఈ సినిమాని నడిపించాడు. పాత్రలో అంత సహజంగా ఇమిడిపోవడంలో వున్న శ్రమ, కళ పట్ల అతనికి వున్న అపారమైన ప్రేమ వెలకట్టలేనివి. విక్రమ్ భార్యగా, ముగ్గురు బిడ్డల తల్లిగా, కొద్దిపాటి ఆనందాన్ని, పెనువిషాదాన్నీ అలవోకగా పండించిన మలయాళ నటి పార్వతీ తిరువొత్తుని మనం ఎప్పటికీ మరచిపోలేం. నల్లగా నిగనిగలాడిన మరో పేదరాలు, తమిళ నటి ప్రీతీ కరణ్ పాత్ర ఔచిత్యానికి పర్యాయపదంగా మనసు దోచుకుంటుంది. ఆ అంటరాని మారుమూల పల్లెలో, వూసినా, దుమ్మెత్తిపోసినా చలనం లేని కటిక దరిద్రపు బతుకులు వాళ్ళవి. ఆ గ్రామంలో ఏ ఆడదీ జాకెట్టు వేసుకోదు. బిడ్డల ఆకలి తీర్చడమే అలవికాని పని అక్కడ జాకెట్లకీ, షోకులకీ ఆవగింజంత అవకాశమూ లేని పాడుకాలం అది. "వొరేయ్ పనికిమాలినోడా, నాకో జాకెట్ తెచ్చిస్తావా?"అని మొగుడు విక్రమ్‌ని అడుగుతుంది పార్వతి. ఒక పోరాటంలో గెలిచి, బ్రిటిష్ దొరల మెప్పు పొందిన తంగలాన్ బోలెడన్ని జాకెట్లు పట్టుకుని ఇంటికి వస్తాడు. అప్పుడు చూడాలి పార్వతి బుగ్గల్లోంచి ఉబికి వచ్చే ఆనందం. ఆడాళ్ళందరూ జాకెట్లు వేసుకుని మురిసిపోతుంటారు. అప్పుడు మొదలవుతుంది ఒక సెలబ్రేషన్ ఒక బృందగానం, ఒక గిరిజన నృత్య కోలాహలం. ఆ హొయలు.. ఆ తూగు.. ఆ జీవన సౌందర్యం పూలతీగలా మనల్ని చుట్టుకునే పరిమళం. పార్వతీ, ప్రీతీ- ఇద్దరిదీ మనోహరమైన చిరునవ్వు. ఫోటోగ్రాఫరూ, పారంజిత్ ఏమైపోయారో గానీ, జనం మాత్రం పరవశించి చిత్తై, చచ్చి సున్నమైపోతారు. దర్శకుడి మీద ఎంత గౌరవం కలిగిందంటే, వాళ్ళెవరికీ కొన్ని డజన్ల మంది ఆడవాళ్ళకి రవికెలు వుండవు కదా, ఐనా, ఒక్కసారి కూడా, ఒక్క స్త్రీని కూడా అశ్లీలంగా చూపించే పని చేయలేదు. బుద్ధ జాతక కథల్లోని 'హారతి', ఈ సినిమాలో బంగారాన్ని, ప్రాణాలకు తెగించి రక్షించే వనదేవతగా వుంటుంది. ఆనాటి మూఢ నమ్మకాలకూ, భయాలకూ, అపోహలకూ ప్రతీకగా ఒక సర్రియలిస్ట్ నేరేటివ్ పవర్‌తో, గావు కేకలు పెట్టి, నెత్తురు కళ్ళజూసే గిరిజన దేవతగా మాళవికా మోహనన్ అనే గ్లామర్ స్టార్ మూలవాసుల్నీ, ప్రేక్షకుల్నీ భయకంపితుల్ని చేస్తుంది. ఇదో పవర్ఫుల్ క్రియేటివ్ టెక్నిక్. తంగలాన్‌కి పీడకలలు వస్తుంటాయి. తాత చెప్పిన పురాతన గాథల్లోని ఆపదలూ, అపశకునాలూ అతన్ని వొణికిస్తుంటాయి. చూసేవాళ్ళకి విభ్రాంతి కలిగేలా ఈ కలల్ని మేజికల్ రియలిజంలా ఒక మాయలా, మార్మికంగా చేసిన విజువల్ ప్రెజెంటేషన్- పారంజిత్‌కి మహా రచయిత గాబ్రియల్ గార్షియా మార్క్వెజ్ పూనాడా అని అనిపిస్తుంది. ఇది సామాన్య ప్రేక్షకుడికి కనక్ట్ కావడం కష్టమే! ఎవర్ని ఎవరు చంపుతున్నారో తెలియని ఒక ఉన్మాదం లాంటి కేయాస్‌ని అద్భుతంగా చూపగలిగిన జీనియస్ రంజిత్. తంగలాన్ లో కొన్ని లోపాలు వున్నాయని చెప్పవచ్చు. ఐతే, బాధితుల పక్షాన నిలిచిన పారంజిత్ కమిట్ మెంట్ ముందు, సముద్ర కెరటాల్లా విరుచుకుపడిన సృజనాత్మక తిరుగుబాటు ముందు, చీకటిలో వెలిగించిన ఆశాదీపాల కాంతి ముందు అవి వెలవెలబోతాయి. అడవిలో, కొండ దగ్గర చటుక్కున ఒక నెమలి ఎగిరి రెండు మూడుచోట్ల వాలుతుంది. అక్కడ బంగారం వుంటుందని అర్థమైపోతుంది. నెమళ్ళకి బంగారం ఎక్కడ వుందో పసిగట్టే శక్తి వుందో లేదో మనకి తెలీదు గానీ, చూడ్డానికి అదెంతో బావుంది. కొండల్లో నిక్షిప్తమై వున్న బంగారాన్ని కాపాడే విషసర్పాలు వందల్లో జరజరా పాకి వచ్చి దాడి చేస్తాయి. ఎగిరి దూకిన ఒక నల్లచిరుత హఠాత్తుగా వూడిపడుతుంది. మరోచోట కత్తివేటుకు కొండదేవత పొట్ట చీరుకుపోయి నెత్తురు ధారలై పారుతుంది. కొద్దిసేపటికి ఆ ప్రాంతం అంతా బంగారం మిలమిలా మెరుస్తుంది. ఇలాంటి మేజికల్ సన్నివేశాలు వూపిరి సలపనివ్వవు. టిప్పుసుల్తాన్ నిరాశతో వెనుతిరిగిన కొండల్లో, లోతైన బావుల్లో, ప్రాణాలకి తెగించి పోరాడినా చేతికి దొరకని బంగారం దళిత బహుజనుల చీకటి జీవితాన్ని మార్చివేసే ఆ పసిడి వెన్నెల కాంతిని వాళ్ళు చూడగలుగుతారా? ఆ అడివిబిడ్డల ఆకలి తీరుతుందా? హృదయాన్ని కదిలించే సంగీతం మనల్ని కుర్చీలో కూర్చోనివ్వదు. కళాత్మకమైన ఫోటోగ్రఫీ మనశ్శాంతిని మిగల్చదు. బ్రాహ్మల మీదా, బ్రిటిష్ వాళ్ళ మీదా ఎండు గడ్డిపోచల్లాంటి, దరిద్రదేవత బిడ్డలు దళితులు విజయం సాధించేదాకా పారంజిత్ ఊరుకోడు. చరిత్ర కొంచెం తెలిసివుంటే ఈ సినిమా విలువ ఏమిటో ఇట్టే అర్థం అవుతుంది. శిస్తు కట్టలేదనే నెపంతో దళితుల భూముల్లో వాళ్ళనే కట్టుబానిసల్ని చేసి, వెట్టిచాకిరీ చేయించే రాక్షసత్వం మీద తిరుగుబాటే తంగలాన్. సాహసించి, తెగించి, ప్రాణాలు వొడ్డి పోరాడి తన నేలతల్లిని తాను సాధించుకుంటాడు. ఆధిపత్యం తలకెక్కిన దొరలు దిగివచ్చి 'పత్రాలు' యిచ్చేస్తారు. వెండితెర నిండుగా పరుచుకున్న తన సొంత పొలంలో మట్టిపెళ్ళల మీద గుండె నిండిన సంతోషంతో విక్రమ్ వెల్లకిలా పడుకుంటాడు. సంగీతం మనల్ని వెన్నాడుతుంది. కళ్ళలో నీళ్ళు తిరిగే సన్నివేశం యిది. ఇది భూమి సమస్య. బతుకు సమస్య. మూలవాసులకు చావోరేవో తేల్చుకునే విషమ సమస్య. ఆ బాధని గుండెలవిసిపోయేలా చిత్రీకరించగలగటం ఈ దర్శకుడు సాధించిన విజయం. బంగారంతో పాటు చరిత్రనీ తవ్వి తీయగలిగాడు. 2024లో నిస్సందేహంగా ఉత్తమ జాతీయ చిత్రం 'తంగలాన్'. మరో అరడజను అవార్డులు ఎలాగూ వస్తాయి. ఇంతకీ మన సంగతేంటో..! అదేంటి తెలుగులో ఇలాంటి సినిమాలు తీయగలిగే మొనగాడే లేడా? అని మనం ఆశ్చర్యపోవడం శుద్ధ దండగ. మనం హేపీగా, నిష్పూచీగా, గుంపులు గుంపులుగా 'మిస్టర్ బచ్చన్' సినిమాకో, 'డబుల్ ఇస్మార్ట్'కో ఎగురుకుంటూ వెళదాం. డప్పులు కొడదాం. రంగుల కాగితాలు ఎగరేద్దాం. అభిమాన హీరో కటౌట్లకి పాలాభిషేకాలు చేద్దాం. పువ్వులు విసురుదాం, గంతులు వేద్దాం మన తెలుగు పైశాచిక స్వర్గంలో! దిక్కుమాలిన అలగాజనం గురించి ఆవేశపడిపోతూ తీసే తంగలాన్ లాంటి బుద్ధిలేని సినిమాలు చూసి హేళనగా నవ్వుకుందాం. జై తెలుగు సినిమా.

-సేనాధిపత్యం రమేష్

# స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలి

**- డా..యన్.తులసీ రెడ్డి**




**గుంటూరు, పశ్చిమ, ఆగస్టు 25, (ఆంధ్రపత్రిక) :** గ్రామీణ, పట్టణ స్థానిక ప్రభుత్వాలకు విధులు, నిధులు, అధికారాలను బదిలీ చేస్తేనే బలోపేతం అవుతాయని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్ సాధ్యమౌతుందని మాజీ రాజ్యసభ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ డా!! యన్. తులసీ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీన గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో స్థానిక ప్రభుత్వాల సాధికారత పై జరిగిన చర్చా గోష్టికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. డా!! యన్. తులసీ రెడ్డి ప్రసంగిస్తూ రాజ్యాంగంలో ఆర్టికల్ 243 పేర్కొనట్లుగా స్వయం పాలక ప్రభుత్వాలుగా స్థానిక సంస్థలకు అధికారాలివ్వాలని తెలిపారు. గత రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల నిధులను దారి మళ్లించి వాటిని నిర్వీర్యం చేయడం దురదృష్టకరమన్నారు. వాలంటరీ, సచివాలయ వ్యవస్థలను పంచాయతీలకు సమాంతర వ్యవస్థలుగా మార్చి సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మిగిల్చినారన్నారు. మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ గ్రామాలు అభివృద్ధి చెందకుండా దేశాభివృద్ధిని ఆశించలేమన్నారు. నిర్మాణాత్మకమైన కార్యచరణతో కులాల మధ్య సమన్వయంతో గ్రామాభివృద్ధిని సాధించగలమన్నారు. శాసన మండలి సభ్యులు కె. యస్. లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించకుండా రాష్ట్ర ఆర్థిక సంఘం నుండి ఎలాంటి నిధులను స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాలు అందించే నిధులు దారి మళ్ళించకుండా స్థానిక ప్రభుత్వాలకు చేరేలా చట్టాలను బలోపేతం చేయాలన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్ కార్యాచరణ ద్వారా స్థానిక ప్రభుత్వాలు వికసిస్తాయన్నారు. మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయి మెంట్ గ్యారంటీ స్కీం లో ఎలాంటి అవినీతి లేకుండా గ్రామ పంచాయతీలలో అమలు చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి కృషి జరగాలని, స్థానికే తరుల సహకారం తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల న్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రసంగిస్తూ యం. యల్.ఎ ల చేతులలో అధికారం కేంద్రీకృతం అవడం వలన అధికార, పాలన వికేంద్రీకరణకు ఆస్కారం లభించడం లేదన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాల నిధులు, విధులు, అధికారాలపై విస్తృతంగా చర్చలు జరగాలని, ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్పం చుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు ప్రసంగిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో గ్రామసభలు విజయవంతంగా జరిగాయని, కేంద్ర ఆర్థిక నిధులు విడుదలయినాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ చర్చా గోష్టిలో అమరావతి బహుజన జెఎసి అధ్యక్షులు పోతుల బాలకోటయ్య, అఖిలభారత పంచాయితీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డా!! జాస్తి వీరాంజనేయులు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు జన చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి పి శేషుబాబు నేస్తం సహా వ్యవస్థాపకులు ధనుంజయ రెడ్డి లు ప్రసంగించారు.

**చర్చా గోష్టిలో ఏకగ్రీవంగా చేసిన తీర్మానాలు**

1. 73 వ రాజ్యాంగ సవరణలో గ్రామీణ ప్రాంతాలలో పేర్కొన్న 29 అంశాలను, 74వ రాజ్యాంగ సవరణలో పట్టణ ప్రాంతాలకు పేర్కొన్న 18 అంశాలను దశల వారీగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు కేటాయించి అమలు చేయాలి.
2. గ్రీన్ అంబాసిడర్స్ జీతాలు 6000 నుండి 10000 రూపాయలకు పెంచి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి.
3. 5 వ రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను వెంటనే స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయాలి.
4. 15వ కేంద్ర ఆర్థిక సంఘం నిధులను ఇచ్చిన వెంటనే స్థానిక ప్రభుత్వాలకు ఎలాంటి జాప్యం లేకుండా బదిలీ చేయాలి.
5. రాజకీయాలకు అతీతంగా సర్పంచులందర్నీ ఒకే విధంగా చూడాలి. వివక్షత చూపరాదు.
6. ఉపాధి హామీ పథకాన్ని ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా అమలు చేయాలి. గ్రామాల అభివృద్ధికి ఈ పథకాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవాలి.

## క్షేత్రస్థాయి నుంచి

# బిజెపి బలోపేతమే లక్ష్యం

**పశ్చిమ శాసనసభ్యులు సుజనాచౌదరి**



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 25, (ఆంధ్రపత్రిక) :** క్షేత్రస్థాయి నుంచి బిజెపి బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి చెప్పారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో గొల్లపూడి లోని ఆర్ కన్వెన్షన్ సెంటర్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) ముఖ్యఅతిథిగా హాజరై బిజెపి శ్రేణులకు సభ్యత్వ నమోదు కార్యాశాలపై అవగాహన కల్పించారు. మొదటగా భరతమాత చిత్రపటానికి, దీన్ దయాల్ ముఖర్జీ, శ్యాం ప్రసాద్ ముఖర్జీల చిత్రపటాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ క్షేత్రస్థాయి నుంచి బిజెపి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సెప్టెంబర్ 1న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన బిజెపి సభ్యత్వం పునరుద్ధరించుకొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తున్నారన్నారు. టిడిపి, జనసేన, బిజెపి, కూటమి సహకారంతో తనకి పశ్చిమ నియోజకవర్గంలో47 వేల పైచిలుకు మెజారిటీ వచ్చిందని, తమకి ఓటు వేయని వారిని కూడా ఆకర్షించి సమాజంలో ప్రతి వర్గాన్ని అక్కున చేర్చుకుంటానన్నారు. ప్రత్యర్థిని శత్రువుగా చూడబోమని ప్రత్యర్థులందరూ తమకు మిత్రులేనన్నారు. ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్క బీజేపీ కుటుంబ సభ్యుడు బాధ్యతగా తీసుకొని లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ సిద్ధాంతంతో అందరం ఐక్యంగా ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి యామిని శర్మ, రాజమండ్రి ఇంచార్జ్ భగవాన్, మైలవరం అసెంబ్లీ కన్వీనర్ నూతలపాటి బాల కోటేశ్వరరావు, మీడియా కన్వీనర్ పాతూరి నాగభూషణం, మువ్వల వెంకటసుబ్బయ్య, శ్రీనివాస్ రాజు, కిలారు దిలీప్, ఆర్ముగం, శ్రీకాంత్, పైలా సోమి నాయుడు, బబ్బూరి శ్రీరామ్, భోగవల్లి శ్రీధర్, బి.శివకుమార్ పట్నాయక్, అవ్వారు బుల్లబ్బాయి, ఎన్. ప్రభుకుమార్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగర ప్రజల

# ఆరోగ్యాన్ని పరిరక్షించండి.!

**జిల్లా కలెక్టర్‌కు లంకిశెట్టి విజ్ఞప్తి ..!**



**మచిలీపట్నం ఆగష్టు 25 (ఆంధ్రపత్రిక) :** కృష్ణా జిల్లా ముఖ్య కేంద్రం మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలో, 29 గ్రామపంచాయతీలలో వేల సంఖ్యలో ప్రజలు జ్వరాలతో బాధపడుతుంటే సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రవర్తించడం బాధాకరమని న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షులు, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నగర పాలక సంస్థ కార్యాలయం (కార్పొరేషన్) లో హెల్త్ అధికారి లేకపోవడం వ్యాధుల విస్తరణకు ముఖ్య కారణం అని బాలాజీ తెలియజేశారు. నగరంలోని అన్ని ఆసుపత్రులు రోగులు తొ కిటకిట లాడిపోతున్నాయని,రక్త పరీక్షలు ఎక్స్ రేలు ఇతర ల్యాబ్ టెస్టులతో ప్రజలు వేల రూపాయలు ఖర్చు ఖర్చు పెడుతున్నారని, పేద మధ్యతరగతి ప్రజలు ఈ ఖర్చులు తట్టుకోలేకపోతున్నారని బాలాజీ తెలియజేశారు. తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని, విస్తృతంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బాలాజీ తెలియజేశారు. కార్పొరేషన్ పరంగా పారిశుద్య నివారణ లో భాగంగా బ్లీచింగ్ చల్లడం, గానీ మున్సిపల్ కార్పొరేషన్ పరంగా మైకుల ద్వారా ప్రజల్ని అప్రమత్తత చేయటం గాని జరగడం లేదని, సాక్షాత్తు కలెక్టరేట్ చుట్టుపక్కల ప్రాంతాలు గాంధీనగర్ ప్రాంతాలు, బైపాస్ రోడ్డు, నారాయణపురం తదితర ప్రాంతాల్లోపారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తెలియజేశారు. ఈ ప్రాంతాల్లో వర్షం వచ్చి తగ్గి వారం రోజులు అయినా వీధుల్లో మురుగు నీరు పారుతూ అపరిశుభ్ర వాతావరణం లో మగ్గిపోతున్నా యన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఇంటింటికి ముందస్తుగా మందులు పంపిణీ చేయవలసిన అవసరం ఉందని బాలాజీ తెలియజేశారు. కార్పొరేషన్ పరంగా పంపిణీ అయ్యే మంచినీటిలో కూడా కావలసిన ఆలం కూడా సక్రమంగా కలపాలని కోరారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వరాలతో రోగులు కిటకిట లాడుతున్నారని ,అదనపు వైద్య సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మచిలీపట్నం ఆసుపత్రుల్లో ప్రజా ఒత్తిడి వల్ల జ్వరాల బారిన పడినవారు విజయవాడ వెళ్ళవలసి వస్తుందని బాలాజీ తెలియజేశారు. ప్రజల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన అన్ని ప్రాథమిక చర్యలు తీసుకునే విధంగా కార్పొరేషన్ అధికారులకు తగిన సూచనలు ఇచ్చి నగర ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని కోరారు.

## ప్రజా సమస్యలను తక్షణం

# పరిష్కరించాలి



**నూజివీడు ఆగష్టు 26, (ఆంధ్రపత్రిక) :** ప్రజల సమస్యలను తక్షణమే సమస్యలు పరిష్కరించాలి మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. చాట్రాయి మండలం నరసింహారావు పాలెంలో నిర్వహించిన గ్రామ సభలో లేట్ నైట్ అయినా ఎంతో ఓర్పుతో ప్రజలనుండి అర్జీలు స్వీకరించి తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించిన రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారధి మంత్రివర్యుల దృష్టికి తీసుకువచ్చిన ప్రధాన సమస్యలు మురుగునీటి సమస్య, త్రాగునీటి సమస్య, విద్యుత్ దీపాలు,సి,సి, రోడ్లు, పుంత రోడ్లు, అంగన్వాడీ సెంటర్ సమస్య,గ్రామంలో శానిటేషన్ సమస్య,సాగునీటి సమస్య, పొలాలకు కావలసిన విద్యుత్ ట్రాన్సఫార్మర్ సమస్యలను ఒక్కొక్కరనుండి ఎంతో ఓర్పుతో స్వీకరించి 4 రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించిన మంత్రివర్యులు గ్రామంలో ప్రధాన సమస్యలకు కారణమైన పంచాయితీ సెక్రటరి పై మండిపడ్డ మంత్రివర్యులు తక్షణమే 4 రోజుల్లో గ్రామసమస్యలన్నీ పరిష్కరించాలని సెక్రటరి కి ఆదేశించిన మంత్రివర్యులు మరియు గ్రామంలో వైరల్ జ్వరాలు తీవ్రత ఎక్కువగా ఉండడంతో జిల్లా వైద్యాధికారికి వెంటనే తగు జాగ్రత్తలు మెడికల్ క్యాంప్స్ నిర్వహించి మందులు అందుబాటులో ఉండాలని ఆదేశించిన మంత్రివర్యులు గ్రామ సమస్యలు మంత్రివర్యుల దృష్టికి తీసుకొచ్చిన వారిలో జి, నాగేష్ త్రాగునీటి సమస్యను తెలియజేయగా, కె, సీమోను హౌసింగ్ బిల్స్ పెండింగ్గార్చి,ఎమ్, మాధవరెడ్డి, గ్రామంలో వైరల్, సమస్యను, జి, సంజీవరెడ్డి, త్రాగునీటి సమస్యను, ఎస్, మనోజ్ సి, సి, రోడ్ల సమస్యను మంత్రివర్యుల దృష్టికి తీసుకొని రాగ తక్షణమే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించడంతో గ్రామ ప్రజలు తమ ఆనందాన్ని హర్షాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిని,మండల అభివృద్ధి అధికారి, తహశీల్దార్ ప్రశాంతి, డి, ఎల్, పి, ఓ, ప్రశాంతి, ఎలిక్ట్రికల్ ఎ, ఇ, గ్రామ నాయకులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## నారాయణ స్కూల్‌లో

# వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు




**నూజివీడు ఆగష్టు 25,(ఆంధ్రపత్రిక) :** పట్టణ పరిధి లోని ఎ.జి.ఎమ్.హరిష్ బసవరాజు ఆర్ ఐ మేక గురు ప్రసాద్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకట సింహాద్రి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను మర్చిపోకుండా కాపాడుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలను నారాయణ స్కూల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఎంతోఉత్సాహంతో ఉట్టి కొట్టే నిర్వహణ కార్యక్రమాలలో పాల్గొన్నారు. చిన్నారులు కృష్ణయ్య, రాధమ్మ వేషధారణలో ఆకట్టుకున్నారు.ఈ వేడుకల్లో ఈ- కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ పావని ఈ ఛాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ అస్మా హైస్కూల్ డిస్ సునీల్ విద్యార్థులు,ఉపాధ్యాయులు,తల్లి దండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ఎమ్మెల్యే కొలికపూడిపై వైసిపి నాయకుల

# ఆరోపణలను ఖండిస్తున్నాం

**తిరువూరు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు..**



**ఎ.కొండూరు ఆగష్టు 25 ( ఆంధ్రపత్రిక) :** అభివృద్ధి కోసం అనునిత్యం శ్రమిస్తున్న తిరువూరు కూటమి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పై వైసీపీ నాయకులు, వైసీపీ మీడియా చేస్తున్న విషప్రచారాన్ని ఖండిస్తున్నామని తిరువూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారంఎ. కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మనుబోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యే పై ఆరోపణలు చేస్తున్నారంటే కచ్చితంగా అది కూటమి ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలుగానే మేము భావిస్తున్నామని అటువంటి ఆరోపణలను జనసేన పార్టీ ఖండిస్తుందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కూడా అవ్వట్లేదని కానీ అధికారం కోల్పోయిన వైసీపీ నాయకులు ఏం చేయాలో తెలియక నియోజకవర్గంలోని కూటమి ఎమ్మెల్యే పై విష ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు.తిరువూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థిగాకొలికపూడిని ప్రకటించినది మొదలు నాటినుండి ఎమ్మెల్యేగా ఎన్నికైన అనతి కాలంలోనే తిరువూరు నియోజకవర్గ సామాన్య ప్రజల అవసరాలను తీరుస్తూ, వేలాదిమంది విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే విధంగా అలానే కిడ్నీ వ్యాధి సమస్యతో సతమతమవుతున్న ఎ. కొండూరు మండలాన్ని ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత దత్తత తీసుకున్న క్రమంలో నియోజకవర్గ అభివృద్ధిని తన భుజస్కందాలపై వేసుకున్న శ్రీ కొలికపూడి శ్రీనివాసరావు చేస్తున్న మంచి పనులు చూసి ఓర్వలేని కొన్ని పత్రికలు, కొన్ని ఛానళ్ళలో కొంతమంది వైసీపీ నాయకులు పనిగట్టుకొని గ్రావెల్ మట్టి తోలకాలపై, విష ప్రచారం చేస్తున్నారని దానిని మేము జనసేన పార్టీ తరపున పూర్తిగా ఖండిస్తున్నామని అన్నారు. గడిచిన గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ మట్టి త్రవ్వకాలు,మట్టితోలకాలు అక్రమ ఇసుకతోలకాలతో కొంతమంది నాయకులు కోట్లు కొల్లగొడుతున్నా గాని ఒక్క రాత గానీ ఒక్క చర్చ గాని పెట్టని సాక్షి పేపర్ యాజమాన్యం, వైసీపీ నాయకులు నేడు నియోజకవర్గంలో ఏదో అవినీతి జరిగిపోతున్నట్టుగా ప్రచారం మొదలు పెట్టారని, సామాన్య కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదుగుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన కొలికపూడి శ్రీనివాసరావు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని వారు ఇలా విష ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు. తిరువూరు నియోజకవర్గంలో గత కొద్ది రోజుల నుంచి అన్ని ప్రభుత్వ అనుమతులు తీసుకుని చట్టబద్ధంగా మట్టి తోలకాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఎమ్మెల్యేకి అంట గట్టడం సరికాదని మీ గత ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో ఎన్ని చోట్ల ప్రభుత్వ అనుమతి తీసుకొని మట్టి క్వారీలు, ఇసుక తోలకాలు నిర్వహించారో అంతా మాకు తెలుసని, విషపు ప్రచారం చేస్తున్న మీ ఛానల్ లోనే డిబేట్లకు నేను వస్తానని ఈ సందర్భంగా శ్రీనివాసరావు తెలియజేశారు తిరువూరు నియోజకవర్గంలో జరుగుతున్న మట్టి తోలకాలపై గత ప్రభుత్వంలో జరిగిన గ్రావెల్, మట్టి అక్రమాలపై శనివారం తిరువూరు బోసు బొమ్మ సెంటర్లో బహిరంగ చర్చకు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చినా కానీ ఎవరూ రాలేదని ఆయన అన్నారు..గత వైసిపి ప్రభుత్వం ఉన్న ఐదేళ్ల కాలంలో జగనన్న కాలనీల పేరిగత ప్రభుత్వ పెద్దలు సొమ్ములు ఎంత కొల్లగొట్టారో కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని చాలామంది వైసిపి నాయకులు అక్రమ మట్టి తోలకాలు, ఇసుక తోలకాలు ,పేకాటలు, కోడి పందాలు నిర్వహించి కోట్లది రూపాయలు దండుకున్నారని ఏనాడు ఒక రాత గాని ఒక్క మాట గాని మాట్లాడని వారంతా అధికారం కోల్పోయేసరికి ఏమి మాట్లాడాలో తెలియక ఎమ్మెల్యే గురించి తప్పుడు రాతలు రాయిస్తూ విష ప్రచారం చేయడం మొదలు పెట్టారని ఆయన అన్నారు.గత వైసిపి ప్రభుత్వంలో ఎ. కొండూరు మండలంలో ఉన్న కిడ్నీ బాధితుల గురించి నోరు మెదిపిన పాపాన పోలేదని కానీ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతున్న ఉన్నత విద్యావంతుడైనటువంటి కొలికకపూడి శ్రీనివాసరావు ఎదుగుదలని ఓర్వలేని కొన్ని దుష్ట శక్తులు విష ప్రచారం చేయడం మొదలుపెట్టారని ఎమ్మెల్యే కొలిక పూడి శ్రీనివాసరావు మీద ఆరోపణలుచేయటంమంటే కూటమి ప్రభుత్వం మీద ఆరోపణ చేయటమేనని ఇలాంటి ఆరోపణలు తిరువూరు నియోజకవర్గజనసేన పార్టీ ఖండిస్తున్నదని ఈ సందర్భంగా ఆయన అన్నారు..ఇకనైనా తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు మీద నిరాధారఆరోపణలు మానివేసి తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## పోతిన నాగమణి ట్రస్ట్ ఆధ్వర్యంలో

# పేదలకు అన్నదానం



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 25, (ఆంధ్రపత్రిక) :** ప్రజాహిత కార్యక్రమాలే లక్ష్యంగా పోతిన నాగమణి మెమోరియల్ ట్రస్ట్ తరుఫున సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ పోతిన వరప్రకాష్ చెప్పారు. ఆదివారం పోతిన నాగమణి 32వ వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోతిన వర ప్రకాష్ మాట్లాడుతు తన మాతృమూర్తి నాగమణి పేరిట ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా ఏటా అనేక సేవాకార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. పేదలకు సాయంచేయాలన్న తన తల్లి కోరిక మేరకు ట్రస్ట్ ఏర్పాటుచేసి పేదలకు అవసరమైన సహాయసహకారాలను అందచేస్తున్నట్లు ఆయన వివరించారు. కాగా ఈ అన్నదాన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఏ. పి. ఏం. పి.ఏ జిల్లా సంయుక్త

# కార్యదర్శిగా శివప్రసాద్ వక్కపాటి



**బంటుమిల్లి, ఆగస్టు 25, (ఆంధ్రపత్రిక) ;** బంటుమిల్లి, కృత్తివెన్ను ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొపెషనల్ అసోసియేషన్ కృష్ణా జిల్లా సంయుక్త కార్యదర్శిగా సీనియర్ పాత్రికేయులు వక్కపాటి శివప్రసాద్ ఎన్నిక అయ్యారు. ఆదివారం మచిలీపట్నం ఆర్. కే ప్యారాడైజ్ హొటల్ లో జరిగిన ఏ. పి. ఏం. పి.ఏ కృష్ణా జిల్లా నూతన కార్యవర్గ సమా వేశంలో రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీ రాములు యాదవ్, రాష్ట్ర కోశాధికారి మత్తి శ్రీకాంత్ యిమేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వక్కపాటి శివప్రసాద్ మాట్లాడుతూ సోదరులు, ఏ. పి. ఏం. పి.ఏ రాష్ట్ర అధ్యక్షులు శ్వీర్ల శ్రీ రాములు యాదవ్ కీ, సోదరులు, ఏ. పి. ఏం. పి.ఏ రాష్ట్ర కోశాధికారి మత్తి శ్రీకాంత్ కీ సోదరులు ఏ. పి. ఏం. పి.ఏ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ పుట్టి కృష్ణా ప్రసాద్ కీ హృదయ పూర్వక ధన్యవాదములు తెలుపుతున్నట్లు ఏ. పి. ఏం. పి.ఏ ద్వారా జర్నలిస్ట్ ల ఈళ్ళ స్థలాలు, పిల్లల స్కూల్ పీజులు పై పోరాటంలో నా వంతు కృషి చేస్తానని, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులకు అన్ని వేళల అందుబాటులో ఉంటూ ఏ. పి. ఏం. పి.ఏ బలోపేతం కు కృషి చేస్తానని తెలిపారు.

## భారతీయ జనతా పార్టీ కార్యకర్తని పరామర్శించిన మేడం రమేష్



**మాచర్ల, ఆగస్టు 25, (ఆంధ్రపత్రిక) ;** మాచర్లలో మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో బిజెపి నాయకులు దివిశెట్టి బ్రహ్మయ్య వారి తమ్ముడు వెంకటేశ్వర్లు గారి ఇండ్లు పూర్తిగా కాలిపోయి వెంకటేశ్వర్లకు కాళ్లకు తీవ్ర గాయాలు 20% వరకు కాలినవి వారిని దయం ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు వారిని మధ్యాహ్నం హాస్పిటల్ లో పల్నాడు జిల్లా బిజెపి జనరల్ సెక్రెటరీ మరియు మాచర్ల ఇంచార్జ్ మేడం రమేష్ బోల్లి మండలం పార్టీ ప్రెసిడెంట్స్ కాసా లక్ష్మయ్యరామర్శించారు వీరితోపాటు మాచర్ల నియోజవర్గ కో-కన్వీనర్ కాశీపతి మాచర్ల పట్టణ బిజెపి అధ్యక్షులు ఓర్సుక్రాంతికుమార్ దేవిసెట్టి బ్రహ్మయ్య గారు తదితరులు ఉన్నారు

ఆంధ్రపత్రిక

జిల్లాలకు విలేఖరులు కావలెను

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన
ఏకైక దినపత్రిక - స్థాపితం - 1914

గుంటూరు, బాపట్ల, ఒంగోలు జిల్లాలోని
నియోజకవర్గాలకు
మరియు మండలాల వారిగా
విలేఖర్లు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
9849998069, 8639287624

# మహిళలను లక్షాధికారులను చేయటమే ధ్యేయం

## కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ




**మచిలీపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** జిల్లాలో స్వయం సహాయక సంఘం మహిళలను లక్షాధికారులను (లఖ్ పతి దీదీ) చేసే లక్ష్యంతో జీవనోపాధి కార్యక్రమాలపై తగిన అవగాహన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. లఖ్ పతి దిది కార్యక్రమాన్ని గౌరవ ప్రధాన మంత్రి శ్రీ దామోదర్ దాస్ నరేంద్ర మోడీ ఆదివారం మహారాష్ట్ర జల్గావ్ లో నిర్వహించిన "లఖ్ పతి దీదీ సమ్మేళన్" కార్యక్రమానికి హాజరు కాగా, ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ విసి హాలు నుండి వర్చువల్ గా పాల్గొని, జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లో మహిళలకు 294 గ్రూపులకు 45.40 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాలు, 460 గ్రూపులకు 6.18 కోట్ల రూపాయలు సామాజిక పెట్టుబడి నిధి రుణాల చెక్కులు పంపిణీతో పాటు లఖ్ పతి దీదీ లకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లఖ్ పతి దిది కార్యక్రమ్మాన్ని గౌరవ ప్రధాన మంత్రి దామోదర్ దాస్ నరేంద్ర మోడీ 2023 ఆగస్టు 15 న ప్రారంభించడం జరిగిందన్నారు. దేశంలో మొత్తం 9 కోట్ల మంది మహిళా సభ్యులు స్వయం సహాయక సంఘాల్లో ఉన్నారని, వారందరు సంఘంలోని వారి పోదుపుల నుండి , బ్యాంకు నుండి లింకేజి రుణాలు తీసుకుని, వారి కుటుంబం వివిధ రకాలుగా జీవనోపాధి సాగిస్తున్నారని తెలిపారు. అందులో 3 కోట్ల మంది మహిళలను రాబోయే 2024-25 సంవత్సరానికి లక్షాధికారి మహిళలుగా తీర్చిదిద్దాలని సంకల్పించం జరిగిందని, అందులో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ యొక్క లక్ష్యం 20 లక్షల మంది మహిళలు కాగ, మన కృష్ణా జిల్లా లక్ష్యం 77,121 మంది మహిళలను లక్షాధికారులను చేయడం అన్నారు.ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్ర బాబు నాయుడు రాష్ట్ర స్థాయి కలెక్టర్ల సదస్సులో ఈ లఖ్ పతి దిది కార్యక్రమాలు సెర్ఫ్‌కు అనుసంధానించడం జరిగిందని, నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించుటకు అవసరమైన ఋణ సదుపాయాలు సదరు గ్రూపు సభ్యులకు కల్పించి వారికి జీవనోపాది కల్పించి, హ్యాండ్ హెూల్డ్ సపోర్ట్ చేస్తూ, నిరంతర పర్యవేక్షణ చేస్తూ, వారిని లక్షాదికారులుగా తీర్చిదిద్దుటకు కృషి చేయవలసినదిగా దిశానిర్దేశం చేయడం జరిగినదన్నారు. ఈ దిశగా జిల్లాలో ఎవరైతే నెలవారీ ఆదాయం 10 వేలు కన్నా తక్కువగా ఉన్నదో, వారిని లక్ష్యంగా ఎంచుకుని, వారికి ప్రభుత్వ పథకాలపై, మరియు జీవనోపాధి కార్యక్రమాలపై, అవగాహన కల్పిస్తూ, తగిన శిక్షణలు ఇప్పిస్తూ, వారికి వ్యవసాయ మరియు అనుబంధ కార్యక్రమాలు, ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వాడకం, అలాగే, వ్యవసాయేతర రంగంల పి ఎమ్ ఎఫ్ ఎం ఈ, పీఎంఈ జీపి, పిఎంఎంఎస్వై, పి ఎం ఎం వై ద్వారా, బ్యాంకు లింకేజి ద్వారా సుస్థిర జీవనోపాధి ఏర్పాటు చేసి, వారి వార్షిక ఆదాయం లక్షకు పైబడి వచ్చే విధంగా చేయడం, అందులో భాగంగా, మాస్టర్ ట్రైనర్స్ (కృషి సఖి)ను గుర్తించి శిక్షణలు ఇవ్వడం, సి.ఆర్.పి. ( వివో ఏ)లకు ట్రైనింగ్ ఇవ్వడం, పొటెన్షియల్ లఖ్ పతి దిది (లక్షాధికారి అయ్యే అవకాశం ఉన్న మహిళ) ను గుర్తించడం, వారికి అవగాహన కల్పించడం జగిగినదన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ/డిఆర్డిఏ పిడి ఇంచార్జి నాగేశ్వర నాయక్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు తోట నాగ మునిమ్మ, కోశాధికారి ఎన్ రాజకుమారి,స్వయం సహాయ సంఘాల మహిళలు పాల్గొన్నారు.




## పరిశ్రమల్లో ప్రమాదాల నివారణపై

# తగు జాగ్రత్తలు తీసుకోవాలి

**బాపట్ల ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** పరిశ్రమలలో ప్రమాదాల నివారణపై అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. పరిశ్రమల నిర్వహణ, ప్రమాదాల నియంత్రణపై అనుబంధ శాఖల అధికారులతో ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. పరిశ్రమలలో మానవ వనరుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. విపత్తులు, ప్రమాదాలు జరిగిన తర్వాత సహాయక చర్యల కంటే ముందస్తు సంరక్షణ చర్యలు ముఖ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రెడ్, ఆరెంజ్ క్యాటగిరిలలో ఉన్న పరిశ్రమలను అధికారులు తనిఖీలు చేయాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణం చట్ట ప్రకారం ఆయా పరిశ్రమలు నిర్వహిస్తున్నాయా అనే అంశాలపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సూచించిన 19 ప్రధాన పరిశ్రమలలో అధికారులు బృందాలుగా వెళ్లి పరిశీలించాలన్నారు. నిబంధనల వర్తింపుపై నిశిత పరిశీలన ఉండాలన్నారు. ఈ బి సి బి నిబంధనల అమలు తీరుపై నివేదిక ఇవ్వాలన్నారు. పరిశ్రమలలో పనిచేస్తున్న అసంఘటిత రంగ



కార్మికుల గణన చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. పరిశ్రమలలో మానవ వనరుల సంరక్షణ, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆ కార్మికులకు వేతనాల చెల్లింపులు, బీమా, ఈఎస్ఐ, పిఎఫ్ వర్తింపుపై తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలన్నారు. ముఖ్యంగా గ్రానైట్ పరిశ్రమలు, పాలిషింగ్ యూనిట్లలో కార్మిక శాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. పరిశ్రమల నుండి ప్రమాదకర ఉద్గారాలు వెలువడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నీరు, గాలి, పర్యావరణం కలుషితం గాకుండా చూడాలన్నారు. చట్టాల అమలు తీరుపై పరిశ్రమలలో పనిచేసే సిబ్బంది, కార్మికులకు అవగాహన కల్పించాలని సూచించారు. అవగాహన సదస్సులు ఆయా పరిశ్రమలలో ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా నియంత్రణ చర్యలపై ఆయా పరిశ్రమలలో తీసుకుంటున్న చర్యలను పరిశీలించి నివేదించాలన్నారు. బాపట్ల జిల్లాలో పరిశ్రమల ద్వారా ఏ వ్యక్తికి ఎలాంటి హాని జరగరాదని, ప్రాణ నష్టం ఉండరాదని చెప్పారు.

ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఎక్కడైనా ప్రమాదాలు సంభవిస్తే తక్షణమే సహాయక చర్యలకు సంబంధించిన వ్యవస్థ పనిచేస్తుందా లేదా అనే అంశాలను పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వై రామకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లఖ్ పది దీదీలను సన్మానించిన

# ప్రజాప్రతినిధులు అధికారులు

**కొరిశపాడు ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** కొరిశపాడు మండలం వెలుగు కార్యాలయం లో గుర్తించిన లఖ్ పది దీది లను అధికారుల ప్రజా ప్రతినిధులు సన్మానం చేశారు.మన భారత దేశంలోని పేద మహిళలకు జీవనోపాధి అవకాశా లు కల్పించి వారిని లక్షాధికారులుగా చేయాలని ఉద్దేశంతో ఈరోజు వర్చువల్ ద్వారా గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన సందేశాన్ని అందించడం జరిగినది. ఇందులో భాగంగా పొటెన్షి యల్ లక్పతి దీదీలను , సీఆర్పీలను గురించి చర్చించడం జరిగింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ మొత్తం లక్పతి దీదీ 100 రోజుల లక్ష్యం 1,22,160 మందిని అలాగే బాపట్ల జిల్లాకు 4628 మందిని టార్గెట్గా ఇవ్వడం జరిగింది. వీరికి వంద రోజుల్లో జీవనోపాధికి కావలసిన నిధులు సిఐఎఫ్/ విఆర్ఎఫ్/ బ్యాంకు లింకేజీ/ఉన్నతి/ స్త్రీనిధి ద్వారా ఏర్పాటు చేసి ఆదాయం పెంచాలని తెలిపారు. అలాగే వెలుగు కార్యాలయ హాలులో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి గారి వర్చువల్ మీటింగ్ కొరిశపాడులో జరిగిన కార్యాక్రమానికి జడ్పీటీసీ తుళ్ళూరి వెంకటరమణ ఎంపీపీ సాధినేని ప్రసన్న కుమారి గార్ల చేతుల మీదుగా లక్పతి దీదీ లను, అజీవిక సీఆర్పీలను సన్మానించి సర్టిఫికెట్స్ అందించడం జరిగింది. మరియు బాపట్ల లో జరిగిన కార్యక్రమం లో జిల్లాలో ఉన్న 25 మండలాల్లోని 305 గ్రూపులలో ఉన్న లిలక్పతి దీదిలి లకు 62,75,00,000 రూపాయల చెక్కును కూడా గౌరవ జాయింట్ కలెక్టర్ గారు, మరియు డి.ఆర్. ఓ గార్ల ద్వారా జిల్లా సమాఖ్య పదాధికారులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పథక సంచాలకులు శ్రీ వై.పిచ్చి రెడ్డి గారు, బాపట్ల జిల్లా సమైక్య పదాధికారులు బి. ద్రాక్షావలి, ఎన్. స్వర్ణకుమారి, సిహెచ్. ధనలక్ష్మిలు, లక్పతి దీదీ లు, సీఆర్పీలు, డిపిఎంయు సిబ్బంది ,బాపట్ల మండలం ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.



# పేకాట రాయుళ్ళ అరెస్ట్

**వేటపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):** మండలంలోని పొట్టి సుబ్బయ్య పాలెం గ్రామంలో పేకాట నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో రైడ్ నిర్వహించడం జరిగిందని వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఈ రైడ్ లో 6గురు వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందని, వారి వద్ద నుండి రూ 3,200/- స్వాధీనం చేసుకున్నట్లు తెలియచేశారు. ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎవరు పాల్పడవద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.



## సెయింట్ ఆన్స్ విద్యార్థికి జె.యన్.టి.యు(కె)

# అప్రిసియేషన్ అవార్డు

**చీరాల, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):** సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి విద్యార్థి సయ్యద్ ఖాజావలికి జె.యన్.టి.యు(కె) వారిచే అప్రిసియేషన్ అవార్డు ఫర్ ఫరఫార్మ్ ఇన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అవార్డు పొందినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు,కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రకటనలో తెలియజేశారు. ఇటీవల జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటి, కాకినాడ వారు (జె.యన్.టి. యు.కె) ఫార్మేషన్ డే సందర్భంగా, ప్రకటించిన అవార్డులలో కళాశాల చెందిన యం.బి.ఎ. విద్యార్థి సయ్యద్ ఖాజావలికి అప్రిసియేషన్ అవార్డు ఫర్ పర్ఫార్మ్స్ ఇన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అవార్డును ప్రదానం చేసి నట్లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీశ్ బాబు తెలిపారు. సయ్యద్ ఖాజావలి ఇటీవల పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలలో జరిగిన జాతీయ జూనియర్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో, వివిధ విభాగాలలో రెండు బంగారు, రెండు వెండిమెడల్స్ ను సాధించి, అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు, భారత దేశం తరపున యూరప్ లో పాల్గొనేందుకు, ఎంపికైన సందర్భంగా, ఈ అవా ర్డును ప్రదానం చేసినట్లు, కళాశాల వ్యాయామ ఉపాధ్యాయు లు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. జె.యన్.టి.యు(కె) అప్రి సియేషన్ అవార్డు ఫర్ పర్ఫార్మెన్స్ ఇన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అవార్డు పొందిన సంద ర్భంగా, కళాశాల ఎం.బి.ఎ.వి భాగాధిపతి డాక్టర్ ఆర్.ఇమ్మా నియేల్, అక్రిడిటేషన్స్ డైరెక్టర్ డాక్టర్. సి. సుబ్బారావు, వివిధ విభాగాధిపతులు, కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు, అధ్యాప కులు, విద్యార్థినీ, విద్యార్థులు, సయ్యద్ ఖాజావలికి అభినందనలు తెలియజేశారు.



## నేటి నుండి ఏలూరులో ఆగిన వందే భారత్ రైలు

**నూజివీడు, ఆగస్టు 26(ఆంధ్రపత్రిక) :** ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "వందే భారత్ రైలు ఎట్టకేలకు ఆదివారం నుంచి ఏలూరులో హాల్డ్ ఏర్పాటు చేయడంతో మన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి,లోకసభ సభ్యుడు పుట్టమ హేష్కుమార్, శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, జోనల్ రైల్వే బోర్డు సభ్యులు గుమ్మడి కృష్ణ చైతన్య,మెరక ప్రాంత అభివృద్ధి జే య సి మరియు నూజివీడు అసెంబ్లీ బిజెపి నాయకులు గోగినేని శ్రీనివాస్ కుమార్ అప్పారావు,స్వయం సేవక ప్రముఖ చాట్రాతి రామకృష్ణ, బిజెపి జిల్లా యస్.సి సెల్స్ ఉపాధ్యక్షులు బడుగు శ్రీకాంత్ మరియు బిజెపి ఏలూరు జిల్లా పార్టీ శ్రేణులు, టిడిపి %ం% జనసేన శ్రేణులు ఆనందోత్సాహం లతో పాల్గొన గా ట్రైన్ ఆగింది. ఈ నేపథ్యంలో విశాఖ, హైదరాబాద్, మధ్య నడుస్తున్న ఈ రైలు రోజు ఉదయం సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళుతూ 9.49కి ఏలూరులో ఆగి 9.50కి బయలుదేరుతుంది. సాయంత్రం విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళుతూ. 5.54కి వచ్చి5.55కి బయలుదేరుతుంది. ఏలూరులో ఒక్క నిమిషం ఆగుతుంది.



## పేదలకు అండగా

# ముఖ్యమంత్రి సహాయ నిధి

## ఎమ్మెల్యే గద్దె రామమోహన్

**విజయవాడ, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** అత్యవసర సమయంలో అప్పులు చేసి వైద్యం చేయించుకున్న వారికి మరియు ఆరోగ్యశ్రీలో వర్తించని వైద్యానికి సీఎం సహాయనిధి ద్వారా ఆదుకోవడం జరుగుతుందని, అటువంటి సీఎం సహాయ నిధిని గత ప్రభుత్వ జగన్మోహన్ రెడ్డి నిర్వీర్యం చేశారని శాసనసభ్యులుగా గద్దె రామమోహన్ అన్నారు. ఆదివారం ఉదయం అశోక్ నగర్ లోని తెదేపా కార్యాలయంలో 2వ డివిజన్ బ్రహ్మానంద రెడ్డి నగర్ కు చెందిన దుక్క లక్ష్మణరావుకు మోకాలు ఆపరేషన్ నిమిత్తం రూ.లక్షా పదివేలు సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి పత్రాన్ని గద్దె రామ్మోహన్ అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు పెద్ది రామమోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి అనేది పేదలకు భరోసా ఇచ్చే మంచి పథకం అన్నారు. మళ్లీ చంద్రబాబు తిరిగి ముఖ్య మంత్రి కావడంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాకా మొట్టమొదటి సీఎం రిలీఫ్ ఫండ్ అందజేయడం జరిగిందన్నారు.



## తోటి వారికి సహాయం చేసే

# ఆలోచన ఉండాలి

## తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్

**విజయవాడ, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** తోటి వారికి సహాయం చేయాలనే ఆలోచన రావడం చాలా అభినందనీయమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ఉచితంగా మెడికల్ క్యాంప్ లు నిర్వహించిన పోతుల రాజేంద్ర ఫౌండేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 13వ డివిజన్ పటమట కిసాన్ రోడ్డు, తోట వారి వీధి సచివాలయంలో పోతుల రాజేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో హార్ట్ మెడికల్ క్యాంప్ ఆదివారం నిర్వహించడం జరిగింది. తూర్పు నియోజకవర్గ. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై మెడికల్ క్యాంప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ మెడికల్ క్యాంప్ నిర్వహించడం అనేది చాలా ఉత్తమమైన సేవ అన్నారు. ప్రస్తుత కాలంలో హార్ట్ కు సంబంధించిన వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. స్థానికంగా నివాసం ఉంటున్న ప్రాంతానికి వైద్యులు వచ్చి ఉచితంగా హార్ట్ కు సంబంధించిన పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. గుండెకు సంబందించిన ఈసీజీ, 2డి ఎకో వంటి పరీక్షల ద్వారా గుండె పనితీరును గుర్తించవచ్చునని చెప్పారు. అలాంటి పరీక్షలను చేయించుకోవడం ద్వారా గుండె పనితీరు ఎలా ఉందో తెలుస్తుందని చెప్పారు. పరీక్షలు చేయించుకుని మందులను వాడటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని చెప్పారు. అలాంటి వైద్యపరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్ ఉన్నాడు.



## యువతగంజాయికి బానిసలుగా మారితే

# భవిష్యత్తు అంధకారమే

## ఏసీపి ఎస్.మురళీమోహన్



**ఎ.కొండూరు ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** యువకులుగంజాయికి బానిసలుగా మారి తమ భవిష్యత్తును పాడు చేసుకోవద్దని గంజాయి కి బానిసలుగా మారిన వారు తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకోవడమే అవుతుందని మైలవరం ఏసిపి సుంకర మురళీమోహన్ అన్నారు. ఆదివారం సాయంత్రం చీమలపాడు మెయిన్ సెంటర్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ పిల్లలపై తల్లిదండ్రులు నిత్యం నిఘా ఉంచి తమ పిల్లల కార్యకలాపాలను గమనిస్తూ ఉండాలని అన్నారు. గంజాయి కి బానిసలుగా మారిన వారు కొంతకాలం తర్వాత డబ్బులు లేక దొంగతనాలకు అలవాటు పడతారని వారి భవిష్యత్తు శూన్యంగా మారుతుందని చెప్పారు అలానే ఈ ప్రాంతంలో చైన్ స్నాచర్లు ఉంటారని వారి పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు మహిళలు బంగారు ఆభరణాలు మెడలలో ధరించుకొని బయటకు వెళ్లే సమయాల్లో బంగారు ఆభరణాలు కనపడకుండా సాధ్యమైనంతవరకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ లేని ప్రయాణం ఎంతో ప్రమాదకరమని అన్నారు. రూ.1,50,000తో ద్విచక్ర వాహనం కొంటున్న యువకులు రూ.500 రూపాయలతో హెల్మెట్ కొనుక్కోకపోవడం విచారకరమని ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని సూచించారు ప్రాణాలు ఎంతో విలువైనవని హెల్మెట్ లేని ప్రయాణలవల్ల ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారని యువకులు కొందరు కాళ్లు చేతులు విరగకొట్టుకొని వికలాంగులుగా మారిన సంఘటనలు కూడా ఉన్నాయని అన్నారు సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ వీడియోలు ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని కొందరు చదువుకున్న వారిని సైతం మోసగిస్తూ డబ్బులు గుంజుతున్నారని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు చీమలపాడు సెంటర్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నందున రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను వెనక్కి జరిపి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని అలానే ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుల్ ను నియమించాలని ఎ. కొండూరు ఎస్సై చల్లా కృష్ణకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక

# కార్యక్రమం రద్దు

**బాపట్ల ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** ప్రతి సోమవారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కా ర వేదిక" పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ కార్యక్రమాన్ని ఆగస్టు 26వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. వచ్చే సోమవారం యధావిధిగా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కావున సుధీర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.



## తెలుగు సాహిత్యానికి
# వైభవం తెచ్చినవారు కొప్పరపు సోదరులు

**అద్దంకి ఆగస్టు 25(ఆంధ్ర పత్రిక):** ఆదివారం సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవా సదన్ జరుగుచున్న శతావధానం రెండవరోజు సభకు యం కృష్ణ కిషోర్ అధ్యక్షత వహించారు.తెలుగువారికే చెందిన అవధాన కళ'కు పద్యవిద్య కు దిట్టమైన పట్టుకొమ్మలుగా నిలిచి ప్రాభవం గడించి తెలుగుసారస్వతానికి వైభవం అందించిన వారు కొప్పరపు సోదర కవులని డి.వి.యం.సత్యనారాయణ కొప్పరపు కవుల ఘనతను కీర్తించి వారు వ్రాసిన పద్యాల మధురిమను వివరించారు. మహాకవులకు దీటైన వారసులు నిమిషాలలో రసప్రబంధాలు సృష్టించిన సృజనామూర్తులువేల సభలలో లక్షల పద్యాలు ఆశువుగా చెప్పిన మహామహులు తెలుగు సాహిత్య క్షేత్రంలో కావ్యప్రజ్ఞా ధురీణులు కొప్పరపుకవులని అధ్యక్షతవహించిన యం.కృష్ణ కిషోర్ అన్నారు.స్పష్టమైన ఉచ్చారణ ఖంగు ఖంగుమనే కంఠస్వరం



వేదనాదం వలె వాగరి ప్రాసంగిక శ్లోకములు పద్యములు ఛలోక్తులు, ఉక్తి వైచిత్రితో వారి సాహిత్య సభలు సరసవినోదినీ వేడుకలుగా సాగేవని పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి కొప్పరపు వారి కవితావైభవాన్ని వర్ణించారు ఈ కార్యక్రమంలో వారణాసి రఘురామశర్మ డాక్టర్ ఉబ్బా దేవపాలన %=. ఎ%. రాఘవరావు చుండూరి మురళీసుధాకర రావు అడుసుమల్లి అనంత కోటేశ్వరరావు జమ్మలమడక హనుమంతరావు చప్పిడి వీరయ్య, లక్కరాజు శ్రీనివాసరావు నిమ్మరాజు నాగేశ్వరావు కె.వి.పోలిరెడ్డి గాడేపల్లి దివాకర దత్తుపాలపర్తి జ్యోతిష్మతి సింహాద్రి జ్యోతిర్మయి మానేపల్లి నాగకుమారశర్మ, ఇలపావులూరి శేషశ్రీధర్ శర్మ కుందుర్తి ప్రసన్నాంజనేయులు శ్రీ దుర్భా కౌండిన్య శాయి అడసుమల్లి అనంతకోటేశ్వరరావు ధేనువకొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మన సంస్కృతి, సంప్రదాయాలను
# నేటి యువతకు తెలియజేయాలి

### - అలరించిన బ్లూమింగ్ డేల్ సంస్కృతి కార్యక్రమం









**విజయవాడ, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాక ఆధునికత మోజులో పడి నేటి తరం మన సంస్కృతి సాంప్రదాయాలను మర్చిపోతోంది. భారతీయ సంస్కృతి, కళలు, వృత్తులు వాటి విశిష్టతను భావి భారత పౌరులైన విద్యార్థులకు తెలియజేసేందుకు సంస్కృతి 2024 పేరిట వినుతన కార్యక్రమాన్ని నిర్వహించింది నగరంలోని బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్. బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో ఆదివారం సంస్కృతి-2024 పేరిట మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమం విద్యార్థులను, తల్లిదండ్రులను అలరించింది. పల్లెటూరి వాతావరణం, వస్త్రదారణ, చిరు ధాన్యాలతో వంటలు.. ఇలా మన పూర్వికుల జీవన విధానాన్ని తెలిపేలా చేసిన ఏర్పాట్లు చూపరులను మంత్ర ముగ్దులను చేసాయి. సాంప్రదాయ దుస్తులలో ఉన్న విద్యార్థులను చూసి వారి తల్లిదండ్రులు సంబరపడ్డారు. పూర్వం గ్రామాల్లో అందరు కలిసి మెలిసి ఆడుకున్న ఆటలను విద్యార్ధులకు పరిచయం చేయడంతో పాటు వారితో కూడా ఆడించారు. మన పూర్వికులు తినే ఆహారం, మరియు పిండి వంటలు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ అట్లూరి విజయబాబు మాట్లాడుతూ, నేటి తరం విద్యార్థులకు భవిష్యత్ తరాలకు మన సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని ఎంతో సంతోషంగా గడిపారని చెప్పారు. ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో మన పూర్వికుల ఆహారపు అలవాట్లు, జీవన విధానాలు తెలపడం ద్వారా భవిష్యత్తు తరాలకు మన సంస్కృతి సాంప్రదాయాలు తెలుస్తాయన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల్లో ఉన్న విశిష్టతను, గొప్పతనాన్ని తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ప్రిన్సిపల్ హర్ సిమ్రన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు జి.సురేంద్ర, విజయవాడ క్లబ్ సెక్రటరీ సతీష్ చంద్ర, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## సి పి ఆర్ తో వ్యక్తిప్రాణాలు కాపాడిన
# ఫైర్ హెడ్ కానిస్టేబుల్ రంగారావు



**కలిదిండి, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):** మానవత్వం పరిమళించిన వేళ తోటి వారు కష్టాలను చూసి మానవత్వం చాటుకోవటం మానవుడి బాధ్యత. ప్రస్తుతం సమాజంలో మనిషి తోటి వారి గురించి ఆలోచించే తీరిక లేక బిజీబిజీగా కాలం గడుపుతున్నారు. పట్టించుకోనే మనసులు అరుదు. కానీ రంగారావు ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడి మానవత్వం చాటుకున్నాడు. ఆచేతన స్థితిలో పడిపోయిన వృద్ధుడుని సి ఐ ఎస్ ఎఫ్ ఐఫైర్ హెడ్ కానిస్టేబుల్ రంగారావు సి పి ఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు. ఈ ఘటన ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలం సాన రుద్రవరం ప్రాథమిక పాఠశాల సమీపంలో చోటు చేసుకున్నది. సాన రుద్రవరం గ్రామానికి చెందిన రంగారావు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లో ఫైర్ హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నాడు. సెలవు పై గత ఆదివారం సానా రుద్రారం వచ్చాడు. ఆరోజు రంగారావు ఏదో పనిపై వెళుతూ ఉండగా అదే సమయంలో గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు(60) పచ్చగడ్డి మోపు ఎత్తుకొని వెళ్తున్న సమయంలో ఆ చేతన స్థితిలో పడి పోయాడు. సమీపంలో ఉన్న కొంతమంది ఫిట్స్ వచ్చి పడిపోయి ఉంటాడమానని అతని చేతిలో ఇనుముకు సంబంధించిన రెంచెను పెట్టారు. అదే సమయంలో ఫైర్ హెడ్ కానిస్టేబుల్ రంగారావు పడిపోయిన వృద్ధుని గమనించి ఆక్సిజన్ అందటం లేదని గ్రహించి వెంటనే తన శిక్షణలో ఇచ్చిన సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు. అనంతరం 108 కు సమాచారం అందించాడు. 108 సిబ్బంది స్పందించి సకాలంలో ఘటన ప్రదేశానికి చేరుకున్నారు. 108ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఈదా సుందర్ సింగ్, పైలెట్ నేతల శ్యామ్ కుమార్ ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వ్యక్తికి వైద్య పరీక్షలు సకాలంలో అందించి సమీపంలో ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో తరలించారు. సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఫైర్ కానిస్టేబుల్ ఎం రంగారావును, 108 సిబ్బందిని స్థానికులు,పలువురుఅభినందించారు, శుక్రవారం సాయంత్రం కలిదిండిలో జనసేన పార్టీ కార్యాలయం ఆవరణలో 108 సిబ్బందికి, ఫైర్ హెడ్ కానిస్టేబుల్ ఎం రంగారావుకు అభినందన సభ ఏర్పాటు చేసి ప్రశ్నాపత్రం, ఫీల్డ్ లు అందజేశారు. రంగారావు విధి నిర్వహణలో విశాఖపట్నంలో ఉండటంతో ఈ అభినందన సభకు హాజరు కాలేకపోయారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం రంగారావు ఫోన్లో సంప్రదించగా ఆ వ్యక్తికి ఆక్సిజన్ అందటం లేదని గ్రహించి వెంటనే సిపిఆర్ చేసినట్లు ఆయన తెలిపారు. సిపిఆర్ శిక్షణ తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

## కార్పొరేట్‌కు దీటుగా
# ముసునూరు గురుకులం

### అత్యుత్తమ బోధనతో రాష్ట్రస్థాయి గుర్తింపు

**నూజివీడు,(ముసునూరు) ఆగస్టు25 (ఆంధ్రపత్రిక):** కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ముసునూరు గురుకుల బాలికల పాఠశాల అత్యుత్తమ విద్యాబోధనతో కొనసాగుతుంది. ఏపీ ఆర్ సొసైటీలో ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా విద్యార్థినీలకు 5 వ తరగతిలో ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశం కల్పించబడుతుంది. సీ.బీ.ఎస్.ఈ . విధానంలో బోధన కొనసాగుతుంది. పాఠశాల ప్రధానాచార్యులు కొండా బత్తుల ప్రవీణ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యతోపాటు మంచి క్రమశిక్షణ రాష్ట్ర , జాతీయస్థాయి క్రీడా పోటీలలో కూడా విద్యార్థినీలను తీర్చిదిద్దడం జరుగుతుంది. జిల్లాలో సాంఘిక సంక్షేమ, గిరిజన, కస్తూరిబా, మహాత్మ జ్యోతిరావు పూలే, ఎన్ని గురుకుల పాఠశాలలు ఉన్నప్పటికీ అందరూ ముసునూరు గురుకుల పాఠశాలలోనే సీటు కావాలంటారు. తొలి ప్రాధాన్యత ముసునూరు నే కోరుకోవడం , తమ పిల్లలు ముసునూరులోనే చదువుకోవాలని జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులు కలలు కంటారు. ముసునూరు అంటే తల్లిదండ్రులకు అంత క్రేజ్,



జిల్లాలో నాగాయాలంక మండలం నుంచి పశ్చిమ కృష్ణ నందిగామ జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల వారు కూడా ముసునూరులోనే అడ్మిషన్ పొందుతారు. దీనికి కారణం రాష్ట్ర వ్యాప్తంగా ముసునూరు గురుకుల పాఠశాలకు మంచి గుర్తింపు రావడం, గతంలో ఇక్కడ విద్యాభ్యాసం చేసిన ఎందరో విద్యార్థినీలు అమెరికా ,జర్మనీ , ఇంగ్లాండ్ పలు దేశాలలో వైద్యులు, ఇంజనీర్లు గా స్థిరపడ్డారు. నేటి ఆధునిక కాలంలో విద్య అనేది కార్పొరేట్ విద్యా సంస్థలలో రూ. లక్షల్లో డొనేషన్లు చెల్లించి చదువుకొనే పరిస్థితులు నెలకొన్నాయి.లక్షల్లో ఫీజులు చెల్లించలేని పేద కుటుంబాల విద్యార్థులకు ఈ గురుకుల పాఠశాల ఒక వరం. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించబడుతుంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించబడుతుంది. చైతన్య ,నారాయణ వంటి కార్పొరేట్ సంస్థల కంటే భోజనం రుచికరంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ పాఠశాల ప్రాంగణం చుట్టూ పచ్చని పంట పొలాలు మంచి వాతావరణం ఉండటంతో విద్యార్థినీలకు ఆరోగ్యపరంగా కూడా అనుకూలంగా ఉంది. ఇక్కడ బోధించే ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు కూడా అంకితభావంతో విధులు నిర్వహిస్తారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రిన్సిపల్ ప్రవీణ విద్యార్థినిల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ప్రతి ఏడాది15 మందికి పైగా విద్యార్థినీలు ట్రిబుల్ ఐటీ లో సీట్లు పొందుతున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అభినందిస్తున్నారు.

# లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన గూడూరు ఎంపీపీ



**గూడూరు ఆగస్ట్ 25 (ఆంధ్రపత్రిక) ;** గూడూరు మండల వెలుగు కార్యాలయము నందు నిర్వహించబడిన " లక్ పతి దీదీ " కార్యాక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసి మోదీ లైవ్ ప్రోగ్రామ్ ను వీక్షించి " లక్ పతి దీదీ కార్యక్రమ ఉద్దేశాన్ని సమావేశానికి వచ్చిన మహిళలకు వివరించి గూడూరు మండలంలోని ఎనిమిది గ్రామైఖ్య సంఘాలకు గాను సి ఐ ఎఫ్ ద్వారా పద్దెనిమిది లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన గూడూరు మండల పరిషత్ అధ్యక్షులు సంగ మధుసూదానరావు . సదరు కార్యక్రమంలో మండల సమైఖ్య అధ్యక్షురాలు బి . కళ్యాణి , సీసీ లు ఆరేపు. శ్రీను ,పి . సంతోష రేఖ మరియు మండల సమైఖ్య సిబ్బంది, వెలుగు మిత్రలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మండే సుబ్రహ్మణ్యంకు సాహితీ సత్కారం



**పొన్నూరు ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) :** గిడుగు రామ్మూర్తి పంతులు గ జయంతి పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం వేడుకలు ఫిరంగిపురంలోని వేణుగోపాలస్వామి దేవస్థాన మండపం నందు ఆదివారం ఘనంగా జరిగాయి. కొండవీడు రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి శతాధిక కవి సమ్మేళనంలో బోడపాడు కు చెందిన మండే సుబ్రహ్మణ్యం పాల్గొని లెస్స భాష విశ్వతార అనే కవిత శీర్షికతో తెలుగు భాషా కీర్తిని చాటారు . కోరసం అధ్యక్షుడు సయ్యద్ మొహమ్మద్ రఫీ విశిష్ట అధ్యక్షులు ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకట స్వామి గుర్రం జాషువా పరిషత్ అధ్యక్షులు యోహాను చేతుల మీదుగా జ్ఞాపిక ప్రశంసా పత్రంతో ఘన సాహితి సత్కారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఆయన్ను సత్కరించారు.

# సంతమాగులూరులో లక్‌పతి దిది వీక్షణ కార్యక్రమం




**సంతమాగులూరు, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) ;** మండల కేంద్రం లో ఉన్న వెలుగు ఆఫీస్ నందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్వహించిన లఖ్ పతి దీదీ వీక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం మస్తాన్ రావు మాట్లాడుతూ డ్వాక్రా మహి ళలను లక్షాధికారు లను చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం డ్వాక్రా మహిళలను స్వయం ఉపాధి కల్పించడానికి నిర్దేశించినది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులని ఎలా ఎంపిక చేయాలి, విధి విధానాల గురించి యానిమేటర్లకు వివరించి ఈ పథకం ద్వారా ఎంపికైన మహిళలకు బ్యాంకు నుంచి రుణాలు మంజూరు చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమానికి సంతమాలురు ఎంపీపీ ఏనుబర్ల ఎలమంద, సీసీలు, యానిమేటర్లు మరియు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# విజయవాడలో 'మంకీ పాక్స్' కలకలం



**కొరిశపాడు ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక) ;** విజయవాడలో 'మంకీ పాక్స్' కలకలం విజయవాడలో మంకీ పాక్స్ కలకలం రేగింది. ఓ చిన్నారికి వ్యాధి లక్షణాలు ఉన్నట్లుగా అధికారులు అనుమానిస్తున్నా రు. దుబాయి నుంచి వచ్చిన కుటుంబం లోని చిన్నారి శరీరంపై దద్దుర్లు రావడంతో మంకీ పాక్స్ కేసుగా వైద్యులు భావిస్తున్నారు. విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలో చిన్నారికి చికిత్స చేస్తున్నారు. కుటుంబం మొత్తాన్ని అధికారులు ఐసోలేషన్‌లో ఉంచారు. చిన్నారి నమూనాలను సేకరించి పుణె ల్యాబ్‌కు పంపించారు.

# మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం



**అద్దంకి ఆగస్టు 25(ఆంధ్రపత్రిక) :** ఆదివారం స్థానిక వెలుగు కార్యాలయం నందు జరిగిన లక్ పతి దిదీ సమ్మేళన్ ప్రధానమంత్రి లైవ్ ప్రోగ్రాంలో ఉద్దేశించి వెలుగు ఏపిఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ మహిళా సాధికారతకు సాధిం చడమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ద్వేయం అన్నారు మహిళలను లక్ష అధికారులు చేయడానికి కావలసిన అవకాశాలను తెలియజేస్తూ సుస్థిరమైన జీవనోపాధి కొరకు అవసరమైన ఆర్థిక తోడ్పాటు రుణాల రూపంలో అందించడం జరుగుతుందని దీనికి సంబంధించి కుటుంబ ఆదాయము సంవత్సరానికి లక్ష రూపాయలు లోపు ఉన్న వారిని గుర్తించి వారికి ఆర్థిక తోడ్పాటు సాంకేతిక సహకారం శిక్షణ నైపుణ్యం అందించి వారికి లక్షల పైగా ఆదాయం వచ్చేలా చేయాలని ప్రధానమంత్రి లైవ్ ప్రోగ్రాం నందు వివరించారు అన్నారు డ్వాక్రా సంఘాల బలోపేతం కోసం ఉత్తమ ప్రతిభ కనపరిచిన వి ఓ ఏ మద్దు కుమారి కొప్పుల ప్రమీల పాశం అనురాధ చెన్నుపాటి ధనలక్ష్మి లను సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో వెలుగు కార్యాలయ సిబ్బంది సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

# వేడుకగా విజ్ఞాన్స్ వర్సిటీ 12వ స్నాతకోత్సవం

## 1539 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం...60 మంది విద్యార్థులకు బంగారు పతకాలు

## ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్‌లు




చిరస్మరణీయ వేదిక : హైదరాబాద్‌లోని లోకేష్ మెషీన్స్ ఫౌండర్ ముల్లపూడి లోకేశ్వర రావు

**గుంటూరు : ఆగస్ట్ 25 (ఆంధ్రపత్రిక) ;** ప్రపంచం విభిన్న నైపుణ్యాలు కలిగిన విద్యార్థుల కోసం ఎదురుచూస్తోందని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 12వ స్నాతకోత్సవాన్ని శనివారం వర్సిటీ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ల విజయాన్ని జరుపుకోవడానికి విజ్ఞాన్స్ యూనివర్సిటీకు రావడం చాలా గర్వంగా మరియు ఆనందంగా ఉందన్నారు. మీరు డిగ్రీ పట్టాలతో అకాడెమియా సరిహద్దులను దాటి అడుగు పెట్టినప్పుడు వాస్తవ ప్రపంచం కొత్త సవాళ్లను అందిస్తుందని, అవి మీ విద్య యొక్క సామర్థ్యాన్ని పరీక్షించే క్షణాలుగా మిగులుతాయన్నారు. అదే విధంగా మీకు మద్దతునిచ్చిన మీ కుటుంబం, మీ మార్గదర్శకులు మరియు మీ తోటివారికి మీ కృతజ్ఞతలు తెలియజేయాలన్నారు. ఇంజనీర్ అవ్వడం అంటే చిన్న విషయం కాదన్నారు. మీరు ఎప్పుడు యథాతథ స్థితిని ప్రశ్నించడం నేర్చుకోవాలన్నారు. మన జీవితంలోని ప్రతి అంశం లోతైన విప్లవానికి లోనవుతోందన్నారు. ప్రతి మూలలో కొత్త ఆవిష్కరణలు వేళ్లూనుకుంటున్నాయి. మనం ఈ కొత్త ప్రపంచంలోకి అడుగుపెడుతున్నప్పుడు సమాజంలోని వివిధ రంగాలలో సంభవించే విశేషమైన మార్పులను మనం అభినందించాలి. ఉత్సుకత ఎక్కడికి దారితీస్తుందో.. దాన్ని అన్వేషించండి. ఈ అన్వేషణకు భారతదేశం కంటే మెరుగైన ప్రదేశం మరొకటి లేదని పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మిమ్మల్ని మీరు కొత్తగా ఆవిష్కరించు కోవాలన్నారు. కొత్త పద్ధతులను అనుసరించడం వల్ల మరింత సులువుగా లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఎప్పటి మాదిరిగానే మూస ధోరణిలో వెళ్లకుండా మార్పును స్వాగతించాలన్నారు.

**ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు**

12వ స్నాతకోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో కృషి చేసిన హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ఫౌండర్ అండ్ చైర్మన్ దొంతినేని శేషగిరి రావు, హైదరాబాద్‌లోని లోకేష్ మెషీన్స్ ఫౌండర్ ముల్లపూడి లోకేశ్వర రావు, ఇండియన్ కంపోజర్ అండ్ సింగర్ సాలూరి కోటేశ్వర రావు (కోటి) లకు విజ్ఞాన్స్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేసింది. విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ 12వ స్నాతకోత్సవం సందర్భంగా మొత్తం 1539 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసారు. వీటితోపాటు 60 అకడమిక్ గోల్డ్ మెడల్స్–26, బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ అవార్డులు–24, బంగారు పతకాలనుఅందజేసారు.

విద్యార్థుల మేధోపరమైన, విద్యాపరమైన అన్వేషణను వారి వృత్తిపరమైన విజయాలను కుటుంబం, స్నేహితులు, శ్రేయోభిలాషులతో జరుపుకోవడానికి ఇది ఒక చిరస్మరణీయ వేదికని హైదరాబాద్‌లోని లోకేష్ మెషీన్స్ ఫౌండర్ ముల్లపూడి లోకేశ్వర రావు అన్నారు. విశ్వవిద్యాలయ స్థాయిలో మీరు నేర్చుకున్న విద్యను నీతి సూత్రాలకు అనుగుణంగాను, వృత్తిపరమైన జ్ఞానం నిరంతర సమాజ అభివృద్ధిని జీవితకాల బాధ్యతగా విద్యార్థులు తీసుకోవాలన్నారు.

**ఎదిగిన మార్గాన్ని మర్చిపోవద్దు : విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య**

మనం ఎప్పుడు కూడా ఇక్కడి వరకు ఎలా ఎదిగామన్న మార్గాన్ని మరిచిపోకూడదని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు మన మార్గం ప్రతిబింబించేలా ఉండాలన్నారు. ప్రస్తుతం మనం కొత్త శకం ప్రవేశంలో ఉన్నామని, ఏఐ ( ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మనం పని చేసే విధానం నుండి ఇతరులతో మనం కనెక్ట్ అయ్యే విధానం వరకు మన జీవితంలోని ప్రతి కోణాన్ని విస్తరిస్తుందని పేర్కొన్నారు. ఏఐ అద్భుతమైన అవకాశాలను సృష్టించడంతో పాటు సవాళ్లను కూడా తీసుకువస్తుందన్నారు. ఏఐ పెరుగుదల వలన ఉద్యోగాలు కోల్పోవడం, సైబర్ సెక్యూరిటీ బెదిరింపులు, భద్రతా సమస్యలు పెరుగుతాయన్నారు. మనం పాటించే విలువలు, సంప్రదాయాలు, ధరించే వస్త్రధారణలు భవిష్యత్ వారసత్వానికి చిహ్నాలని తెలియజేసారు. మీరు మీ ప్రయాణాన్ని ప్రారంభించినప్పుడు.. మీ స్వంత రంగాలలో నాయకులుగా ఎదగాలని కోరుకుంటున్నారు. కేవలం మీ విభాగాల్లో నిపుణులుగా అవ్వడం మాత్రమే కాకుండా సామాజిక సమస్యలపై అవగాహన, అందరి పరిస్థితులను మెరుగుపరిచే అంకితభావం, పేదరికాన్ని నిర్మూలించడం, అక్షరాస్యతను ప్రోత్సహించడం, ఇతర సామాజిక సవాళ్లను పరిష్కరించడం వంటివి చేయాలని పిలుపునిచ్చారు. చివరగా, మీరందరూ విజ్ఞాన్స్ యూనివర్సిటీలో నేర్చుకున్న విలువలను ముందుకు తీసుకెళ్లాలని విద్యార్థులను కోరారు. స్థిరమైన లక్ష్యాల నిర్మాణానికి కృషి చేసి మీకు ఎంతో అందించిన సమాజం కోసం మీ వంతు కృషి చేయండన్నారు.

**ప్రపంచంపై మీ ముద్రను వేయండి : విజ్ఞాన్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు**

నేడు పట్టభద్రులవుతున్న మీరందరూ ప్రపంచంపై మీ ముద్ర వేయడానికి ప్రయత్నించండని విజ్ఞాన్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు పిలుపునిచ్చారు. నేటి స్నాతకోత్సవానికి అతిథులుగా హాజరైన వారందరూ ఒక వ్యక్తి తన జీవిత కాలంలో ఏమి సాధించగలడు అనేదానికి ఉదాహరణలుగా తీసుకోవచ్చన్నారు. జస్టిస్ నరసింహ మరియు వినేష్ ఫోగట్ యొక్క కథలను మనం ప్రతిబింబించాలని, వారి ప్రయాణాలను మనం ముందుకు తీసుకురావడానికి ప్రేరణగా ఉపయోగించుకోవాలన్నారు. మీరు నేటి నుంచి సరికొత్త ప్రపంచంలోకి అడుగు పెడుతున్నారని, మీరు సమాజ అభివృద్ధికి ఎలా దోహదపడతారో నిరంతరం ఆలోచించాలన్నారు. కలలను సాకారం చేసుకునేందుకు అవిశ్రాంతంగా కృషి చేయాలన్నారు. తోటి విద్యార్థులతో పోటీపడుతూ డిగ్రీ అభ్యసనాన్ని పూర్తిచేసిన మీరు సమాజానికి సహకార మందించి మీ ప్రయాణంలో సమృద్ధిగా విజయం సాధిస్తారనే నమ్మకం ఉందన్నారు. నేటి యువతే రేపటి దేశం. యువతకు మించిన గొప్ప శక్తిలేదు. యువత సంకల్పం అన్నింటి కన్నా బలమైనదని చెప్పారు. యువత సరైన దిశలో గమ్యం వైపు పయనిస్తే బలమైన భారత్‌గా ఎదుగుతుందన్నారు.

**అంబరాన్నింటిన సంబరం**

డిగ్రీలు చేతబట్టుకున్న వేళ విద్యార్థుల సంబరం అంబరాన్ని అంటింది. కేరింతలతో వర్సిటీ ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. నాలుగేళ్ల తమ అనుభవాలను విద్యార్థులు ఒకరికొకరు పంచుకున్నారు. తరగతి గదుల్లో గడిపిన క్షణాలను నెమరువేసుకున్నారు. విశ్వవిద్యాలయంతో తాము పెంచుకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

సరదగా గడిపిన గడియలను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. గుర్తుగా సెల్ఫీలు దిగారు. దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిన బూనారు. విద్యార్థులంతా తలపాగా, కండువా వేసుకుని అచ్చతెలుగు పెద్ద మనుషుల్లా కనిపించారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబిస్తూనే సాంకేతిక విద్యా సర్టిఫికెట్లను పొందారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, బోర్డు ఆఫ్ మేనేజిమెంట్ సభ్యులు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పేటలో ముత్యాలమ్మకు కరెన్సీ నోట్లతో అలంకరణ



**జగ్గయ్యపేట, ఆగష్టు 25 (ఆంధ్రపత్రిక) :** జగ్గయ్యపేట శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి వీధిలో వెలసిన శ్రావణ మాస 3 వ ఆదివారము రోజున శ్రీ ముత్యాలమ్మ వారు మనకు ధైర్యం ఇచ్చి ధనవంతులను చేసేందుకు సుమారు పది లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించుకొని ఉన్నారు కావున భక్తులు యావన్మంది దేవాలయంకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించి అమ్మవారి కృపా కటాక్షములు పొందగలరు శ్రీ ముత్యాల మ్మ అమ్మవారి దేవస్థానం కమిటీ ప్రెసిడెంట్ అప్పన మణికుమార్ ,వైస్ ప్రెసిడెంట్ నోముల శివకు మార్ ,సెక్రటరీ కొత్త రమేష్ కుమార్ జాయింట్ సెక్రటరీ ,కొంకిమళ్ల సురేష్ ట్రెజరర్, అప్పన వెంకట పిచ్చయ్య మరియు కమిటీ సభ్యులు చేడే వెంకట శ్రీరంగం, దేవరశెట్టి నాగప్రసాద్, ఆరేపల్లి వెంకటేశ్వర్లు

# మున్సిపాలిటీ సహకారంతో దేవాలయ భూమిలో అక్రమ కట్టడాలు

### ముడుపుల మత్తులో ఆలయ ఈవో ఇతనికి సహకరిస్తున్న వేరే టెంపుల్ ఉద్యోగి



**జగ్గయ్యపేట, ఆగష్టు 25 (ఆంధ్రపత్రిక) :** జగ్గయ్యపేట పట్టణం, ధనంబోడు పోయ్యే రోడ్డు, నాగలక్ష్మి అమ్మవారి టెంపుల్ సమీపంలో ప్రభుత్వ దేవాలయ భూమిలో కొందరు అక్రమదారులు యద్దేచ్ఛగా శాశ్విత నిర్మాణాలను చేస్తున్నారని కొందరు ప్రజలు గుసగుసలాడ్డుకుంటున్నారు. ఇట్టువంటి అక్రమ నిర్మాణ కట్టడాలకు జగ్గయ్యపేట మున్సిపల్ శాఖ అధికారులు మున్సిపాలిటీకి కేటాయిం చిన్నట్లు చూపిస్తున్న వాటర్ ట్యాంకర్ తో నీళ్ళను అందిస్తూ అక్రమ కట్టడాలను ప్రోత్సాహిస్తున్నారని పలువురు నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ దేవాలయ భూములను కాపాడాల్సిన ప్రభుత్వ అధికారుల తీరు కంచే చేను మేసినట్లు గా ఉందని స్థానిక ప్రజలు ముక్కు మీద వేళ్ళు వేసుకుంటున్నారు. వెంటనే ప్రభుత్వ దేవాలయ భూమిలో అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న, సహకరిస్తున్న మున్సిపల్ అధికారుల పై చర్యలు తీసుకొని దేవాలయ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలే ఉన్నతాధికారులు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

## ఎమ్మెల్యే శ్రీ రాం తాతయ్య



**జగ్గయ్యపేట, ఆగష్టు 25 (ఆంధ్రపత్రిక) :** కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థిపై అత్యాచారం హత్య ఘటనలో మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని,ఎమ్మెల్యేశ్రీరాం రా జ గో పా ల్ టతాతయ్యఊ డిమాండ్ చేశా రు. అత్యాచార ఘటనను నిరసిస్తూ ఆదివా రం సాయంత్రం జగ్గయ్యపేట పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నందు కోల్ కతా లో మెడికల్ కాలేజ్ జూనియర్ డాక్టర్ వైద్య విద్యార్థి పై జరిగిన ఘటనకు నిరసనగా స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులతో,మరియు మహిళలతో కలిసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేసిన,శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇలాంటి ఘటనలు సిగ్గుచేటన్నారు. ప్రతి ఒక్కరూ స్పందించి దొంగలను కఠినంగా శిక్షించే వరకు నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. పీజీ వైద్యరాలి ఘటనలో అసలైన దొంగలను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక చేయూతనందించిన శ్రీ రామ్ రాజగోపాల్ తాతయ్య



**జగ్గయ్యపేట, ఆగష్టు 25 (ఆంధ్రపత్రిక) :** గౌరవ ప్రధాన మంత్రి సభ్యులను లక్షధికారులను చేయాలనే ఉద్దేశంతో దేశంలోని అన్ని shg సభ్యులకి ఆర్థిక చేయూత అందించేందుకు రాష్ట్రములోని అన్ని జిల్లాలకి 3 కోట్లు చొప్పున అందించటం జరిగినది అందులో భాగంగా మన ఎన్టీఆర్ జిల్లాలో రెండు మండలాలు అయినా జగ్గయ్యపేట మరియు వత్సవాయి వారికి పది లక్షలు చొప్పున అందించటం జరిగినది. అందుకు సంబందించిన చెక్‌లను గౌరవ జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య గారి చేతుల మీదుగా మండల సమాఖ్య అధ్యక్షలు గద్దె రాజ్యలక్ష్మి(జగ్గయ్యపేట) మరియుశిరీష (వత్సవాయి) వారికీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో సభ్యులు పెద్ద ఎత్తున పాలుగోన్నారు.

## శ్రీ భవాని జ్యూయలరీ వర్క్స్ ప్రారంభించిన తాతయ్య



**జగ్గయ్యపేట, ఆగష్టు 25 (ఆంధ్రపత్రిక) :** జగ్గయ్యపేట పట్టణంలోని ముత్యాల రోడ్డు వినాయక గుడి దగ్గర పట్టణానికి చెందిన తేలుకుంట్ల రవికుమార్ నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ భవాని జ్యూయలరీ వర్క్స్ షాప్ ను శనివారం నాడు ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్ టతాతయ్యఊ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం శ్రీ భవాని జ్యూయలరీ వర్క్స్ షాప్ ను సందర్శించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం



**ఆగిరిపల్లి, ఆగష్టు 25 (ఆంధ్రపత్రిక) :** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం (గ్రా) నేతృత్వంలో, విజయవాడ సెంటినీ ఆసుపత్రి వైద్యుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రా జాతీయ చైర్మన్ కాసల కోనయ్య ఉచిత మందుల పంపిణీ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ మెగా వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు కాగిత కృష్ణచంద్, కాగిత రాకేష్ లు గుండె, వెన్నుముక, నరములు, బిపి, షుగర్, ఎముకలు, మోకాళ్ళ నొప్పులు, జీర్ణకోశ వ్యాధులు, మూత్రపిండాలు, మూత్ర కోశ వ్యాధులు, స్త్రీల సంబంధిత సమస్యలు, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు, సాధారణ వ్యాధులను పరీక్షించి, కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రా జాతీయ ప్రధాన కార్యదర్శి పత్తిపాటి సురేష్ కుమార్, మూర్తి, జిల్లా చైర్మన్ నంజం రామకృష్ణ, మోహన్ స్పిన్ జిఎం తాండవ కృష్ణ, ఎండిఓ పి శంకర్రావు, రీజనల్ మీడియా చైర్మెన్ ఎస్ ఎస్ బాబు, గ్రా జిల్లా సలహాదారులు ముసునూరి సతీష్ కుమార్, ఏలూరు జిల్లా వైస్ చైర్మన్ పలగాని వెంకట కోటేశ్వరావు, కుప్పాల నాగరాజు, మొగసాటి శంకర్ రాజు, గునిశెట్టి సత్యనారాయణ, తవ్వ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# లఖ్ పతి దీదీలకు చెక్కులు పంపిణీ చేసిన జాయింట్ కలెక్టర్



**బాపట్ల/కొరిశపాడు ఆగష్టు 25 (ఆంధ్రపత్రిక) ;** బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో మన భారత దేశంలోని పేద మహిళలకు జీవనోపాధి అవకాశాలు కల్పించి వారిని లక్షాధికారులుగా చేయాలని ఉద్దేశంతో ఈరోజు వర్చువల్ ద్వారా గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు తన సందేశాన్ని అందించడం జరిగినది. ఇందులో భాగంగా పొటెన్షియల్ లక్పతి దీదీలను , సీఆర్పీలను గురించి చర్చించడం జరిగింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ మొత్తం లక్పతి దీదీ 100 రోజుల లక్ష్యం 1,22,160 మందిని అలాగే బాపట్ల జిల్లాకు 4628 మందిని టార్గెట్గా ఇవ్వడం జరిగింది. వీరికి వంద రోజుల్లో జీవనోపాధికి కావలసిన నిధులు సిఐఎఫ్/ విఆర్ఎఫ్/ బ్యాంకు లింకేజీ/ఉన్నతి/ స్త్రీనిధి ద్వారా ఏర్పాటు చేసి ఆదాయం పెంచాలని తెలిపారు. అలాగే జిల్లాలోని కలెక్టర్ గారి ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి గారి వర్చువల్ మీటింగ్‌కి జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, ఐఏఎస్ గారు, మరియు డి.ఆర్.ఓ సి.హెచ్. సత్తిబాబు చేతుల మీదుగా లక్పతి దీదీలను, అజీవిక సీఆర్పీలను సన్మానించి సర్టిఫికెట్స్ అందించడం జరిగింది. మరియు బాపట్ల జిల్లాలో ఉన్న 25 మండలాల్లోనీ 305 గ్రూపులలో ఉన్న లిలక్పతి దీదీలి లకు 62,75,00,000 రూపాయల చెక్కును కూడా గౌరవ జాయింట్ కలెక్టర్ గారు, మరియు డి.ఆర్. ఓ గార్ల ద్వారా జిల్లా సమాఖ్య పదాధికారులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పథక సంచాలకులు వై.పిచ్చి రెడ్డి, బాపట్ల జిల్లా సమైక్య పదాధికారులు శ్రీమతి బి. ద్రాక్షావలి, శ్రీమతి ఎన్. స్వర్ణకుమారి, సిహెచ్. ధనలక్ష్మిలు, లక్పతి దీదీ లు, సీఆర్పీలు, డిపిఎంయు సిబ్బంది, బాపట్ల మండలం ఏపీఎం, సీసీలు మరియు అకౌంటెంట్ పాల్గొన్నారు. సర్టిఫికెట్స్ తీసుకున్న వారు ఎన్.జాన్ బి, పి.దీనమ్మ, జె.ఆనంద్ కుమారి, ఎస్కే.ఖైతున్, పి.పద్మావతి , కె.స్వప్న, డి నాగమణి, కె.పోలేరమ్మ లు తీసుకున్నారు.

# ఉండవల్లి రా వాటర్ ప్లాంట్ 24 గంటలు రన్నింగ్ లోనే ఉండాలి

## గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏయస్



**గుంటూరు : ఆగస్ట్ 25 (ఆంధ్రపత్రిక) :** గుంటూరు నగర ప్రజలకు త్రాగునీరు అందించే ఉండవల్లి రా వాటర్ ప్లాంట్ 24 గంటలు రన్నింగ్ లోనే ఉండాలని, అందుకు తగిన విధంగా మోటార్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏయస్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కమిషనర్ ఉండవల్లిలోని ముడినీటి సరఫరా ప్లాంట్, రిజర్వాయర్లను పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ప్లాంట్ లోని మోటార్ల సామర్ధ్యం, గుంటూరు నగరానికి ప్రతి రోజు పంపింగ్ చేస్తున్న నీటి వివరాలు, ప్రకాశం బ్యారేజ్ లోని నీటి లెవల్స్, విధుల్లో ఉన్న సిబ్బంది తదితర అంశాలు అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ గుంటూరు నగరానికి త్రాగునీరు అందించే కీలకమైన ఉండవల్లి పంపింగ్ కేంద్రం పనితీరు మెరుగ్గా ఉండాలన్నారు. పంపింగ్ కేంద్రం 24 గంటలు పని చేయాలని, ఉన్న మోటర్లకు అదనంగా మరో మోటర్ ని స్టాండ్ బై గా ఉంచాలన్నారు. సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, బ్యారేజిలో నీటి నిల్వ వివరాలను ఎప్పటికప్పుడు తమకు తెలియచేయాలన్నారు. ప్లాంట్ పరిసరాల్లో సిసి కెమెరాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. ప్లాంట్ ప్రాంతానికి చుట్టూ కాంపౌండ్ నిర్మాణం చేయాలని ఎస్ఈని ఆదేశించారు. పర్యటనలో ఎస్.ఈ శ్యాం సుందర్, ఈఈ శ్రీనివాస్, డిఈఈ శ్రీధర్, గుంటూరు నగర రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## రక్తదానంతో ఎంతోమంది

# ప్రాణాలు కాపాడవచ్చు

### తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్



**గుంటూరు, ఆగస్ట్ 25 (ఆంధ్రపత్రిక) ;** అవసరమైన రోగులకు రక్తం అందించగలిగితే ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చు అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం లాలాపేట్ లోని గర్ల్స్ హై స్కూల్లో డాక్టర్ బి రవి కుమార్ స్ఫూర్తితో బాలాజీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని రత్నాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని ఆపదలో ఉన్న వాడిని ఆదుకొని రక్తదానం చేసి వారి కాప్రాణాలను కాపాడాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ప్రజలను చైతన్యవంతం చేసి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు వచ్చే విధంగా ప్రజలను చైతన్యవంతం చేసే బాధ్యత యువత తీసుకోవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ రవి కుమార్ స్ఫూర్తితో ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రవి హెల్పింగ్ హాండ్స్ ట్రస్టు సభ్యులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరెన్నో గొప్ప కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖరే, ప్రభాకర్, మనోజ్, శ్రీనివాస్, నూరుద్దీన్, వార్డ్ అధ్యక్షులు సలీం,హాఫీజ్, తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కీ.శే చుండూరు వెంకటరత్నం నాగమ్మల వారసుల సేవలు అభినందనీయం

### తూర్పు శాసనసభ్యులు షేక్ నజీర్ అహ్మద్



**గుంటూరు : ఆగస్ట్ 25 (ఆంధ్రపత్రిక) ;** దశాబ్దాల క్రితం తమ తల్లిదండ్రులు ప్రభుత్వ ఆసుపత్రి రోగుల కోసం సత్రాన్ని అందించారని వారి వారసులు, వారి వారసత్వాన్ని కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని గుంటూరు తూర్పు శాసనసభ్యులు నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. స్థానిక సాంబశివపేట ఒకటో లైన్ చుండూరు వెంకటరత్నం నాగమ్మ నాగరత్నం నాగమ్మ సత్రం లో ట్రస్టీ ల ఆధ్వర్యంలో చుండూరు సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు స్కాలర్షిప్లు మహిళలకు చీరలు వృద్ధులకు దుప్పట్లో పేదలకు అన్నదానం పెద్ద ఎత్తున నిర్వహించారు. మనుమడు చుండూరు దామోదర్ రావు మాట్లాడుతూ తమ తాతయ్య నాయనమ్మలు తొలినాళలో చలివేంద్రాలు నిర్వహించి తదనంతరం 1965లో సత్రాన్ని నిర్మించి వందలాది మందికి ఆశ్రయం కల్పించారని వివరించారు. కార్యక్రమంలో ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు జుజ్జూరు శేష ప్రభాకరరావు, కార్యదర్శి రంగా రామకృష్ణ, ఆలమూరు విజయలక్ష్మి, కొనగళ్ళ సత్యం, కోట శేషగిరి, ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ మల్లేశ్వరరావు, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి అనుపమ ఈవోలు ఎం వి ఎస్ వర్మ, మానుకొండ విజయ తదితరులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట సత్యమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో గ్రామోత్సవం



**జగ్గయ్యపేట, ఆగష్టు 25 (ఆంధ్రపత్రిక) :** పేటకాలనీలో వేంచేసియున్న శ్రీ సత్యమ్మ అమ్మవారు దేవాలయం నకు ఆదివారం ఆర్టీసీ కాలనీ కి చెందిన ముద్ర శ్రీ హరి, దివ్యశ్రీ దంపతులు మరియు శ్రీ హరి తల్లిదండ్రులు ముద్ర ఆదినారాయణ, సంధ్య దంపతులు లక్ష రూపాయల విలువైన పంచలోహ సత్యమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించి ఆలయం అర్చకులు మార్తి సాంబశివశాస్త్రీ , రాధాకృష్ణ శర్మకు అందజేశారు

# నిండుకుండలా నాగార్జున సాగర్ జలాశయం

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు ప్రస్తుత, పూర్తి నిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలుగా నమోదైంది. మరోవైపు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 91,202 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 1083 అడుగులుగా నమోదైంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 53,620 టీఎంసీలుగా ఉంది.

# విద్యార్థులకు శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

హాలిడే ఇస్తున్నట్టు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్,తెలంగాణలు ప్రభుత్వాలు ప్రకటించాయి.అన్ని రకాల విద్యా సంస్థ లతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు పని చేయవు. ఏపీలో రేపు పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం సైతం రద్దు చేస్తున్నట్టు కలెక్టర్లు ప్రకటించారు.ఆగస్టు 26న ప్రభుత్వం సార్వత్రిక సెలవు ప్రకటించిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని పాఠశాలలకు నేడు సెలవు ప్రకటించారు. తెలం గాణ క్యాలెండర్ ప్రకారం శ్రీకృష్ణ అష్టమికి (శ్రీవైష్ణవ ఆగమం ప్రకారం) సెలవు ప్రకటించారు. ఇది ఈ నెలలో రెండవ సాధారణ సెలవుదినం. గతంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న సెలవు ప్రకటించారు. ఇటీవల కొన్ని పాఠశాలలు రక్షా బంధన్‌కు సెలవు ప్రకటించాయి. నగరంలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా మరో సెలవు ప్రకటించారు.వచ్చే నెలలో, రెండు సాధారణ సెలవులు కూడా షెడ్యూల్ చేయబడ్డాయి. ఒకటి వినాయక చవి తికి, మరొకటి ఈద్ మిలాద్-ఉన్-నబీకి. వినాయక చవితి సెప్టెంబర్ 7న, మిలాద్-ఉన్-నబీ సెప్టెంబరు 16న జరిగే అవకాశం ఉంది. మిలాద్-ఉన్-నబి తేదీని నిర్ధారించలేదు, ఎందుకంటే ఇది నెలవంక దర్శనంపై ఆధారపడి ఉంటుంది. ఇదిలా ఉంటే.. అష్టమి గడియలు ఆగస్టు 26, 27 తేదీల్లో ఉండటంతో శ్రీకృష్ణాష్టమి ఎప్పుడు జరుపుకోవాలనే చర్చ మొదలైంది. రేపు ఉదయం 8.40 గంటల తర్వాత ఘడి యలు ప్రారంభమై ఎల్లుండి ఉదయం 6.49 వరకు ఉన్నాయి. సూర్యోదయానికి తిథి ఉండటంతో ఆగస్టు 26నే పండుగ జరుపుకోవాలని పండితులు నిర్ణయించారు. మర్నాడు సూర్యోదయం అయిన వెంటనే నవమి వస్తుండటంతో సోమవారమే చేసుకో వాలని సూచించారు. శ్రావణమాసంలో అమావాస్య ముందువచ్చే అష్టమి రోజున చిన్ని కృష్ణుడు జన్మించాడు.

# కులగణకు బిఎస్‌పి ఎప్పుడూ అనుకూలమే..

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు."బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంది. అప్పుడు కులగణన ఎందుకు చేపట్టలేదు? ఇప్పుడు కులగణన ప్రస్తావన చేస్తున్నారు. దీనికి మీ జవాబు ఏమిటి?. కులగణకు బీఎస్‌పీ ఎప్పుడూ అనుకూలమే. బలహీన వర్గాల ప్రయోజనాల రీత్యా కులగణన బీఎస్‌పీకి చాలా కీలకాంశం" అని మాయావతి వరుస ట్వీట్లలో స్పష్టం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అనుసరించే వారు కాంగ్రెస్‌ను ఎప్పటికీ గౌరవించరని, అంబేద్కర్ బతికి ఉన్నప్పుడు, మరణాంతరం కూడా ఆయనకు భారతరత్న ఇవ్వలేకపోయారని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు.విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీది రిజర్వేషన్ వ్యతిరేక ఆలోచన అని తప్పుపట్టారు. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ రెండూ కూడా రిజర్వేషన్లకు వ్యతిరేకమని, భారత్ బంద్‌కు వారు మద్దతివ్వకపోవడమే ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తుందని అన్నారు. సుప్రీంకోర్టు నిర్ణయానికి వారు వ్యతిరేకమా అను కూలమా అనేది స్పష్టంగా చెప్పడం లేదని, ఎందుకు ఇంత అయోమయంలో ఉన్నారని నిలదీశారు. అనివార్యత కారణంగానే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌కు మద్దతుగా ఎస్పీ, కాంగ్రెస్ మాట్లాడుతున్నాయని, ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాత్రం నోరు మెదపడటం లేదని అన్నారు. షెడ్యూల్ కులాల సబ్ క్లాసిఫికేషన్‌పై సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా పలు దళిత, గిరిజన సంస్థలు ఆగస్టు 21న ఒకరోజు భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన విషయం విదితమే.

# బిహార్ అసెంబ్లీ ఎన్నికలు..

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున పార్టీని ప్రారంభించబోతున్నట్లు ఇటీవల ప్రశాంత్ కిశోర్ చెప్పిన సంగతి తెలిసిందే.ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మొత్తం అన్ని స్థానాల్లోనూ 'జన్ సురాజ్' అభ్యర్థుల్ని బరిలో దించుతాం. వారిలో కనీసం 40 మంది మహిళా అభ్యర్థులు ఉంటారని చెప్పారు. ఆ తర్వాత 2030 ఎన్నికల్లో కనీసం 70 నుంచి 80 మంది అభ్యర్థుల్ని బరిలో నిలుపుతామన్నారు. " మహిళలు ఆర్థికంగా స్వతంత్రులైనంత వరకు సమానత్వాన్ని పొందలేరు. మహిళలకు ప్రభుత్వ పూచీకత్తుతో రుణాలు ఇప్పించాలి. తద్వారా వారి జీవనోపాధికి బాటలు వేయాలి. జన సురాజ్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ఇక్కడి ప్రజలు బతుకుతెరువు కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లబోరని హామీ ఇస్తున్నా" అని అన్నారు. నేతలు, వారి వారసులను నమ్ముకొని ఓట్లు వేయొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు.మరోవైపు, స్వతహాగా రాజకీయ వ్యూహకర్త అయిన ప్రశాంత్ కిశోర్.. పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నారు. పార్టీ ఏర్పాటైన తర్వాత 25 మంది సభ్యులతో కేంద్ర కమిటీని ఏర్పాటు చేయనున్నారు. జనరల్ కేటగిరీతోపాటు, ఓబీసీ, ఈబీసీ, ఎస్సీ, మైనార్టీలను ఇందులో భాగస్వాములను చేయనున్నారు. వీళ్లంతా ఏడాది కాలానికి ఓ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. అయితే, ఈ కేంద్ర కమిటీలో తాను సభ్యుడిని కాబోనని, రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర కొనసాగిస్తూ ఉంటానని కిశోర్ వెల్లడించారు.

# రాం విలాస్ చీఫ్‌గా చిరాగ్ ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వంలో కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరియాణా, జమ్మూకశ్మీర్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పైనా ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఝార్ఖండ్‌లో తమ పార్టీ ఎన్డీయే కూటమి భాగస్వామి అయిన భాజపాతో కలిసి గానీ, ఒంటరిగా గానీ బరిలో దిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

# తితిదే కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేయ నున్నట్లు తితిదే తెలి పింది. అప్పటికే తిరుమల, తిరుపతి లో శాశ్వతంగా ఆరు డిస్పెన్సరీలు, ఆరు ప్రథమ చికిత్స కేంద్రాల్లో ఉద్యోగులు, స్థానికుల కు తితిదే వైద్య సేవలు అందిస్తోంది. బ్రహ్మోత్సవాలకు లక్షలాదిగా హాజరయ్యే భక్తుల కోసం అదనంగా తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో రెండు. రాంబగీచ అతిథి గృహాలు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం. శిలా తోరణం, బాట గంగమ్మ ఆలయం, పాపనాశనం, 7వ మైలు వద్ద ఒక్కో ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాట్లు చేయను న్నట్లు తెలిపింది. దీనికోసం తితిదే వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రముఖ డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, మందులు, అత్యాధు నిక వైద్య పరికరాలతో కూడిన అంబులె న్సను సిద్ధం చేస్తున్నారు. అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

# మోదీకి పాకిస్తాన్ ఆహ్వానం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గతేడాది ఈ సమావేశం బిష్కెక్ లో జరగగా.. విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరయ్యారు.ప్రాంతీయ భద్రత, మధ్య ఆసియా దేశాలతో సహకారం వంటి అంశాల పర్యవేక్షణకు ఏర్పాటైందే కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ (సీహెచ్ జీ). రష్యా, చైనా నేతృత్వంలోని సీహెచ్జీలో భారత్, పాక్ సభ్యులుగా ఉన్నాయి. ప్రస్తుతం పాకిస్థాన్ దీనికి అధ్యక్షత వహిస్తోంది. అక్టోబర్ 15-16 తేదీల్లో సీహెచ్ జీ శిఖరాగ్ర సదస్సుకు ఏర్పాట్లు చేస్తోంది. అయితే, ప్రత్యక్షంగా పాల్గొనే వీలు కుదరని నేతల కోసం వర్చువల్ విధానం ఏర్పాటు చేస్తారా లేదా అనేది పాక్ ఇంకా వెల్లడించలేదు.

# కూల్చివేతలు జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. మాదాపూర్‌లో ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేసిన ప్రాంతాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. "పేదలు గజం స్థలం ఆక్రమిస్తేనే నానా రాద్ధాంతం చేస్తారు. నాగార్జున బిగ్ బాస్‌కే బాస్. చెరువుని ఆక్రమించుకుని కబ్జాలు చేశారు. ఆయనేం సత్యహరిశ్చంద్రుడు కాదు. ఎన్ కన్వెన్షన్ మీద రోజుకు రూ.లక్షల ఆదాయం వస్తోంది. చాలా డబ్బులు ఉన్నాయి.. ఆయనకు ఇదంతా లెక్క కాదు. సినిమా డైలాగ్‌లు పనికిరావు. ఒక్కడే కూర్చుని వంద మందిని కొట్టేస్తే కుదరదు. రోజుకు ఎంత సంపాదించాడో కక్కించాలి.మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెరువులో కాలేజీలు కట్టారు. వారంతా కబ్జాకోరులు. ఫిరంగి నాలాను కబ్జా చేశారు. చెరువులు, నాలాలు కబ్జా అయితే ఊర్లు మునిగిపోతాయి. ఆరంభ శూరత్వం కాదు.. ఎక్కడ కబ్జా జరిగినా ఖాళీ చేయించాలి. పెద్దలు కబ్జాలు చేసినా, దొంగపట్టాలు పొందినా వారి ఆస్తులు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. రాజకీయ కక్ష సాధింపు అవసరం లేదు. ఒకే పార్టీ, ఒకే వర్గం మీద కక్ష సాధింపు మంచిది కాదు. ఎవరు ఆక్రమించినా వారిపై హైడ్రా కూల్చివేతలు చేపట్టాలి. ఈ కూల్చివేతలు ఇలాగే కొనసాగాలి. ఎంఐఎం వారివి కూడా తొలగించాలి. అక్రమ నిర్మాణాలకు ఎవరు అనుమతిచ్చారో వారిపై కూడా చర్యలు తీసుకోవాలి. మేం మొదటి నుంచి భూ సమస్యలపై పోరాటం చేస్తూనే ఉన్నాం" అని నారాయణ అన్నారు.

# హెజ్బొల్లా రాకెట్ల వర్షం..

**ఇజ్రాయేల్,ఆగస్టు 25 :** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌లోని హెజ్బొల్లా ఉగ్రవాద స్థావరాలపై ఇజ్రాయేల్ దాడులు చేసింది. తమపై దాడికి కుట్ర చేశారనే అనుమానంతో ఇజ్రాయేల్ ముందస్తు దాడులకు దిగింది.ఆదివారం ఉదయం లెబనాన్‌లోకి దాదాపు 100 యుద్ధ విమానాలు చొచ్చుకెళ్లి.. వేలకొద్దీ రాకెట్లను ధ్వంసం చేశాయి. ఈ మేరకు ఇజ్రాయేల్ ఓ ప్రకటన విడుదల చేసింది. దాడికి ప్రతిదాడి తప్పదని ఆ దేశ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు హెచ్చరించారు. 'అక్టోబర్ 7' నాటి మారణహోమానికి మించి అత్యంత భారీ స్థాయి దాడికి సిద్ధమైన హెజ్‌బొల్లా కుట్రను భగ్నం చేసినట్లు ఆయన తెలిపారు.



# యెమెన్ తీరంలో పడవ బోల్తా.. 13 మంది మృతి

**యెమెన్,ఆగస్టు 25 :** యెమెన్ తీరంలో ఘోర ప్రమాదం జరిగింది. పడవ మునిగిపోవడంతో 13 మంది చనిపోయారు. ఐక్యరాజ్యసమితి మైగ్రేషన్ ఏజెన్సీని ఉటంకిస్తూ నివేదిక ప్రకారం.. పడవ ప్రమాదంలో 14 మంది గల్లంతయ్యారు.వారి కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయి. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. యెమెన్‌లోని తైజ్ ప్రావిన్స్ తీరంలో మంగళవారం వలస పడవ బోల్తా పడింది. ఈ పడవలో తూర్పు ఆఫ్రికా దేశం ఇథియోపియాకు చెందిన 25 మంది పౌరులు ఉన్నారు. ఇద్దరు యెమెన్‌కు చెందినవారు ఉన్నారు. కాగా.. ఈ పడవ తూర్పు ఆఫ్రికా దేశం జిబౌటి నుండి బయలుదేరింది.పడవ ప్రమాదానికి సంబంధించి నివేదిక ప్రకారం.. చనిపోయిన వారిలో 11 మంది మహిళలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు అన్వేషణ కొనసాగిస్తోంది. తప్పిపోయిన వారిలో యెమెన్ కెప్టెన్.. అతని సహాయకుడు కూడా ఉన్నారు. ఓడ బోల్తా పడటానికి గల కారణాలు తెలియరాలేదు. యెమెన్‌లోని మిషన్ యొక్క తాత్కాలిక అధిపతి మాట్లాడుతూ.. ఇది ప్రమాదకరమైనది అయినప్పటికీ, పెద్ద సంఖ్యలో వలసదారులు ఈ సముద్ర మార్గం గుండా ప్రయాణిస్తున్నారని చెప్పారు. జూన్-జూలైలో కూడా పడవ బోల్తా పడిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. 2023లో 97,200 మంది వలసదారులు యెమెన్‌కు వచ్చారు. ఈ



సంఖ్య 2022 కంటే ఎక్కువ. భద్రతను దృష్టిలో ఉంచుకుని అధిక సంఖ్యలో ప్రజలు సముద్ర మార్గంలో ప్రయాణిస్తున్నారు. 10 సంవత్సరాలకు పైగా.. ఈ దేశం పేదరికంతో పాటు అంతర్యుద్ధంతో బాధపడుతోంది. సౌదీ అరేబియా.. ఇతర గల్ఫ్ దేశాలకు కార్మికులుగా, గృహ కార్మికులుగా పనిచేయడానికి ప్రజలు వెళ్తున్నారు.

# మీ అభ్యర్థులను పోటీకి దింపొద్దు..



**శ్రీనగర్,ఆగస్టు 25 :** తమ ఎన్నికల మేనిఫెస్టోకు అంగీకారం తెలిపితే కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ కూటమిపై తమ అభ్యర్థులెవరినీ పోటీకి దింపమని, తాను కూడా పోటీ చేయనని పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ చేసిన ప్రతిపాదనపై నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ఆదివారంనాడు స్పందించారు.రెండు పార్టీల (పీడీపీ, ఎన్‌సీ) ఎజెండాలు ఒకటేనని, కాంగ్రెస్-ఎన్‌సీ అభ్యర్థులపై పీడీపీ తమ అభ్యర్థులను నిలపరాదని సూచించారు."తమ ఎజెండాను అంగీకరిస్తే ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమిపై అభ్యర్థులను నిలపమని పీడీపీ చెబుతోంది. అయితే మా ఎజెండాలోని అన్ని అంశాలను మీరు మీ ఎజెండాలో చేర్చారు. మీరు ఇప్పటికే మా ఎజెండాను అంగీకరించారు. ఇప్పుడు మీ ఎజెండా, మా ఎజెండా మధ్య పెద్ద తేడా ఏమీ లేదు. మీరు మీ అభ్యర్థులను పోటీకి దింపకుంటే సరిపోతుంది. మనం కలిసికట్టుగా రేపటి మెరుగైన జమ్మూకశ్మీర్‌ను నిర్మిద్దాం" అని ఒమర్ పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, ఏడాదిలో లక్ష ప్రభుత్వ ఉద్యోగాల కల్పన అనేవి రెండు మేనిఫెస్టోలలోనూ ఉన్నాయని ఆయన చెప్పారు. రీఓపినింగ్ రూట్స్ (క్రాస్-ఎల్ఓసీ) గురించి నేషనల్ కాన్ఫరెన్స్ ఎజెండాలో చెప్పడం జరిగిందని, చర్చలకు ద్వారాలు తెరిచే ఉంటాయని చెప్పామని, అవే పీడీపీ మేనిఫెస్టోలోనూ చోటుచేసుకున్నాయని అన్నారు. ఎన్‌సీ-కాంగ్రెస్ అభ్యర్థులపై పీడీపీ పోటీకి దిగకుంటే సరిపోతుందని చెప్పారు.

# రాహుల్ జీ..మీ హామీలు ఏమయ్యాయ్?

**కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్**

**న్యూఢిల్లీ,ఆగస్టు 25 :** కేంద్రం అమలు చేసేందుకు సిద్ధమైన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌పై అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్డీయే ప్రభుత్వం..నిర్ణయాలపై యూటర్న్ తీసుకుంటోందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. యూపీఎస్‌లో 'యూ' అంటే 'యూనిఫైడ్' కాదని.. 'యూటర్న్' అని ఎద్దేవా చేశారు. దీనిపై భాజపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందించారు. యూపీఎస్ తీసుకురావడం కాంగ్రెస్ పార్టీకి కంటగింపుగా మారిందని విమర్శించారు. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన పెన్షన్ హామీని ఎప్పుడు నెరవేరుస్తారని ప్రశ్నించారు." కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఒకే ఒక మాట అడగాలనుకుంటున్నా. హిమాచల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో పాత పింఛన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అది ఎప్పుడు నెరవేరుస్తారు" అని రవిశంకర్ ప్రశ్నించారు. ఓపీఎస్ విధానాన్ని అమలు చేస్తామన్న కాంగ్రెస్ హామీ కలగానే మిగిలిపోయిందని, అది ఆచరణ సాధ్యం కాదని గ్రహించే.. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఈ అంశాన్ని చేర్చలేదని అన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను మభ్యపెట్టేందుకు.. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందన్న సంగతిని ప్రజలు గ్రహించారన్నారు. అందుకే తాజా ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు.సుమారు 23 లక్షల మంది



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి చేకూరేలా కేంద్రం యూపీఎస్‌ను అమలు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. కేంద్రం తీసుకొస్తున్న యూపీఎస్ వల్ల 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు వేతనంలో 50 శాతం పెన్షన్ రానుంది. మిగిలిన వారికి సర్వీసును బట్టి పెన్షన్ వర్తిస్తుంది. కనీస పెన్షన్ రావాలంటే 10 ఏళ్ల సర్వీసు పూర్తి చేసి ఉండాలి. 2004 ఏప్రిల్ 1 తర్వాత సర్వీసులో చేరిన ఉద్యోగులకు ప్రస్తుతం ఎన్‌పీఎస్ వర్తిస్తోంది. వీరందరూ యూపీఎస్ పరిధిలోకి రానున్నారు. ఎన్‌పీఎస్ చందాదారులంతా యూపీఎస్‌లోకి మారవచ్చు. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి (2025 ఏప్రిల్ 1 నుంచి) యూపీఎస్ అమల్లోకి వస్తుంది.

# పార్టీని బలోపేతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్రంలోని పార్టీ జిల్లా, మండల కమిటీలు అన్నింటినీ రద్దు చేశారు.తెలంగాణ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడిగా కీలక వ్యక్తికి బాధ్యతలు అప్పగించి కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. ఏపీ, తెలంగాణల్లో ఒకేసారి కొత్త కమిటీలు వేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీలో ఎవరైతే ఎక్కువ సభ్యత్వాలు చేస్తారో వారికే పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు.తనకు రెండు రాష్ట్రాలు రెండు కళ్లలాంటివని.. రెండు ప్రాంతాలను సమాన అభివృద్ధి చేయాలనేదే తన అభిమతమని చంద్రబాబు చెప్పారు. తెలంగాణలో టీడీపీని బలోపేతం చేసేందుకు ఇక నుంచి ప్రతి నెలా రెండు రోజులు రాష్ట్రానికి వస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన తెలుగుదేశం శ్రేణులను గుర్తు చేస్తూ.. తెలంగాణ రాష్ట్రంలో కూడా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీని ప్రజలు తప్పకుండా ఆదరిస్తారని చంద్రబాబు వెల్లడించారు.హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫొటో సెషన్‌లో పాల్గొన్నారు. చంద్రబాబుని సినిమా యాక్టర్, మాజీ ఎమ్మెల్యే బాబూమోహన్ కలిశారు. త్వరలో బాబు మోహన్ టీడీపీలో చేరే అవకాశం ఉంది. చంద్రబాబు నాయుడితో భేటీలో భావోద్వేగానికి గురయ్యారు బాబూమోహన్.కాగా, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో చంద్రబాబు ఫొటోలు దిగారు. భారీ ఎత్తున ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు టీడీపీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. అందరినీ కలవాలన్న ఉద్దేశంతో పార్టీ ఆఫీసుకి వచ్చానని చంద్రబాబు నాయుడు అన్నారు. టీడీపీ ఎన్టీఆర్ పెట్టిన పార్టీ అని, తెలుగువారు ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ ఉంటుందని తెలిపారు.

# టెలిగ్రామ్ సిఈవో అరెస్ట్..

(మొదటిపేజీ తరువాయి)

నుంచి లే బోర్గట్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన్ను కస్టడీలోకి తీసుకున్నారు. టెలిగ్రామ్‌లో మోసం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలు, పిల్లలపై నేరాలు, పెడోఫిలిక్ కంటెంట్, వ్యవస్థీకృత నేరాల్ని ప్రోత్సహించడం వంటి ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. దీంతో గతంలో అరెస్టు వారెంట్ జారీ చేసిన అధికారులు, తాజాగా అదుపులోకి తీసుకున్నారు.అయితే, తనపై అరెస్ట్ వారెంట్ జారీ అయినప్పటి నుంచి దురోవ ఫ్రాన్స్, యూరప్‌లోని దేశాల్లో పర్యటించలేదు. తాజాగా లే బోర్గట్ వచ్చిన పావెల్ దురోవ్‌ను అరెస్ట్ చేసినట్లు మాస్కో టైమ్స్ పేర్కొంది. టెలిగ్రామ్‌యాప్ వ్యవస్థాపకుడు దురోవ్ రష్యాలో జన్మించారు. ప్రస్తుతం ఆయన దుబాయ్‌లో ఉంటున్నారు. యాప్‌నకు సంబంధించి వినియోగదారుల డేటాను రష్యాలో భద్రతా అధికారులతో పంచుకోవడానికి నిరాకరించారు. దీంతో అక్కడి ప్రభుత్వంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత టెలిగ్రామ్‌నూ అడ్డుకునేందుకు రష్యా ప్రభుత్వం విఫలయత్నం చేసింది. దీంతో దురోవ్ 2014లో రష్యాను విడిచిపెట్టారు. 2021 ఆగస్టులో ఫ్రెంచ్ పౌరసత్వ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తనపై అరెస్టు వారెంట్ ఉన్నప్పటికీ, పావెల్ దురోవ్ పారిస్‌కు రావడంపై విచారణ అధికారి ఒకరు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పావెల్‌ను ఆదివారం న్యాయస్థానంలో ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ఇక టెలిగ్రామ్ యాప్‌ను ప్రపంచవ్యాప్తంగా సుమారు 900 మిలియన్ల మంది వినియోగిస్తున్నారు.

## మలయాళ 'చిత్రపరిశ్రమ'లో

# వేధింపులు..

### ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు



**కేరళ,ఆగస్టు 25 :** మలయాళ చిత్రసీమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై తీవ్ర చర్చ నడుస్తోంది. ఈ క్రమంలోనే పలువురు ప్రముఖుల నుంచి ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయంటూ నటీమణులు ఆరోపించడం సంచలనం రేపుతోంది.దీంతో స్పందించిన కేరళ ప్రభుత్వం.. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఏడుగురు పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది.మలయాళీ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సిద్ధిఖీ నుంచి ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదుర్కొన్నానంటూ నటి రేవతి సంపత్ ఆరోపించారు. ఇదే సమయంలో ప్రముఖ దర్శకుడు, కేరళ స్టేట్ చలచిత్ర అకాడమీ అధ్యక్షుడు రంజిత్ బాలకృష్ణన్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని బెంగాలీ నటి శ్రీలేఖ ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీ, రంజిత్‌లు వారి పదవులకు రాజీనామా చేశారు. ఈ పరిణామాలపై స్పందించిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్.. పోలీసు అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. తాజాగా వస్తోన్న ఫిర్యాదులు, ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఐజీ స్పర్జన్ కుమార్ నేతృత్వంలో ఏడుగురు సభ్యు లతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు.

# షేక్ హసీనాపై 53 కేసులు..

**న్యూఢిల్లీ,ఆగస్టు 25 :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఆమెతో పాటు మాజీ మంత్రులు, అనుచరులపై తాజాగా మరో నాలుగు హత్య కేసులు నమోదయ్యాయి.2010లో బంగ్లాదేశ్ రైఫిల్స్ ఉన్నతాధికారి మరణానికి సంబంధించి కేసు నమోదైంది. దీంతో ఇప్పటివరకు హసీనాపై నమోదైన కేసుల సంఖ్య 53కు చేరింది. బంగ్లాదేశ్లో రైఫిల్స్‌ 2010లో డిప్యూటీ అసిస్టెంట్ డైరెక్టర్గా అబ్దుల్ రహీం ఉన్న సమయంలో అక్కడి ఫీలానాలో మారణహోమం సంభవించింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న రహీం..అదే ఏడాది జులై 29న జైల్లో మరణించాడు. దీనిపై రహీం కుమారుడు అబ్దుల్ అజీజ్ తాజాగా దాఖలు చేసిన పిటిషన్నై మాజీ ప్రధాని హసీనాపై అభియోగాలు మోపారు. జులై 18న చెలరేగిన హింసాత్మక ఘటనల్లో మిలటరీ ఇన్స్టిట్యూట్కు చెందిన విద్యార్థి ప్రాణాలు కోల్పోయిన ఘటనలో హసీనాతోపాటు మరో 48 మందిపై హత్యకేసు నమోదైంది. ట్రేడింగ్ కార్పొరేషన్కు చెందిన వ్యక్తితోపాటు ఆటో రిక్షా డ్రైవర్ మరణం కేసుల్లో హసీనాతోపాటు పలువురిపై హత్యకేసు నమోదైంది. మొత్తంగా హసీనా ప్రస్తుతం 53 కేసులు ఎదుర్కొంటున్నారు. వీటిలో 44 హత్య కేసులు, మారణహోమానికి సంబంధించి ఏడు, ఒకటి అపహరణతో పాటు బీఎన్పీ పార్టీ ఊరేగింపు సమయంలో చోటు చేసుకున్న ఘర్షణలో మాజీ ప్రధాని హసీనాపై దాడి కేసు నమోదయ్యింది.

# కఠినమైన శిక్షలు పడాలి

(మొదటిపేజీ తరువాయి)

సంఘాలకు రూ.25,000 కోట్ల కన్నా తక్కువ రుణాలు ఇచ్చారని, అయితే గత పదేళ్లలో తమ ప్రభుత్వం రూ. 9 లక్షల కోట్ల సహాయం అందించిందని అన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మోడీ 2,500 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను విడుదల చేశారు. ఈ నిధులతో 4.3 లక్షల స్వయం సహాయక సంఘాలలోని 48 లక్షల మంది సభ్యులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.లఖ్‌పతి దీదీ పథకం మహిళలకు ఆదాయాన్ని పెంపొందించడమే కాదు, భవిష్యత్ తరాలకు సాధికారత కల్పిస్తోందని అన్నారు. భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని, దానిలో స్త్రీలది పెద్ద పాత్ర అని అన్నారు. రెండేళ్ల క్రితం పరిస్థితి ఈ విధంగా లేదని అన్నారు.

# వైద్యురాలి హత్యాచార ఘటన..

(మొదటిపేజీ తరువాయి)

అతడు కోల్‌కతా జైల్లో ఉండగా అక్కడే లై డిటెక్టర్ పరీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఇదే కేసుకు సంబంధించి మరో ఇద్దరు నిందితులకు సీబీఐ కార్యాలయంలో పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. అయితే, నిందితులు ఏం చెప్పారన్న వివరాలను మాత్రం గోప్యంగా ఉంచారు. మరోవైపు ఈ కేసులో ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్‌ఘోష్, బాధితురాలిపై హత్యాచార ఘటన చోటుచేసుకున్న రోజు డ్యూటీలో ఉన్న మరో నలుగురు వైద్యులు, మరో సివిల్ వాలంటీర్‌కు శనివారం లై డిటెక్టర్ పరీక్షలు నిర్వహించారు. దిల్లీ నుంచి ప్రత్యేకంగా చేరుకున్న సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ బృందం ఈ పరీక్షలు నిర్వహించింది. ఆ వివరాలు కూడా బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

# స్వర్గీయ పెతకంశెట్టి జోగినాయుడు మాష్టారు గ్రంధాలయం 13వ వార్షికోత్సవ వేడుకలు

మునగపాక, ఆగస్టు 25, (ఆంధ్రపత్రిక) స్వర్గీయ పెతకంశెట్టి జోగినాయుడు మాష్టారు గ్రంధాలయం 13వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వాడ్రాపల్లి గ్రామంలో ఘనంగా జరిగాయి. గ్రంధాలయం ఆవరణలో పుస్తక ఆవిష్కరణా కార్యక్రమం జరిగింది. 26, 27, 28 తేదీలలో వ్యాసరచన, డిబేట్ లతో పాటు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించటం జరుగుతుందని తెలియజేసారు. 29వ తేదిన గ్రంథాలయ 13వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు నిర్వహించడం జరుగుతుంది అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ గౌరవాధ్యక్షులు పెతకంశెట్టి రామ జోగినాయుడు, బొడ్డేడ సత్యనారాయణ మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి అన్నపూర్ణ నిలయం భవన నిర్మాణానికి రూ.1,11,116/- విరాళము





**అయినవిల్లి ఆగస్టు 25 (ఆంధ్ర పత్రిక)** రాజమండ్రి వాస్తవ్యులు శ్రీమతి & శ్రీ గణపతినీడి జగదీష్, స్వప్న గారు దంపతులు శ్రీ విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి అన్నపూర్ణ నిలయం భవన నిర్మాణానికి విరాళముగా .1,11,116/–లు ఇచ్చినారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి , శేష వస్త్రముతో సత్కరించి శ్రీ స్వామి వారి చిత్రపటమును అందజేసినారు.

# స్కై దంత వైద్యశాలను ప్రారంభించిన శాసనసభ్యులు







**ఆగిరిపల్లి ఆగస్టు 25 (ఆంధ్ర–పత్రిక)**: విజయవాడ సీతారాంపురం జంక్షన్ ఎస్ బి ఐ బ్యాంకు పక్కన ఎస్ కే వై దంత వైద్యశాలను ను రాష్ట్ర సమాచార గృహ నిర్మాణం శాఖామాచీలు కొలుసు పార్థ సారథి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బోండా ఉమా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ స్కై దంత వైద్యశాలను ప్రారంభించడం చాలా సంతోషదాయకమని, ఈ హాస్పిటల్ యందు ఉన్న అధునాతనమైన, సౌకర్యవంతమైన పరికరాలను ఉపయోగించుకోనవలెనని నియోజకవర్గ, నగర ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఈ వైద్యశాలలో ముఖ్యముగా చిన్నారులకు, పెద్దలకు దంత వైద్య సౌకర్యం ఉందని తెలియజేశారు.

మంత్రి సారథి మాట్లాడుతూ ఈ హాస్పిటల్ లో అధినాతనమైన పరికరాలు ఏర్పాటు చేశారని డాక్టర్ చైతన్య ,శ్వేత ఇరువురు అనుభవం గల డాక్టర్లని భవిష్యత్తులో ఈ హాస్పిటల్ బాగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను నని, రాబోయే 5 సంవత్సరము లలో (అమరావతికి దగ్గరలో ఉండటం వల్ల )విజయవాడ రూపు రేఖలు మారుతున్నాయని,, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైద్య పరంగా అన్ని రకాల మెడికల్ ఫెసిలిటీస్ ని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్నారని తెలుపుతూ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు

# ఫార్మా ప్రమాదలపై సమగ్ర విచారణ జరపాలి

## సిఐటియు డిమాండ్



**అచ్యుతాపురం, ఆగస్టు 25, (ఆంధ్రపత్రిక):** అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా పరిశ్రమలో ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి. క్షతగాత్రులకి మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు డిమాండ్ చేసింది. అచ్యుతాపురం ఎస్సీజెడ్ లోని ఎసెన్షియ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృతి చెందగా, 40 మంది కార్మికులు గాయాల పాలయ్యారన్నారు. పరవాడ ఫార్మా సిటీలో సినర్జిన్ ఫార్మా లో ఒకరు మృతి చెందగా, ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఫార్మాలో కంపెనీలు కార్మికుల ప్రాణాలు కోల్పోయిన వీరికి పట్టడం లేదు. సేఫ్టీకి ప్రాధాన్యత ఇవ్వకుండా లాభాలకే తహతహ లాడుతున్నాయి. ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు డొల్లతనాన్ని ఈ ప్రమాదాలు తెలియజేస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలో ఉండే పరిశ్రమలలోని భద్రతపై ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ గాని, అలాగే యాజమాన్యాలు కానీ సరైన చర్యలు తీసుకోకపోవడంతో పాటు ప్రభుత్వం ఉదాసీనంగా ఉందన్నారు. యాజమాన్యాలకు ఇష్టానుసారంగా రాయితీలు ఇచ్చి పరిశ్రమల ఏర్పాటు చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ కార్మికుల ప్రాణాలు రక్షణ కోసం కానీ, ఉద్యోగ భద్రత భద్రతా ప్రమాణాలు విషయంలో కానీ చూపించడం లేదని అందుకే తరచూ ప్రమాదాలు జరిగి అమాయక కార్మికులు మృత్యువాత పడుతున్నారు. యాజమాన్యం కంపెనీ నిర్మాణమే పరిశ్రమ నడవడానికి అనుకూలంగా లేదని నిపుణులు చెప్పారని అన్నారు. ఈ ప్రమాదం పై సమగ్ర విచారణ జరిపించాలని ప్రమాణాలు పాటించని యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, కోండ్రపు సోమనాయుడు, జి దేవుడు నాయుడు, కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం తీర్పు నిరసిస్తూ

# ఎస్సీ,ఎస్టీ, ఎంపీలు రాజీనామాలు చేయాలి

### ఏపీ దళిత కూలీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలి ఈశ్వరరావు డిమాండ్.



**వేపాడ,ఆగస్టు,25 (ఆంధ్రపత్రిక)**:ఎస్సీ,ఎస్టీల రిజర్వేషన్లు వర్గీకరణ పై భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన రాజ్యాంగ విరుద్ధమైన తీర్పు నిరసిస్తూ కేంద్రం ప్రభుత్వంలోని ఎస్సీ,ఎస్టీ ఎంపీలు రాజీనామాలు చేయాలని ఆంధ్రప్రదేశ్ దళిత కూలీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది గాలి ఈశ్వరరావు డిమాండ్ చేశారు.మండలంలోని అరిగిపాలెం గ్రామంలో గల తన స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని ఎస్సీ,ఎస్టీలను విడదీసి వారి ఐక్యతను, అభివృద్ధిని దెబ్బతీసేందుకు కుట్ర పన్నిన కేంద్రంలోని నరేంద్ర మోడీ,రాష్ట్రంలోని చంద్రబాబు కూటమి ప్రభుత్వం కుయుక్తుల పన్నుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.దళితుల అభివృద్ధిని దెబ్బతీసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు సాగిస్తున్నప్పటికీ ఆయా ప్రభుత్వాల్లో పదవులను అనుభవిస్తున్న దళిత ఎస్సీ,ఎస్టి, ఎంపీలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణం అన్నారు.కేంద్రంలోని బిజెపి ఆంధ్రప్రదేశ్లోని కూటమి ప్రభుత్వాల కుట్రే సుప్రీం తీర్పు అన్నారు.ఎస్సీ,ఎస్టీల ఐక్యతను అభివృద్ధిని సహించలేని నరేంద్ర మోడీ,చంద్రబాబు నాయుడులు రిజర్వేషన్ల వర్గీకరణ పై రాజ్యాంగ విరుద్ధమైన తీర్పును వెలువరింప చేశారని ఆరోపించారు.దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు దాటుతున్న నేటికీ రాజ్యాంగం ద్వారా సంక్రమించే హక్కులు రిజర్వేషన్ల లెక్క ప్రకారం 97% శాతం దళిత,గిరిజనులకు అందడం లేదన్నారు.దేశంలో నేటికీ పేదరికం కొట్టుమిట్టాడుతుందన్నారు.అస్పృశిత,సామాజిక రక్షణ లేని కులాలు,తెగల అభివృద్ధికే రాజ్యాంగంలోని ఆర్టికల్ 341,342 లో కొన్ని హక్కులను చేర్చడం జరిగిందన్నారు.కానీ నేటికీ ఈ జాతులు,తెగలు అభివృద్ధి చెందకపోయినా ఈ జాబితాలోని కులాలను తెగలను విడదీసి విచ్ఛిన్నం చేసి భారత రాజ్యాంగం ద్వార రిజర్వేషన్లను నాశనం చేసి పూర్వీకులు వలె కూలీలుగాను,పాలేరులుగా ఎలా ఉండేవారో అదే విధంగా మార్చి అనగదొక్కాలని కేంద్రంలోని, రాష్ట్రంలోని అగ్రకుల పార్టీలు,ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని గాలి ఈశ్వరరావు ఆరోపించారు.రాజ్యాంగంలో లేని నిబంధనలు, రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా సమర్థతత్వం లేని సమాజాన్ని ఏర్పాటు చేసి వాడుకోవడానికి ఈ వర్గీకరణ చేపట్టిందన్నారు.అలాగే రాజకీయ పదవుల్లో విభజన చేయకుండా విద్య ఉద్యోగ నియామకల్లో రిజర్వేషన్ వర్గీకరణ పాటించమనడం దారుణం అన్నారు.అగ్రకుల పార్టీల ప్రయత్నాలు సాగవు అన్నారు.ఎస్సీ,ఎస్టీలను పూర్తిగా అనగదొక్కాలని చూడడం ఘోరమన్నారు.సామాజిక,ఆర్థిక, రాజకీయ,అభివృద్ధికి నేటికీ ఎస్సీ,ఎస్టీ వర్గాలు దూరంగా ఉన్నాయని,భూములను,దేశ సంపదను జాతీయం చేసిన తరువాతే వర్గీకరణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ విధమైన అనైతికమైన రాజ్యాంగ విరుద్ధమైన తీర్పులను సుప్రీంకోర్టు ఇవ్వడం రాజ్యాంగ హక్కులను హరించడమే అన్నారు.న్యాయస్థానం ఈ తీర్పును తక్షణమే రద్దు చేయడంతో పాటు ఎస్సీ,ఎస్టీల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రిజర్వేషన్లు పక్కాగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని గాలి ఈశ్వరరావు డిమాండ్ చేశారు.కేంద్రంలోని అగ్రకుల బిజెపి ప్రభుత్వం,రాష్ట్రం లోని కూటమి ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.

# కష్టపడే ప్రతి కార్యకర్తకు తెదేపాలో గుర్తింపు: ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

### పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు ప్రత్తిపాటి అభినందనలు



**చిలకలూరిపేట ఆగస్టు – 25 (ఆంధ్రపత్రిక):–** కష్టపడే ప్రతి కార్యకర్తకు తెదేపాలో గుర్తింపు ఉంటుందని మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి అంకితభావంతో పనిచేసిన తెదేపా నాయకులు, కార్యకర్తలను అభినందిస్తూ సీఎం చంద్రబాబు సంతకంతో ప్రశంసా పత్రాలు వచ్చాయి. ఆదివారం తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్తిపాటి పుల్లారావు వారికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. మన టీడీపీ యాప్ ద్వారా పార్టీ కంటెంట్ ను షేర్ చేసి చిలకలూరిపేట నియోజకవర్గంలో టాప్ పెర్ఫార్మర్ గా నిలిచిన 10 మందిని అభినందిస్తూ చంద్రబాబు సంతకంతో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రశంసా పత్రాలు వచ్చాయి. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రత్తిపాటి చిలకలూరిపేట నియోజకవర్గంలో తెదేపాను తిరుగులేని శక్తిగా అభివృద్ధి చేయడంలో కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పనిచేయాలన్నారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రణాళికలను ప్రజలకు చేరువ చేసేందుకు మన టీడీపీ యాప్ ను విస్తృతంగా వినియోగించాలని ప్రత్తిపాటి సూచించారు.

# పరపతి ఉంటేనే పోస్టు మార్టమ్

### గ్రానైట్ వ్యాపారి దేవేందర్ సింగ్ మృత దేహం పోస్టు మార్టమ్ విషయంలో మీన మేషాలు-

**స్పందించిన బిజేపి శాఖ - ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్, రాజస్థాన్ డిప్యూటీ సీఎం, ఒంగోలు ఎమ్మెల్యే జనార్ధన్ చొరవతో కదిలిన యంత్రాగం ఎట్టకేలకు పోస్టు మార్టమ్**



**ఒంగోలు, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక)** పరపతి ఉంటేనే పోస్టు మార్టమ్ కూడ పూర్తి అవుతుందని ఒంగోలు రిమ్స్ లో ఆదివారం జరిగిన సంఘటన రుజువు చేసింది. చీమకుర్తిలో రాజస్థాన్ కు చెందిన గ్రానైట్ వ్యాపారి దేవేందర్ సింగ్ గుండె పోటుతో శనివారం మరణించారు. ఆయన మృత దేహాన్ని రాజస్థాన్ తీసుకువెళ్లటానికి పోస్టు మార్టమ్ రిపోర్ట్ కీలకమవుతుందని బావించిన బంధు మిత్రులు విషయాన్ని చీమకుర్తి పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. వారి కేసు నమోదు చేసి పోస్టు మార్టమ్ నిమిత్తం ఒంగోలు రిమ్స్ కు తరలించారు. అయితే పోస్టు మార్టమ్ ఇక్కడ కుదరదని, చీమకుర్తి తీసుకువెళ్లాలని రిమ్స్ సిబ్బంది తెలిపారు. మృతదేహం పాడవుతుందని పాడవుతుందని ఆందోళన చెందిన బంధుమిత్రులు విషయాన్ని బిజెపి నార్త్ ఇండియా సెల్ కన్వీనర్ శ్రీ విజయ్ మోదీ దృష్టికి బంధు మిత్రులు తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి స్థానిక ఒంగోలు నియోజక వర్గ బిజెపి కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్ దృష్టికి, రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి దృష్టికి, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ దృష్టికి, రిమ్స్ డైరెక్టర్ నామినేని కిరణ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వారు ఆయా మార్గాల ద్వారా రిమ్స్ అధికారులపై ఒత్తిడి పెంచటంతో ఎట్టకేలకు రెండు గంటలలో పోస్టు మార్టమ్ పూర్తి చేసి మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు. దీంతో గమనించిన ప్రజలు పరపతి ఉంటేనే పోస్టు మార్టమ్ కూడ పూర్తి అవుతుందనే విషయాన్ని చర్చించుకున్నారు.

# ప్రపంచాన్ని గెలిచిన ఎర్రంశెట్టి సిస్టర్స్

### టైక్వాండోలో బంగారం, వెండి మోత మోగించిన ఎర్రం శెట్టి సిస్టర్స్




విజయవాడ,ఆగస్టు25:ఏషియన్ టైక్వాండో ఛాంపియన్షిప్ విజేతలు గా ఇండియా కు చెందిన ఎర్రంశెట్టి శృతి బంగారు పతకం సాధించగా ఎర్రశెట్టి జశ్విత వెండి పతకం సాధించి టైక్వాండో వినీలీకాశంలో భారత దేశ జండాను ఏగరవేశారు.ఏషియన్ టైక్వాండో ఛాంపియన్ షిప్ 2024 టైక్వాండో పోటీలను మూడు రోజులపాటు విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలలో 13సంవత్సరాల బి కేటగిరీలో బాలికల విభాగంలో 45 కేజీలు విభాగంలో విజయవాడ కు చెందిన ఎర్రం శెట్టి శృతి గోల్డ్ మెడల్,ఎర్రం శెట్టి జశ్విత సిల్వర్ మెడల్ సాధించారం.అనంతరం ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ డాన్ డెల్టాన్ చేతుల మీదుగా మెడల్స్ స్వీకరించారు.ఎర్రం శెట్టి సిస్టర్స్ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం పట్ల టైక్వాండో కార్యదర్శి డివివి ప్రసాద్ అభినందించారు.అనంతరం ఇంటర్నేషనల్ టైక్వాండో ఇండియా గ్రాండ్ మాస్టర్ బి.వి.రమణయ్యఈ చిన్నారుల ఇద్దరినీ అభినందించారు.ఎర్రం శెట్టి సిస్టర్స్ తండ్రి న్యాయవాది రాజా కూడ గతంలో టైక్వాండో లో జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం గమనార్హం.

# ధర్మవరం లో ఉచిత వైద్య శిబిరంను ప్రారంభించిన

### ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభారాజా



**ప్రత్తిపాడు, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక)** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం గ్రామంలో స్థానిక ఉద్యోగ సంఘం సభ్యులు ఏర్పాటుచేసిన ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఆదివారం స్థానిక శాసన సభ్యురాలు వరుపుల సత్యాప్రభారజా ప్రారంభించారు ఈ వైద్య శిబిరంలో ధర్మవరంతో పాటు సమీప గ్రామాల ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ ప్రజలువైద్య సేవలు భరించడం ఈ రోజుల్లో ఎంతో ధనంతోవ్యయంతో కూడిన పనిఅని అటువంటిది ధర్మవరం ఉద్యోగుల సంఘం ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం మందులు కూడా ఉచితంగా పంపిణీ చేయడం అభినందించదగ్గ విషయమని ఎమ్మెల్యే అన్నారు ఇటువంటి శిబిరాల ద్వారా పేదలు వైద్య పరీక్షలు చేయించుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు ముఖ్యంగా ధర్మవరం గ్రామ ప్రజలు నాయకులు ఆధ్యాత్మికంగానూ ప్రజాసేవలోను ఇంచుమించుగా అన్ని రంగాల్లో ముందు ఉంటారని ధర్మవరం గ్రామ ప్రజలను శాసనసభ్యురాలు సత్యప్రభ అభినందించారు ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో మానవులకు అత్యవసర సేవలకు సంబంధించిన ప్రత్యేక వైద్య నిపుణులు హాజరై వివిధ రోగాలకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు ఈ మేరకు 1500 మంది కి వివిధ రకాల వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు కూడా ఇవ్వడం జరిగిందని వైద్య శిబిరం నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులుబొల్లుకొండబాబు కృష్ణ బాబు ప్రైవేటు విద్యాసంస్థ అధినేతదాడి చిన్నారావు ధర్మవరం గ్రామ ఉద్యోగులు పలువురు నాయకులు స్థానిక పెద్దలు పాల్గొన్నారు

# మాజీ మంత్రి శిద్దా సంతాపం

**ఒంగోలు ,ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక)** ప్రకాశం జిల్లా మాజీ శాసనసభ్యులు, మాజీ జడ్పీ చైర్మన్ పి. డేవిడ్ రాజు అనారోగ్యంతో మృతి చెందారన్న వార్త దిగ్భ్రాంతి కలిగించింది. ప్రకాశం జిల్లాలో డేవిడ్ రాజు సేవలు మనం మర్చిపోలేము జిల్లాలో గుర్తింపు పొందిన నాయకుడిగా జెడ్పి చైర్మన్ గా ప్రజప్రతినిధిగా ఆయన చేసిన సేవలు మర్చిపోలేనివి, ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు మాజీమంత్రి శిద్దా రాఘవ రావు ఒక ప్రకటన విడుదల చేశారు.

# 12వ పిఆర్సి కమిషనర్ ను వెంటనే నియమించాలి



**ఏలూరు, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక)**:ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఐఆర్ ప్రకటించాలని, అలాగే 12వ పిఆర్సి కమిషన్ ను తక్షణమే నియమించి ఉద్యోగులను ఆర్థికంగా ఆదుకోవాలని, ఏపీ జెఎసి అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశం ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆదివారం ఏలూరులోని రెవెన్యూ భవన్లో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశంలో 26 జిల్లాల చైర్మన్లు ప్రధాన కార్యదర్శులు పాల్గొని పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమావేశపు తీర్మానాలను చైర్మన్ బొప్పరాజు, సెక్రటరీ జనరల్ పాలిసెట్టి దామోదర్ రావు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ చైర్మన్ కే రమేష్ కుమార్ లు మీడియాకు వివరించారు. ఏపీ జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం నియమించిన 12వ పిఆర్సి కమిషనర్ రాజీనామా చేసినందున వెంటనే పిఆర్సి కమిషన్ను నియమించి నిర్ణీత కాలమరి పరిమితి లోపు 12వ పిఆర్సి అమలు చేసి గత 11వ పిఆర్సి సందర్భంగా నష్టపోయిన ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూల ధోరణితో వ్యవహరిస్తున్నందున గత ప్రభుత్వంలో జరిగిన నష్టాన్ని 12వ పిఆర్సి ద్వారా భర్తీ చేస్తుందని నమ్మకంతో రాష్ట్రంలోని 12 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయులు పెన్షనర్లు ఆశాభావంతో ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అడక్కుండానే ఉద్యోగుల సమస్యల పట్ల స్పందించి అనుకూల నిర్ణయాలు వెలువరించినందుకు 90 ఉద్యోగ సంఘాలతో కూడిన జేఏసీ ధన్యవాదాలు తెలియజేస్తుందని పేర్కొన్నారు. సెక్రటేరియట్ ఉద్యోగులకు హెచ్వోడీలకు ఐదు రోజుల పని దినాలను నిర్ణయిస్తూ జీవో విడుదల చేయడం, తాసిల్దార్లు ఎన్నికల విధులు పూర్తయిన వెంటనే వారం రోజుల్లోనే వారి సొంత జిల్లాలకు పంపడం, అలాగే గత పదేళ్ళుగా ఆంధ్రాలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు 122 మందిని తెలంగాణాకు తిరిగి పంపడం. పదవి విరమణ దగ్గరలో ఉన్న ఉద్యోగులను బదిలీల నుండి మినహాయించడం వంటి సానుకూల అంశాలు ఈ ప్రభుత్వం తీసుకోవడం పట్ల తమ సమావేశం హర్షం వెలిబుచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పెన్షనర్లకు చెల్లిస్తున్న అడిషనల్ కౌంటర్ ఆఫ్ పెన్షన్ స్లాబ్ లను గత ప్రభుత్వం 11వ పిఆర్సి చర్చలు సందర్భంగా కొత్తగా పెన్షనర్లకి పెంచకపోగా అప్పటివరకు పొందుతున్న స్లాబ్ తగ్గించారని ఇంతటి దుర్మార్గ చర్య గతంలో ఎన్నడు జరగలేదని, ప్రస్తుత ప్రభుత్వం పాత స్లాబుల ప్రకారం పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ చెల్లించాలని కోరారు.

అదేవిధంగా గత ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులు అందరిని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి కేవలం ఆరోగ్య శాఖలో వారిని మాత్రమే క్రమబద్ధీకరణ చేశారని , విద్యారంగంలోనూ ఇతర శాఖలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. అలాగే ఇప్పటివరకు పదవి విరమణ చేసిన ఉద్యోగులు ఉపాధ్యాయులకు పదవీ విరమణ బెనిఫిట్స్ అందడం లేదని ప్రతి ఉద్యోగి రిటైర్ తర్వాత వచ్చే బెనిఫిట్స్ తో తన కుటుంబ అవసరాలను తీర్చుకుంటారని, కానీ గత కొంతకాలంగా రిటైర్ అయిన ఉద్యోగులకు ఎటువంటి బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో రిటైర్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు.

# మనం ఎక్కడున్నా తెలుగు భాషా, సంస్కృతిని కాపాడుకోవాలి

**మహారాష్ట్ర థానేలో తెలుగు సభలో పాల్గొన్న రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్**





**రాజమహేంద్రవరం, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**అమ్మలాంటి మాతృ భాష తెలుగు యొక్క ఔనత్యాన్ని భావితరాలకు తెలియచేయాలనే సంకల్పంతో థానేలో వున్న తెలుగువారంతా కలిసి తెలుగు మహాసభ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో థానే నగరంలోని డాక్టర్ కాశీనాథ్ ఘనేకర్ ఏసీ ఆడిటోరియంలో తెలుగు మహాసభను అంగరంగ వైభవంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఉద్యోగ,వ్యాపార, పరిశ్రమల ఏర్పాటు కోసం మహారాష్ట్రకు వలస వెళ్లిన తెలుగువారు ప్రతి ఏటా ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ తరపున తెలుగు మహాసభలు ఆనవాయితీగా నిర్వహించుకోవడం జరుగుతుంది. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా కవి, ప్రముఖ సాహిత్య వేత్త, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత మంత్రి కందుల దుర్గేష్‌కు, జొన్నవిత్తులకు మహారాష్ట్ర థానే తెలుగు అసోసియేషన్ చైర్మన్ రమణ, అధ్యక్షులు జగన్ బాబు, విద్యాసంస్థలు అధినేత ఎ.వి.గుప్తా, గురవరెడ్డి, సత్యమూర్తి తదితరులు పూర్ణకుంభంతో అఖండ స్వాగతం పలికారు. ముందుగా సభలో తెలుగుదనం ఉట్టిపడేలా కూచిపూడి, భరతనాట్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, మహారాష్ట్ర లోని థానే ప్రాంతంలో తెలుగు అసోసియేషన్ వారు అంతా కలిసి ఏర్పాటు చేసిన తెలుగు సభలో పాల్గొనడం తనకెంతో సంతోషంగా వుందన్నారు. అమ్మలాంటి మాతృ భాష తెలుగు భాషను కాపాడుకునేందుకు, దాని ఔనత్యాన్ని భావితరాలకు తెలియజేసేందుకు ఇక్కడ తెలుగువారంతా కలిసి ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయం అని దుర్గేష్ అన్నారు. మనం ఎక్కడున్నా తెలుగు భాష, సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోకూడదన్నారు. మన భాష ఎంతో మధురమైనదని, దేశభాషలందు తెలుగు లెస్స అని పేర్కొన్నారు. అందరం కలిసి ఐకమత్యంగా ఆర్థికంగా ఎదగాలని, ఒకరినొకరు చేదోడు వాదోడుగా ఉండాలని మహారాష్ట్ర థానేలో తెలుగు ఫెడరేషన్ పెట్టుకోవడం, ప్రతి ఏటా తెలుగు రాష్ట్రాల నుంచి ప్రముఖులను ఆహ్వానించి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. మీరంతా వ్యాపార, ఉద్యోగ రీత్యా ఇక్కడికి వచ్చిన మనప్రాంతాన్ని మన సంస్కృతిని, మన భాషను మరిచిపోకుండా వాటి ఔనత్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేయడం చూస్తుంటే ఎంతో ఆనందం వేస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో పర్యటించి తెలుగు సభల్లో పాల్గొనడం గొప్పకాదని, ఇలా ఇతర రాష్ట్రాల్లో తెలుగువారు తమ మాతృ భాషను కాపాడుకునేందుకు, అందులో ఉన్న మమకారాన్ని ఆస్వాదించేందుకు చేస్తున్న ఇలాంటి సభల్లో తాను పాల్గొనడం మహాభాగ్యంగా భావిస్తున్నానని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్ తెలుగు భాషాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. తెలుగువారి కోసం ఎలాంటి సహకారం కావాల్సి వచ్చినా తమ కూటమి ప్రభుత్వం అందిస్తామని, ఏపీలో పెట్టుబడులు పెట్టే వారికి ఇతోధిక ప్రోత్సహం అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు . సుదీర్ఘ కాలంపాటు తెలుగుప్రజల కోసం, తెలుగుభాషాభివృద్ధి కోసం ఇలాంటి సభలు నిర్వహించి కృషి చేస్తున్న తెలుగు అసోసియేషన్ నిర్వాహకులు పివీ రమణ, గంజి జగన్ బాబుకు మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందనలు తెలపడమే కాకుండా తనను ఈ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదనం ఉట్టిపడేలా తెలుగువాడి నాడి నలుదిశలా సాటిచెపుతున్న ప్రముఖ సాహిత్యవేత్త జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు సభలో మాట్లాడారు. సభకు పెద్ద సంఖ్యలో తెలుగువారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పడిన తెలంగాణ–ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ బ్యానర్ ను మంత్రి కందులు దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్‌ను, జొన్నవిత్తులను ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ మహారాష్ట్ర నిర్వాకులు ఘనంగా సత్కరించారు.



## బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు

**మొగల్తూరు, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం దూర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చ క్యూలో నిలబడి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి దెందుకూరు రామకృష్ణారావు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా పర్యవేక్షణ నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో దర్శించుకున్న భక్తులకు అరటి పళ్ళు మరియు పులిహోర ప్రసాదమును పంపిణీ చేశారు.

## వాడ్రాపల్లి యువకునికి ఆస్ట్రాలజీలో గౌరవ డాక్టరేట్



**మునగపాక, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**పుట్టిన జాతకం చక్రం ప్రకారం విద్యలో ఎంతవరకు ప్రయోజకులు అవుతారనే అంశంపై ఆస్ట్రాలజీలో పరిశోధన చేసిన అనకాపల్లి జిల్లా మునగపాక మండలం వాడ్రాపల్లి గ్రామానికి చెందిన కొయిలాడ వేణుగోపాలనాయుడు పీహెచ్‌డీ పొందారు. రాజస్థాన్ ఉదయపూర్ మహారుషి కాలేజీలో వేదిక్ సైన్స్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ ఇస్రో చైర్మన్ కృష్ణకాంతశర్మ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. ఆస్ట్రాలజీలో పీహెచ్డీ పూర్తి చేసిన వేణుగో పాలనాయుడుని మిత్రులు, శ్రేయోభిలాషులు, వాడ్రాపల్లి గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో వికాస్ చౌహాన్ పాల్గొన్నారు.

## శ్వాసకోస బాధితురాలికి కంబాల శ్రీనివాసరావు ఆర్థిక సాయం

**అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా**



**గోకవరం, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**ఊపిరితిత్తుల సమస్య కారణంగా శ్వాస కోస వ్యాధితో గత రెండు నెలలు నుంచి బాధపడుతున్న గోకవరంనకు చెందిన కందుకూరిలక్ష్మికి విశ్వ హిందు ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం అయన స్వయంగా ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యం ఉండాలని తన వంతు సహాయ సహకారం అందిస్తానని కుటుంబ సభ్యులకి,ఆమెకు ధైర్యం చెప్పి, అన్ని విధాల అండగా ఉంటామని, ఆరోగ్యం త్వరలోనే నయమవుతుందని మనోధైర్యం కల్పించారు. ఈసందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కందుకూరి లక్ష్మి కుమారుడు సుధాకర్ తన వద్దకు వచ్చి సుధాకర్ అమ్మ అనారోగ్య పరిస్థితి తనకు తెలపడం జరిగిందన్నారు. తక్షణమే స్పందించి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన సంస్థ తరఫున 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందించానన్నారు. ఈకార్యక్రమంలో గోకవరం గ్రామ పెద్దలు దాసరి తమ్మన్న దొర, విశ్వ హింద ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాధరావు శర్మ, కట్ట నూకేశ్వర విజయ్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.



## చంద్రశేఖర్ మహాస్వామి పిరమిడ్ ధ్యానకేంద్రం ఆరవ వార్షికోత్సవం

**మునగపాక, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**నాగులాపల్లిలో గల చంద్రశేఖర్ మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆరవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మళ్ల సూర్యారావు మాట్లాడుతూ ఈ ధ్యాన కేంద్రం ఓ శక్తి కేంద్రంలో పనిచేస్తుందని అభిప్రాయపడ్డారు. ఎంతో మందిని మానసకంగా, ఉన్నతంగా తీర్చిదిద్దటంతో పాటు విద్యార్థులను ఉన్నత విద్యకు ప్రోత్సహించడంలో సుజాత అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయం అన్నారు. ధ్యాన గురువు, అనకాపల్లి రోటరీ క్లబ్ కార్యదర్శి దేవత అనిల్, ఎంఈఓ మళ్ల సూర్యారావు, బ్రహ్మకుమారి అక్కయ్య, సోమేశ్వరమ్మలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శశికళ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు. మిమిక్రీ కృష్ణ తమ మిమిక్రీ తో అలరించారు. నాగులాపల్లి కోలాటం బృందం, వాణి బాల బృందం వీణతో పాటలు పాడి అలరించారు. కోయిలాడ శివాజీ గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

## సీనియర్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు పత్సమట్ల సుబ్బరాజును ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం / జగ్గంపేట ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**జగ్గంపేట–గోకవరం రోడ్డులో కాపు కళ్యాణ మండపంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ నిర్వహిస్తున్న టెట్, డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్‌కు సీనియర్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు పత్సమట్ల సుబ్బరాజు విచ్చేసి డీఎస్సీ అభ్యర్థులకు ఆదివారం ఇంగ్లీష్ ఫ్యాకల్టీ వివరిస్తూ బోధన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. సుబ్బరాజు మాట్లాడుతూ, ఎంతో ప్రతిష్టాత్మక జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ ఉచిత కోచింగ్ సెంటర్ బోధన ఇవ్వడానికి నన్ను ఎమ్మెల్యే పిలవడం వెంటనే వచ్చి ఈమహత్తర కార్యక్రమంలో పాలుపంచుకోవడం చాలా ఆనందంగా ఉందని ఇంతటి మహాకార్యాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యేని ఈసందర్భంగా అభినందిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కొత్త కొండబాబు, గోకేడ రాంబాబు, ముసిరెడ్డి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ నీలం చక్రధర్, బాలాజీ, పుర్రె సూరన్న, సురేషు, గద్దె మారుతి, తదితరులు పాల్గొన్నారు.

## చెరువులను తలపిస్తున్న రోడ్లు



**రావికమతం, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**మండల కేంద్రం హీరో ద్విచక్ర వాహన షోరూం వద్ద భీమిలి నుంచి నర్సీపట్నం పోవు రోడ్డు ఆదివారం రోడ్డుకు మధ్యలో ఉన్న గోతుల నీటిలో పాడి పశువులు స్నానాలు చేస్తున్నాయి. ఇది చూసిన ద్విచక్ర వాహన చోధకులు, అటుగా వెళ్లే ప్రయాణికులు చెరువులను తలపిస్తున్న రోడ్లను చూసి నవ్వుకుంటున్నారు. పాడి పశువులు సైతం రోడ్డు మధ్యలో ఉన్న గుంతల్లో ఉన్న నీటిలో పడుకొని ఎంజాయ్ చేస్తున్నాయి. రోడ్లు ఇలా చిదిలావస్థకు చేరుకున్నప్పటికీ అధికారులు స్పందించలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

## సీనియర్ జర్నలిస్టు ఆడారి కొండలరావు గ్రంధాలు వితరణ



**విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**విశాఖ దక్షిణ నియోజకవర్గం, అల్లిపురం లోని గ్రంథాలయానికి, సీనియర్ జర్నలిస్ట్ ఆడారి కొండలరావు రూ.20 వేల విలువైన గ్రంథాలను అందజేశారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాహిత్య గ్రంథాలతో పాటు జర్నలిజానికి సంబంధించిన ఎన్నో విలువైన గ్రంథాలను అల్లిపురం వెంకటేశ్వర మెట్ట పై ఉన్న శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం కు విరాళంగా అందజేశారు. ఆదివారం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ వితరణ సందర్భంగా ఆడారి కొండలరావు మాట్లాడుతూ, గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలు అన్నారు. గ్రంథాలు పఠనం వల్ల జ్ఞానం, విజ్ఞానం, పరిజ్ఞానం అద్భుతాయన్నారు. వీటిలో ఏది లేకపోయినా మనిషికి మిగిలేది అజ్ఞానమే అన్నారు. నిప్పులో చేయి పెడితే కాలుతుందని తెలుసుకో వటం జ్ఞానం. దీనితోపాటు నిప్పు ఎన్ని రకాలుగా పుడుతుందో తెలుసుకోవడం విజ్ఞానం. నిప్పును ఎలా ఉపయోగించు కోవాలో తెలిసి ఉండడం పరిజ్ఞానం అంటూ ఆయన ఉదహరించారు. పాలకులు గ్రంథాలయాల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అయితే వీటిని కాపాడుకోవలసిన అవసరం సామాజిక వేత్తలపైన, ప్రజల పైన ఉందన్నారు. చినిగిన చొక్కా అయినా వేసుకో, కానీ ఒక మంచి పుస్తకాన్ని కొనుక్కో అని సామాజికవేత్త చలం అన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం పాలకవర్గం సభ్యులు పాల్గొని కొండలరావును అభినందించారు.

## క్రీడాకారులను గ్రామీణ యువజన మందిరం ప్రోత్సాహిస్తుంది

**- గ్రామీణ యువజన మందిరం స్పోర్ట్స్ చైర్మన్ పెంటకోట విజయ్**



**మునగపాక, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):** మునగపాక వాలీబాల్ క్రీడాకారుల్ని ప్రోత్స హిస్తూ గ్రామీణ యువజన మందిరం స్పోర్ట్స్ చైర్మన్ పెంటకోట విజయ్, కర్రీ సాయి కృష్ణని ముఖ్యఅతిథిగా ఆహ్వానించి వారి చేతుల మీదుగా టీషర్ట్స్‌ని వాలీబాల్ క్రీడాకా రులకి పంపిణీ చేయడం జరిగింది. పెంట కోట విజయ్ మాట్లాడుతూ క్రీడలు అనేవి మానసిక ఉత్సాహం, శారీరక ఉత్సాహం పెంపొందిస్తాయని విజయ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ యువజన మందిరం ఉపాధ్యక్షుడు దాడి అప్పలనాయుడు, సెక్రటరీ ఆడారి సోమశేఖర్ అలాగే సీనియర్ క్రీడాకారులందరూ పాల్గొన్నారు.

## శ్రీ సిద్ధి విఘ్నేశ్వర స్వామి వారి అన్న ప్రసాదములకు విరాళం



**అయినవిల్లి. ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):** కే.గంగవరం వాస్తవ్యులు అల్లూరి వెంకటరావు, లక్ష్మీ జానకి దంపతులు శ్రీ విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి అన్నప్రసాద ట్రస్ట్‌నకు విరాళంగా రూ.10,116/–లు ఇచ్చినారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రముతో సత్కరించి శ్రీ స్వామి వారి చిత్రపట మును అందజేసినారు.

## గురుకులంలో ఎస్సీ, ఎస్టీ మిగుల సీట్లకు యుద్ధ ప్రాతిపదికన ప్రవేశాలు

**ప్రవేశాలకు చివరి తేదీ ఈ నెల 30..**



**వేపాడ,ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**మండల కేంద్రం వేపాడ పంచాయతీ శివారు బక్కు నాయుడుపేట గ్రామంలో గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. 2024 –25 విద్యా సంవత్సరానికి గాను నేటి వరకు మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నామని,దరఖాస్తు చేసుకొనుటకు ఆఖరు తేది ఈనెల 30వ తేదీ అని ప్రిన్సిపాల్ తెలిపారు. పాఠశాలలో మిగులు సీట్ల వివరాలు 5వ తరగతికి సంబంధించి ఎస్సీ, ఎస్టి 34 సీట్లు,6వ తరగతికి 8సీట్లు,7వ తరగతికి 10సీట్లు,8వ తరగతికి 14 సీట్లు,9వ తరగతికి 13సీట్లు ఎస్సీ, ఎస్టీ, విద్యార్థినులకు మిగిలి ఉన్నాయని ఆమె తెలిపారు.దరఖాస్తు చేసుకోవలసిన విద్యార్థులు కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు, ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ (టిసి ),విద్యార్థిని ఆధార్ తో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, విద్యార్థిని 5 పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోస్,కుటుంబం గ్రూప్ ఫోటోతో పాటు నేరుగా పాఠశాలకు వచ్చి పాఠశాలలో చేరవచ్చును అన్నారు.ఈ అవకాశాన్ని ఎస్సీ,ఎస్టీ విద్యార్థులలో వినియోగించుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

## తండ్రి ద్వితీయ వర్ధంతి రోజున అన్నదానం

**అన్నార్తుల ఆకలి తీర్చిన గాలి వారి కుటుంబం**

**100 మంది నిరుపేదలకు పార్శిల్స్ అందజేత**







**వేపాడ, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**తల్లిదండ్రులు ఉన్నా లేకున్నా వారి గత స్మృతులు మనలను ఎల్లప్పుడూ వెంటాడుతూనే ఉంటాయి. బ్రతికి ఉన్నప్పుడు వారి విలువను తెలుసుకోలేకపోయినా మరణించిన తర్వాత అయినా గుర్తించగలిగితే వారి పేరు మీద కొన్నైనా మంచి పనులు చేయొచ్చు.మన పిల్లలచేత కూడా అటువంటి మంచి పనులు చేయించే అవకాశం కల్పించవచ్చు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని అరిగిపాలెం గ్రామంలో గాలి వారి కుటుంబం చేసిన ఓ మంచి పని గ్రామంలోని అందరూ చర్చించుకునేలా చేసింది.గ్రామానికి చెందిన స్వర్గీయ గాలి అక్కులు రెండేళ్ల క్రితం ఇదే రోజున అనారోగ్యంతో మృతి చెందారు.మొదటి వర్ధంతి రోజున గ్రామంలో అందరికీ బోజనాలు పెట్టినప్పటికీ వారిలో ఏదో వెల్తి కనిపించింది. చుట్టాలు బంధువులకు ఏదో ఫంక్షన్ సందర్భంగా బోజనాలు ఎలాగు పెడతాం. నిరుపేదల ఆకలి ఒక రోజైనా తీర్చగలిగితే తండ్రి ఆత్మకు శాంతి కలుగుతుందని భావించారు.తండ్రి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని స్వర్గీయ అక్కులు భార్య,పిల్లలు ఇంటి వద్ద వంటలు చేయించి పార్శిల్ చేసి విశాఖలోని పలు ప్రాంతాలలో ఆకలితో ఫుట్ పాత్ లపై జీవించే 100మంది అన్నార్తులకు అందజేసి వారిలో తండ్రిని చూసుకున్న అనుభూతిని పొందారు. తండ్రి పేరు మీద చేసిన ఈ అన్నదానం పలువురికి ఆదర్శప్రాయం కాగా ఈ విషయం తెలుసుకున్న స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




ఆంధ్రపత్రిక ఫొటోలు: సిహెచ్.విజయభాస్కర్

# విజయవాడలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించిన ఇస్కాన్...






## ఆంధ్రపత్రిక వార్షికోత్సవ ప్రత్యేక సంచికను

# ఆవిష్కరణ



### ఆవిష్కరించిన మాడుగుల ఎమ్మెల్యే

**కె.కోటపాడు, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**స్వాతంత్ర్య సమరంలో అక్షర ఆయుధాలను అందించి ఘన చరిత్ర కలిగిన తెలుగు దినపత్రిక "ఆంధ్రపత్రిక" వార్షికోత్సవ "ప్రత్యేక సంచిక"ను మాడుగుల శాసనసభ్యులు, రాష్ట్ర మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి ఆవిష్కరించారు. తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్చార్జి, కింతాడ గ్రామ కమిటీ అధ్యక్షుడు కన్నూరు సూర్యనారాయణ స్వగృహంలో ఆంధ్రపత్రిక విలేకరి కుబిరెడ్డి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే సత్యనారాయణ మూర్తి ఆంధ్రపత్రిక "వార్షికోత్సవ" ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రొంగలి మహేష్, పంచాయతీ రాజ్ ఛాంబర్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు, చౌడువాడ సర్పంచి దాడి ఎరుకునాయుడు, ఆంధ్రపత్రిక అభిమానులు గొంప దేముళ్లు, కన్నూరు ముత్యాలనాయుడు, చుక్క పవన్ కుమార్, గనివాడ జగన్నాథం, బండారు రాము, కన్నూరు గౌరి తదితరులు పాల్గొన్నారు.

## సామాన్య కార్యకర్తకు

# అత్యున్నత స్థానం



వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్

**గుంటూరు,ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):** బిజెపి జిల్లా కార్యాలయం నందు భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా కార్యశాల అధ్యక్షులు వనమా నరేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై .సత్య కుమార్ యాదవ్ విచ్చేశారు. ఈ సందర్భంగా వై.సత్యకుమార్ మాట్లాడుతూ సిద్ధాంత ప్రాతిపదికన సభ్యత్వ నమోదు చేసే పార్టీ బిజెపి అని సామాన్య కార్యకరకు అత్యున్నత స్థాయి కల్పించిన పార్టీ బిజెపి అన్నారు. ముఖ్యంగా గడిచిన కాలంలో బిజెపి ద్వారానే భారతదేశం అభివృద్ధి పథంలో నడిచింది అని ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ యొక్క పరిపాలన ద్వారా భారతదేశానికి ప్రపంచంలో ఒక ప్రత్యేక గుర్తింపు రావటం గర్వకారణమని అన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా భారతదేశంలో పరిపాలన ప్రపంచానికి ఒక ఆదర్శంగా నిలిచిందని అటువంటి ఒక సిద్ధాంతపరమైన పాలనతో ముందుకు సాగుతున్న బిజెపితోనే పేదరిక నిర్మూలన సాధ్యమన్నారు.

## నాకు రాజకీయ భిక్ష పెట్టిన వ్యక్తి

# ఎన్టీఆర్



### అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

**గుంటూరు,ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**తాను 25 ఏళ్లకే ఎమ్మెల్యే కావడానికి ఎన్టీఆరే కారణమని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆదివారం గుంటూరులోని ఎన్టీఆర్ కల్చరల్ అసోషియేషన్ 55 వసంతాల వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. "ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వస్తున్నారంటే ఎంతోమంది విమర్శించారు. కానీ, ఆయన రాజకీయాల్లో రాణిస్తారని 25 ఏళ్ల వయసులోనే నేను నమ్మాను. నాకు రాజకీయ భిక్ష పెట్టిన వ్యక్తి ఎన్టీఆర్. చిన్న వయసులోనే మంత్రిని అయ్యే అవకాశమిచ్చారు. కుటుంబ విలువలు చాటి చెబుతూ అనేక సినిమాలు తీశారు. మహిళలంటే ఆయనకు ఎంతో గౌరవం. మహిళలకు ఆస్తి హక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన గొప్ప వ్యక్తి. ఈ తరం వారికి ఎన్టీఆర్ గొప్పతనం గురించి చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది.







## ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఘనంగా

# ఫౌండర్స్ డే

**అమరావతి, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**ఏపీ ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో ఆదివారం ఫౌండర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఆవరణలోని ప్రేరణ వనంలో వైస్ ఛాన్సర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియ జేస్తూ వివిధ రకాల మొక్కలను నాటారు. అనంతరం మంగళగిరి, కాజా ప్రాంతాల్లోని అనాధ విద్యార్థులు, వయో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు యూనివర్సిటీ ఆడిటోరియంలో రెండవ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది వైస్ ఛాన్స లర్ మనోజ్ అరోరా, రిజిస్ట్రార్ ఆర్ ప్రేమ్ కుమార్‌లు ప్రసంగించారు. యూనివర్సిటీ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని వీసీ కోరారు. యూనివర్సిటీ పూర్వ విద్యార్థిని మరియు దక్షిణ భారత సినీ నటి కుమారి ఈశ్వరి మీనన్ ఆన్ లైన్ పద్ధతిలో కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లు రేవతీ, అనూప్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ కేంద్రంగా 'దక్షిణ కోస్తా'

# రైల్వే జోన్!

### - జోరందుకుంటున్న ప్రక్రియ



**విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**విశాఖ కేంద్రంగా 'దక్షిణ కోస్తా' రైల్వే జోన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. జోన్ కార్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు విశాఖ పర్యటనలో కీలక ప్రాజెక్టుల మీద సమీక్షించారు. ఈ సందర్భంగా రైల్వే జోన్‌కు సంబంధించిన భూములు అప్పగించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను ఆదేశించారు. ఆ తర్వాత ఈ ప్రక్రియ జోరందుకుంది. విశాఖ నగరంలోని చినగదిలి పరిధి ముడసర్లోవ వద్ద గతంలో రైల్వేకు కేటాయించిన భూములను జీవీఎంసీ, రైల్వే అధికారులు పరిశీలించారు. 52 ఎకరాల వాస్తవ స్థితిని పరిశీలించి.. హద్దులు నిర్ణయించి.. ఎటువంటి ఆక్రమణలు లేవని గుర్తించి జీవీఎంసీ అధికారులు నివేదిక సిద్ధం చేశారు. దీన్ని త్వరలోనే రైల్వేకు పంపించి బదిలీ ప్రక్రియ పూర్తిచేయనున్నారు. రైల్వే అధికారులు ఆ స్థలాన్ని తీసుకునేందుకు సుముఖంగానే ఉన్నప్పటికీ వివాదాలను పూర్తిస్థాయిలో పరిష్కరించి అప్పగించాలని కోరుతున్నారు. గతంలో ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించుకోగా వారందరిని ఖాళీ చేయించారు. అప్పట్లో రైల్వే అధికారులు దాన్ని స్వాధీనం చేసుకోడానికి వెళ్లగా వారి మీదే కేసులు పెట్టారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని పూర్తిహక్కులతో, ప్రహరీ నిర్మించి స్థలాన్ని అప్పగించాలని రైల్వే అధికారులు కోరుతున్నారు. ఈ స్థలంపై తొలుత రైల్వే కొంత విముఖత చూపింది. అయితే ప్రత్యామ్నాయ స్థలాలు విశాఖకు దూరంగా ఉండడం, జోన్ కార్యాలయం విశాఖకు దూరంగా ఉంటే బాగోదన్న ఉద్దేశంతో ముడసర్లోవలోనే ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



## డిసెంబర్‌లో అమరావతి

# అమర వీరుల స్తూపం నిర్మాణం

### త్వరలో సిఎంను కలుస్తాం స్మారక కమిటీ కార్యదర్శి పోతుల బాలకోటయ్య వెల్లడి..

**విజయవాడ, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**ఈ ఏడాది డిసెంబర్‌లో ప్రజా రాజధాని అమరావతి అమర వీరుల స్మారక స్థూప నిర్మాణం పూర్తి చేయనున్నట్లు అమరావతి అమరవీరుల స్మారక కమిటీ కార్యదర్శి పోతుల బాలకోటయ్య తెలిపారు. ఆదివారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. చికాగోలోని ఎన్ఆర్ఐ యలమంచిలి ప్రసాద్, పలువురు కమిటీ సభ్యుల పర్యవేక్షణలో మృతుల వివరాలు, స్థల పరిశీలన కొంత మేరకు పూర్తి చేసినట్లు చెప్పారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు అన్ని వివరాలతో స్థూప నిర్మాణ అవశ్యకతపై నివేదిక ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 1631 రోజులు జరిగిన చారిత్రాత్మక రాజధాని ఉద్యమంలో 272 మంది రైతులు, ఉద్యమ నాయకులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నాటి ప్రభుత్వ వేధింపులకు మృతి చెందారని, వీరిలో రాజధానికి భూములు ఇచ్చిన రైతులతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతి ఉండాలని ఉద్యమానికి సహాయ, సహకారాలు అందించిన వారు కూడా ఉన్నారన్నారు.

ఇప్పటికే భూములు ఇచ్చిన గ్రామాల్లో చనిపోయిన వారి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. స్తూప నిర్మాణానికి సంబంధించి స్థల పరిశీలన జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఇదో చారిత్రాత్మక ఘటంగా ఉంటుందని, ఒక రాజధాని కొరకు భూములను త్యాగం చేసిన రైతులు, అదే రాజధాని కోసం కూడా రక్కసి నాయకుడిపై చేసిన శాంతియుత యుద్ధానికి సాక్ష్యం అవుతోందని అభిప్రాయపడ్డారు. త్వరలో ఇద్దరు ఎన్ఆర్ఐలు కూడా స్తూప నిర్మాణ కార్యక్రమాలను పరిశీలించేందుకు వస్తున్నట్లు బాలకోటయ్య వివరించారు.



## తిరుమలలో అదనపు ఇఓ

# తనిఖీలు

**తిరుమల, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):** తిరుమలలో ఆలయ నాలుగు మాడ వీధులు, లడ్డూ కౌంటర్లను ఆదివారం టీటీడీ అదనపు ఇఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఓ లోకనాథం, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా అక్టోబర్ 4 నుండి జరుగునున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన గరుడ సేవ రోజున లక్షలాదిగా విచ్చేసే భక్తుల ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలను పరిశీలించారు. అనంతరం లడ్డూ ప్రసాదం కాంప్లెక్స్‌ను పరిశీలించి, భక్తులు రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో అధిక సమయం వేచి ఉండకుండా, త్వరితగతిన లడ్డూలను పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు ఇఓ వెంట విజిఓ సురేంద్ర, ఆలయ ఎవిఎస్ఓ మనోహర్ తదితరులు ఉన్నారు.

# ఏపీలోనూ హైడ్రా ఉండాలి




### ఏఐసీసీ మెంబర్ కొలనుకొండ శివాజీ

**విజయవాడ, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):**విజయవాడ గాంధీనగర్‌లోని కార్యాలయంలో ఏఐసీసీ సభ్యులు కొలనుకొండ శివాజీ మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరంలో చెరువుల్ని కబ్జా చేసి భారీ కట్టడాలు నిర్మించిన ఫలితంగా చిన్నపాటి వర్షాలకే డ్రెయిన్లు పొంగి పొర్లి నగరం జలమయమై జనజీవనం అస్తవ్యస్తమై ప్రజలు ప్రాణాలకు ముప్పుగా మారిన నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం హైడ్రా పేరుతో కొత్త నిబంధనలు తీసుకొచ్చి భారీ కట్టడాలు, అక్రమణ నిర్మాణాలను కూల్చి వేస్తున్న సంగతి తెలిసిందే. అదే రీతిలో ఆంధ్రా రాజధాని నగరం విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సహా సీఆర్‌డీఏ పరిధిలో ఇరిగేషన్, దేవాదాయ ధర్మాదాయ తదితర ప్రభుత్వ శాఖల పరిధిలో చెరువులు, వాగులు, వంకలపై భూకబ్జాలు, అక్రమ నిర్మాణాల నిరోధంపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే విజయవాడ నగరం చిన్నపాటి వర్షానికే అతలాకుతలం అవుతోంది. డ్రెయినేజి అస్తవ్యస్తంగా తయారైంది. లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయి. ముఖ్యంగా బుడమేరు నదీగర్భాన్ని భూమాఫియా ఆక్రమించి ఇష్టారీతిగానిర్మాణాలు చేపట్టడం వల్ల వర్షాకాలం, తుపానులు సంభవించినప్పుడు బుడమేరు నగరాన్ని ముంచెత్తుతోంది. ముంపుకు గురయ్యే ప్రాంతాల్లో వేలాదిమంది నివాసాలుండటం మూలంగా అక్కడి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం కష్ట సాధ్యంగా మారింది. దీంతోపాటు ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. అసలే ఇరుకురోడ్లకు తోడు ఆక్రమణల మూలంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. రాజధాని అమరావతి నిర్మాణ కార్యకలాపాలు ఊపందుకున్న నేపథ్యంలో విజయవాడలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిన పోయింది. అలాగే విజయవాడ నగరంలో పెద్ద ఎత్తున ఖాళీ ఇరిగేషన్ స్థలాలు, కాలువగట్లు, కృష్ణా నదీపరీవాహక ప్రాంతంలో సీఆర్‌జెడ్ (కోస్టల్ రెగ్యులేటరీ జోన్) నిబంధనలు అతిక్రమించి చేసిన నిర్మాణాలను కూడా తక్షణం కూల్చివేయాలి. అలాగే కొల్లేరు సరస్సు ఆక్రమణలు, కొత్తూరు తాడేపల్లి, అడవి నెక్కలం, మైలవరం రిజర్వు అటవీ భూముల్లో మట్టి తవ్వకాలు, ఇష్టారీతిగా సాగుతున్నాయి. ఇవన్నీ జరగకుండా కాపాడటానికి ప్రభుత్వం వద్ద తగిన వ్యవస్థ లేదు. భవిష్యత్తు అవసరాలు, తరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆస్తుల్ని కాపాడుకోటానికి, ప్రజా క్షేమం దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వ తరహాలో హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుని స్వయంగా పర్యవే క్షించాలని కొలనుకొండ శివాజీ కోరారు.

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh,
and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com